అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 9-5-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 128 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు వెల : 6.50

నాడు రైతులు..నేడు రెజ్లర్లు

- అపుడు రోడ్లపై మేకులు..ఇపుడు బారికేడ్లకు వెల్డింగ్
- మోడీ సర్కార్ తీరుపై సర్వత్రా విమర్శలు





వివరాలు 2లో..



మా ప్రభుత్వం వస్తే..

ఏటా 2 లక్షల కొలువులు ...జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం

రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ తన కార్యాచరణను ప్రకటించింది. రాష్ట్రంలోని యువతే లక్ష్యంగా 'యూత్ డిక్లరేషన్' పేరుతో నిర్వహించిన సభలో వారిని ఆకర్షించేందుకు పలు హామీలను గుప్పించారు. హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన ఈ బహిరంగ సభలో కేసీఆర్ సర్కార్‌పై ఆ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ విరుచుకుపడ్డారు. తెలంగాణ ఏర్పాటు, బలిదానాలు, నిరుద్యోగ భృతి తదితరాంశాలను ఆమె ఏకరువు పెట్టారు. హామీలు నెరవేర్చకపోతే తమ ప్రభుత్వాన్నయినా కూల్చేయండంటూ ప్రజలకు సూచించారు. కాకపోతే ఒక జాతీయ పార్టీ నేతగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఆమె పల్లెత్తుమాట అనకపోవటం ఇక్కడ గమనార్హం.

- అమరుల తల్లిదండ్రులకు నెలకు రూ.25 వేల పెన్షన్
- హామీలు నెరవేర్చకపోతే మా సర్కారునూ కూల్చేయండి
- తెలంగాణ నేల మాత్రమే కాదు.. తల్లి
- ఏ ఒక్కరో పోరాడితే రాష్ట్రం రాలేదు • ఎందరో ఆత్మ బలిదానాలు చేశారు
- మా కుటుంబమూ బలిదానాలు చేసింది • ఆ బాధేంటో మాకు తెలుసు
- ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ నెరవేర్చలేదు : ప్రియాంక గాంధీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ నేల కాదు.. తల్లి వంటిది' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. 40 ఏండ్ల క్రితం చనిపోయిన ఇందిరమ్మను గుర్తు పెట్టుకున్న తెలంగాణ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వలేమని ఆమె స్పష్టం చేశారు. పూర్తి బాధ్యతతోనే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని తెలిపారు. అదే బాధ్యతతో యూత్ డిక్లరేషన్‌ను ప్రకటిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక హామీలు ...2లో

పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 75శాతం కోటా

- యువతకు రూ.10లక్షలు వడ్డీ లేని రుణాలు
- పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేక విద్యాలయాలు
- చదువుకునే 18 ఏండ్లు పైబడిన విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు : యూత్ డిక్లరేషన్ ప్రకటించిన రేవంత్ రెడ్డి



వివరాలు 2లో..

అవినీతికి అవిభక్త కవలలు ప్రధాని, అదానీ...

రైతుల సంపద డబుల్ చేస్తామని చెప్పి.. కష్టాలు డబుల్ చేశారు

- తెలంగాణ కొంగు బంగారం సింగరేణిని ప్రయివేటీకరిస్తే ఊరుకునేది లేదు
- రెండు నెలల్లో ఇండస్ట్రీయల్, ఐటీ పార్కులకు శంకుస్థాపన : ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్
- హోం మంత్రితో కలిసి రామగుండం పోలీసు కమిషనరేట్ ప్రారంభం



నవతెలంగాణ-గోదావరిఖని

అవినీతికి అవిభక్త కవలలు ప్రధాని, అదానీ అని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) అన్నారు. ప్రధాని మోడీ బడా పారిశ్రామిక వేత్త అదానీకి దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో సోమవారం పర్యటించిన మంత్రి కేటీఆర్.. గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాటు చేసిన నవ నిర్మాణ సభలో ప్రసంగించారు. దేశ సంపదను మోడీ అదానీకి కట్టబెట్టాడన్నారు. రైతుల సంపద డబుల్ చేస్తామన్న మోడీ, వారి కష్టాలు డబుల్ చేశాడని ఆరోపించారు. సింగరేణి ప్రయివేటీకరణ చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ సహకారంతో సింగరేణిలో పెను మార్పులు వచ్చాయనీ, కోల్ ఇండియాకే ఆదర్శంగా సింగరేణి నిలిచిందన్నారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు సరిహద్దులో ఉండే సైనికులకు తేడాలేదనీ, తమ జీవితాలను పణంగా పెట్టి మనకు వెలుగులు ఇస్తున్నారని కొనియడారు. తెలంగాణ వచ్చాక సింగరేణిలో 19,260 కొలువులు భర్తీ చేశామని చెప్పారు. పదవీ విరమణ వయస్సు పెంచుకున్నామని, 18 శాతం ఉన్న బోనస్‌ను 27శాతంకు పెంచుకున్నట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 45 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని సీఎం సంకల్పించి కల నిజం చేశారని చెప్పారు. బీఆర్ఎస్ లేకుంటే టీ కాంగ్రెస్, టీ బీజేపీ పదవులు ఉండేవా అన్నారు. కాంగ్రెస్‌కు 55 ఏండ్లు అధికారం ఇస్తే రైతులకు నీళ్లు, కరెంట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. రెండు నెలల్లో రామగుండం ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన తామే చేస్తామన్నారు. బండి సంజయ్‌కి ...2లో

ఓఆర్ఆర్ లీజు విధివిధానాలను బయటపెట్టాలి...



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని 158 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్న నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)ను కేవలం రూ.7,380 కోట్లకు 30 ఏండ్లపాటు లీజుకిచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ లీజుకివ్వడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ...5లో

శాంతియుత సమాజమే మా లక్ష్యం

మత పిచ్చిని తిప్పి కొట్టాలి: సీఎం కేసీఆర్

- నార్సింగిలో హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌కు శంకుస్థాపన • ఆలయ నిర్మాణానికి రూ.25 కోట్లు ప్రకటన



నవతెలంగాణ-గండిపేట్

మత పిచ్చి దుష్పరిణామాలను తిప్పి కొట్టాలని సీఎం కేసీఆర్ అన్నారు. మత మౌఢ్యం మనుష్యులను పిచ్చివాళ్లను చేస్తుందని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా నార్సింగిలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం, శ్రీకృష్ణ గో సేవా మండలి విరాళంతో నిర్మిస్తున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ఆలయ నిర్మాణానికి సోమవారం సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఎత్తయిన 400 అడుగుల ఎత్తు రాధాకృష్ణ మందిరం నిర్మించడం అభినందనీయమన్నారు. మత విద్వేషాల జోలికి వెళ్లొద్దని, కొన్ని శక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. నగరంలో ఈ ప్రాజెక్టు చేపట్టడం సంతోషంగా ఉందని, చిత్తశుద్ధి, అంకితభావంతో ముందుకెళ్లాలని తెలిపారు. ఇది నగరానికి సాంస్కృతిక మైలురాయిగా నిలువడంతో పాటు దేశ ప్రజలకు ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఆలయ నిర్మాణానికి రూ.25కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణిదేవి, రంగారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, కార్యదర్శి అరవింద్‌కుమార్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఆర్డీఓ చంద్రకళ, ఛైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ ఛైర్మెన్ వెంకటేష్‌యాదవ్, కమిషనర్ సత్యబాబు, హరేకృష్ణ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సోనియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

- ఈసీకి బీజేపీ వినతి

న్యూఢిల్లీ : కర్నాటక సార్వభౌమాధికారానికి మద్దతు తెలిపినందుకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఆమెకు గుణపాఠం చెప్పే విధంగా చర్య తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు బీజేపీ విజ్ఞప్తి చేసింది. కర్నాటక పేరుప్రతిష్టలకు, సార్వభౌమత్వానికి, సమగ్రతకు ముప్పు కలిగించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే దానిని కాంగ్రెస్ సహించబోదంటూ సోనియా ఈ నెల హుబ్బల్లిలో జరిగిన సభలో చెప్పారంటూ ఆ పార్టీ ట్వీట్ చేసింది. దీని ఆధారంగా సోనియాపై బీజేపీ ఫిర్యాదు చేసింది. అయితే సోనియా ప్రసంగానికి సంబంధించిన ...5లో

విధుల్లో చేరకుంటే ఉద్యోగం ఊస్టే

జేపీఎస్‌లకు రాష్ట్ర సర్కారు అల్టిమేటం

- నేటి సాయంత్రం ఐదు గంటల వరకు అవకాశం
- నోటీసులు జారీ చేసిన సందీప్‌కుమార్ సుల్తానియా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్రిమెంట్ బాండ్‌ను ఉల్లంఘిస్తూ యూనియన్‌గా ఏర్పడి, తమ సర్వీసు డిమాండ్‌తో ఏప్రిల్ 28 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్‌లు) సమ్మెలోకి వెళ్లడం చట్టవిరుద్ధమనీ, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తీసేస్తామని రాష్ట్ర సర్కారు హెచ్చరించింది. మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకల్లా విధుల్లో చేరాలని అల్టిమేటం జారీ ...5లో

యూనియన్ పెట్టుకుని సమ్మె చేస్తే నోటీసులా?

- వెంటనే ఉపసంహరించుకోవాలి
- పంచాయతీకార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

వివరాలు 5లో..

కర్నాటకలో ముగిసిన ప్రచార పర్వం..



- 10న ఓటింగ్..13న ఫలితాలు

బెంగళూరు : పోటా పోటీ సమావేశాలు, సభలు, ర్యాలీలతో మార్మోగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సోమవారం తెరపడింది. ఎన్నికల హామీలు, పార్టీల మధ్య దూషణలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఆద్యంతం ఆసక్తి రేపిన పార్టీల ప్రచారం ముగియడంతో కర్నాటక బోసిపోయింది. ముఖ్యంగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, జేడీ(ఎస్)లు ప్రచారాన్ని ఉధృతంగా సాగించాయి. తమ అభ్యర్థుల కోసం తీవ్రంగా శ్రమించాయి. కర్నాటకల షెడ్యూల్ ప్రకారం ఈనెల ...5లో



బాగేపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి హత్యకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర!

- అనిల్‌కుమార్ ఇంటిపై దాక్కున్న దుండగులు
- సీపీఐ(ఎం) నేతల ఫిర్యాదుతో 19 మంది అరెస్టు
- పోలీసుల సోదాలో బయటపడిన తుపాకీ, బీజేపీ జెండాలు

నవతెలంగాణ - చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

కర్నాటక ఎన్నికల్లో బాగేపల్లి అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ(ఎం) తరపున పోటీ చేస్తోన్న డాక్టర్ అనిల్‌కుమార్‌ని హత్య చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు మాటువేశారు. సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తల అప్రమత్తతో వారి ఎత్తులు సాగలేదు. బాగేపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదం, ప్రజల ఇబ్బందులపై విస్తృతంగా ప్రసంగిస్తున్నారు. కేంద్రంలోని ...5లో

మధురఫలం చేదెక్కింది

మధురఫలం చేదెక్కింది. పచ్చడి నిలువ చేసుకోవాలనే వారికి, పండ్ల రుచిని ఆస్వాదించాలనే వారికి ఈ సంవత్సరం నిరాశే మిగిలింది. గతంలో మామిడి పండ్లు మార్కెట్‌లో రోజుకు టన్నుల కొద్దీ రాగా ప్రస్తుతం క్వింటాళ్ళలో కూడా రావడం లేదని మామిడి వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది పూత ఏపుగా వచ్చినా అకాల వర్షాలు, ఈదురుగాలులు, చీడపీడలతో వచ్చిన కాస్త పూత రాలిపోయింది. కాసిన కొన్ని కాయలు రాలిపోయాయి. దాంతో దిగుబడి తగ్గి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

పచ్చడి పెట్టలేం.. పండ్లు తినలేం..

- పడిపోయిన మామిడి దిగుబడి • అమాంతం పెరిగిన ధరలు • 'నిమ్మ' పరిస్థితీ అంతంతే..

నవతెలంగాణ-మల్హర్‌రావు

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో తాడిచెర్ల, రుద్రారం, కాపురం, కొండంపేట గ్రామాల్లో మామిడి తోటలు దాదాపు 500 ఎకరాల్లో ఉన్నాయి. ఈ సంవత్సరం అనుకున్నట్టుగా పూత ఏపుగా వచ్చినా చీడపీడలు ఆశించడంతో పూత, కాత నిలువలేదు. మామిడి కాయల సైజును బట్టి, రకాలను బట్టి మార్కెట్‌లో ధరలున్నాయి. టన్ను మామిడి ధర రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు పలుకుతోంది. నాలుగు రోజుల క్రితం రికార్డు స్థాయిలో రూ.1.50 లక్షలు పలకడం విశేషం. డిమాండ్ మేర దిగుమతి లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో ధరలు అమాంతం పెరిగిపోయాయి. పండ్ల రసాలు, హైమవతి, బంగినపల్లి కిలో రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తుండగా తోతాపరి కిలో రూ.50 నుంచి రూ.80 పలుకుతోంది. పచ్చడి కాయలు సైజును బట్టి ఒక్కొక్కటి రూ.15 నుంచి రూ.20 చొప్పున అమ్ముతుండటం గమనార్హం.

అటు మామిడి.. ఇటు నిమ్మ..

వాతావరణ మార్పులతో మామిడి పూత కాత తగ్గి దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపిందని ...5లో



మిగిలేది అంతంతే



ఆరు ఎకరాల్లో మామిడి సాగు చేశాను గతంతో పోలిస్తే ఈసారి పూత, కాత ఆలస్యంగా వచ్చాయి. చీడపీడల నివారణ కోసం అధికంగా మందులు వాడాల్సి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడి కాయలకు, పండ్ల రసాలకు, బంగినపల్లి కాయలకు మంచి డిమాండ్ ఉంది. కానీ దిగుబడి లేదు. దాంతో ఈఏడాది రూ.2లక్షలు నష్టపోయాను.

- పిట్టల రాజయ్య, మామిడి రైతు

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 75శాతం కోటా

(మొదటిపేజీ తరువాయి)

యువత భవితే తమ పార్టీ నినాదమనీ, అమరుల ఆశయ సాధనే కాంగ్రెస్ విధానమని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే వరకూ ప్రతి నెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. యువతకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అసువులుబాసిన అమరులను గుర్తించుకునేలా వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ప్రతి నెలా రూ.25 వేల గౌరవ వేతనం ఇస్తామని వెల్లడించారు. పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల చదువుల కోసం వరంగల్, హైదరాబాద్‌లో రెండు ప్రత్యేక విద్యాలయాలను నెలకొల్పుతామని తెలిపారు. 18 ఏండ్లు పైబడి చదువునే ప్రతి విద్యార్థినికీ ఎలక్ట్రిక్ స్కూటీలను ఇస్తామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంఘర్షణ సభ ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ప్రకటించారు. తెలంగాణలోని యూనివర్సిటీలు ఆత్మగౌరవ ప్రతీకలన్నారు. మన 'రాష్ట్రం-మన కొలువులు' నినాదంతో యువతీయువకులు లాఠీ దెబ్బలు తిన్నారు, ప్రాణాలు అర్పించారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగుల సంఖ్య 12.50 లక్షలు ఉంటే, విభజన తర్వాత తెలంగాణకు 5.30లక్షలు ఉద్యోగులను కేటాయించారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 1.7 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. కేసీఆర్ పాలనలో యువతకు న్యాయం జరగదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ హామీలు నెరవేరుస్తామని ప్రకటించారు. తెలంగాణ కోసం పోరాడిన వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తిస్తామని ప్రకటించారు. అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ. 25 వేల గౌరవ పెన్షన్ ఇస్తామని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ సమరయోధులపై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేస్తామన్నారు. ఏటా జూన్ 2న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామనీ, సెప్టెంబర్‌లో నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్‌సీ రాజకీయ నిరుద్యోగుల పునరావాస కేంద్రంగా మారిందని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ముఖ్యాంశాలు

- తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన యువతీ, యువకులను ఉద్యమ అమరవీరులుగా గుర్తిస్తాం.
- అమరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, తల్లి/తండ్రి/భార్యకు రూ. 25 వేల గౌరవ పెన్షన్ ఇస్తాం.
- తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తేస్తాం.
- జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేత.
- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- తొలి ఏడాదే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ.
- జూన్ 2న జాబ్ క్యాలెండర్ విడుదల. సెప్టెంబర్ 17లోపు నియామక పత్రాల అందజేత.
- ప్రతినెలా రూ.4వేల నిరుద్యోగ భృతి చెల్లింపు
- ప్రత్యేక చట్టంతో టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో పునరుద్ధరణ.
- నిరుద్యోగ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సెంట్రలైజ్డ్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు.
- 7 జోన్లలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్లను, ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను నెలకొల్పుతాం.
- ప్రభుత్వ రాయితీలు పొందే ప్రయివేటు కంపెనీల్లో తెలంగాణ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పన.
- విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు యూత్ కమిషన్ ఏర్పాటు.
- రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయ కల్పన.
- ప్రత్యేక గల్ఫ్ విభాగం ఏర్పాటుతో గల్ఫ్ ఏజెంట్ల నియంత్రణ, మరియు గల్ఫ్ దేశాల్లో మెరుగైన ఉపాధి కల్పనతో పాటు, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తాం. పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు.
- పాలమూరు, తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీలను ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలుగా మార్పు
- ఆదిలాబాద్, ఖమ్మం, మరియు మెదక్‌లో నూతన ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీల ఏర్పాటు.
- బాసరలోని రాజీవ్ గాంధీ ఐఐఐటీ తరహాలో రాష్ట్రంలో నూతనంగా 4 ఐఐఐటీల ఏర్పాటు
- అమెరికాలోని ఐఎంజీ అకాడమీ తరహాలో అన్ని వసతులతో కూడిన ప్రపంచస్థాయి క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.
- పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం వరంగల్, హైదరాబాద్‌లలో 2 విద్యాలయాలను ఏర్పాటు చేసి ఆరో తరగతి నుంచి పట్టభద్రులయ్యే వరకూ నాణ్యమైన విద్యను అందిస్తాం.
- 18 ఏండ్లు పైబడి చదువుకొనే ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ల అందజేత.

విద్యార్థులు, నిరుద్యోగులందరూ ఏకమై పిడికిలి బిగించాలి

తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరోసారి విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు ఏకమై పిడికిలి బిగించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ యువ సంఘర్షణ సభలో ఆయన మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో నేడు ఉద్యోగాల్లేక నిరుద్యోగులు విలవిల్లాడిపోతున్నారన్నారు. విద్యార్థులు, యువత త్యాగాలు చేస్తేనే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించడానికి ప్రియాంక గాంధీ తెలంగాణకు వచ్చారన్నారు. పాదయాత్రలో అనేక సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాయితీలు కల్పించిందనీ, నేడు చేతివృత్తుల వారికి రాయితీలు ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. పాదయాత్రలో పోచం పల్లి చేనేత కార్మికులు ఇచ్చిన చీరలను ప్రియాంక గాంధీకి సభా వేదికపై భట్టి విక్రమార్క అందజేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వ హించిన ఈ సభలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, నేతలు వి.హన్మంతరావు, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, కొండా సురేఖ, మానవతారాయ్, బలరాం నాయక్, రాములు నాయక్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

-సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

22కు పెరిగిన కేరళ పడవ ప్రమాద మరణాలు

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం
- అండగా ఉంటా : సీఎం విజయన్

తిరువంతపురం : కేరళలోని మలప్పురం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 22కు పెరిగింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఆ కుటుంబాలకు ఇది ఓదార్పునిచ్చేది కాదని, ఆ కుటుంబాలకు తాను అండగా ఉంటానని విజయన్ హామీ ఇచ్చారు. ప్రమాద ప్రాంతాన్ని సోమవారం ఉదయం ముఖ్యమంత్రి విజయన్ పరిశీలించారు. సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ జరిపిస్తామని ప్రకటించారు. జిల్లాలోని తనూర్ ప్రాంతంలోని తూవల్ తీరంలో డబుల్ డెక్కర్ బోటు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో బోల్తా పడి మునిగిపోయిన సంగతి తెలిసిందే. 22 మంది మరణించగా, ఇద్దరు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. ఆసుపత్రిలో చేరిన 10 మందిలో ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారు. మరో ఎనిమిది మంది చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి, మరణించిన వారి బంధువులకు ఆరోగ్యశాఖ మానసికంగా అండగా ఉంటుందని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. గాయపడిన వారిని ఆమె పరామర్శించారు. ప్రమాదానికి గురైన పడవ యాజమాని నాజర్‌ను కొజికోడ్‌లోని బీచ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నామని, ముందుగా మలప్పురం తీసుకొస్తామని పోలీసులు చెప్పారు. ఆదివారమే నాజర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తానూరులో మంత్రివర్గ, అఖిలపక్ష సమావేశాలు

ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం సీఎం విజయన్ తానూరులో మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నేతలతోనూ సమావేశమయ్యారు. దుర్ఘటనపై న్యాయ విచారణ జరపాలని అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. సాంకేతిక నిపుణులతోసహా న్యాయవిచారణ జరిపిస్తుందని, జిల్లా పోలీసు చీఫ్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను నిర్వహిస్తుందని సీఎం తెలిపారు.

అవినీతికి అవిభక్త కవలలు ప్రధాని, అదానీ...

(మొదటిపేజీ తరువాయి)

దమ్ముంటే ఎకరానికి రూ.పది వేలు పరిహారం ఇప్పించాలన్నారు.

పోలీస్ కమిషరేట్ ప్రారంభోత్సవంలో కేటీఆర్

అధునాతన హంగులతో జీ ప్లస్ -2 పద్ధతిలో నిర్మించిన గోదావరిఖనిలోని పోలీస్ కమిషనరేట్ భవనాన్ని సోమవారం మంత్రి కేటీఆర్, హోంమంత్రి మహమూద్ అలీ, అటవీ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎస్సీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో బెంగాల్ ఆచరించిన కార్యక్రమాలను.. దేశం అనుస రించేదని అనేవారని, ఇప్పుడు తెలంగాణ ఆచరించిన కార్యక్రమాలను, దేశం అనుసరిస్తుందని అన్నారు. ప్రజలంతా శాంతియుతమైన జీవితం గడిపేందుకు దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికుడితో సమానంగా అంతర్గత భద్రత కోసం మన పోలీ సులు పనిచేస్తున్నారని తెలిపారు. పోలీసులు చిత్తశుద్ధితో పనిచేస్తూ పకడ్బందీగా శాంతిభద్రతలను నిర్వ హిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పోలీసులకు ఆధునిక భవనాలు, మంచి వాహనాలు సాంకేతికతను వినియోగించుకునే విధంగా అవసర మైన అన్ని పరికరాలను అందించామని అన్నారు. పోలీసు సంక్షేమ చర్యలు భాగంగా దేశానికి ఆదర్శ వంతంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యంత ప్రాధాన్యత శాంతిభద్రతల నిర్వహణ కోసం సీఎం కేసీఆర్ కల్పించారని, గతంలో కేవలం రెండు పోలీస్ కమిష నరేట్లు ఉండేవని, ప్రస్తుతం అదనంగా ఏడు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసు కున్నామన్నారు. డీజీపీ అంజనికుమార్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తమ సందేశాలు ఇచ్చారు. అనం తరం పోలీస్ ప్రతినిధులు మంత్రుల బృందానికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్, కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, ప్రభుత్వ శాసన సభ మండలి చీఫ్ విప్ భాను ప్రసాద్ రావు, శాసన సభ్యులు దాసరి మనోహర్ రెడ్డి, దివాకర్ రావు, మాజీ మంత్రి ఎల్.రమణ, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల కోసం పేర్లు నమోదు చేసుకోండి : టామ్ కామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విదేశాల్లో ఉద్యోగాల కోసం ఆసక్తి, అర్హత కలిగిన వారు తమ పేర్లను టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఏజెన్సీ కోరింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జర్మనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రాజెక్టు మేనేజర్, కన్సల్టెంట్స్, ఈఆర్పీ, ఐటీ-సపోర్ట్ జాబ్ రోల్స్ కోసం నియామక ప్రక్రియను సులభ తరం చేసినట్టు వెల్లడించింది. అభ్యర్థి గ్రాడ్యు యేట్ పూర్తి చేసి సంబంధిత రంగంలో మూడేండ్ల నుంచి ఐదేండ్ల అనుభవం తో పాటు జర్మన్ భాషలో బీ1 లేదా బీ2 స్థాయి ప్రావీణ్యం కలిగి ఉండాలని సూచించింది. మరిన్ని వివరాలకు 98496 39539లో సంప్రదించొచ్చు.

మా ప్రభుత్వం వస్తే..



(మొదటిపేజీ తరువాయి)

నెరవేర్చలేకపోతే ఆ సర్కారును సైతం కూల్చేయాలని సూచించారు. తెలంగాణను బలోపేతం చేయాల్సిన అవసరముందని చెప్పారు. దేశంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ చేసిన పనులకు బీజేపీ పాలకులు పేర్లు మార్చి తమవిగా చెప్పు కుంటున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'యువ సంఘర్షణ సభ'లో ప్రియాంకగాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా 'జైబోలో తెలంగాణ' అని ఆమె తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మిత్రులారా అంటూ తెలుగులో మాట్లాడారు. శ్రీకాంతా చారి గురించి ప్రస్తావిం చారు. 'నన్ను మరో ఇందిర అంటారు. అలా అన్నప్పు డు నా బాధ్యత తెలుస్తుంది' అన్నారు. త్వరలో తెలం గాణలో ఎన్నికలు జరగనున్నాయనీ, ప్రభుత్వాన్ని ఎన్నుకునే సమయంలో ప్రజలు జాగరూకతతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆ చైతన్యంతోనే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు.

అంత ఈజీగా ఆ నిర్ణయం తీసుకోలేదు...

'నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగింది. ఏ ఒక్కరో పోరాడితే తెలంగాణ రాలేదు. తెలంగాణ కోసం ఎందరో ఆత్మ బలి దానాలు చేశారు. మా కుటుంబం కూడా ఎన్నో త్యాగాలు చేసింది. ఆ బాధ ఏంటో మాకు తెలుసు. బలిదానాలు వథా కాకూడదని ప్రతీ ఒక్కరూ ఆలోచించాలి' అని ప్రియాంక గాంధీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఇవ్వాలనే నిర్ణయం అంత ఈజీగా చేసింది కాదన్నారు. ఇక్కడ అధికారంలోకి రావాలని ప్రత్యేక రాష్ట్రం ఇవ్వలేదనీ, ప్రజల ఆకాంక్షల మేరకే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ వచ్చిన రాష్ట్రంలో నిధులు, నీళ్లు, నియామకాలు కల్వకుంట్ల కుటుంబా నికే పరిమితం అయ్యాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఇచ్చి 9 ఏండ్లయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదనీ, ఆత్మబలిదానాలు వృథా అయ్యాయని అన్నారు. తెలంగాణ కోసం అన్ని వర్గాల వారూ పోరాడారని తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రాకపోయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయని తాము భావించామని అన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 30లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనీ, ఉద్యోగాలు లేక లక్షలాది మంది నిరుద్యోగులు అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారనీ, మన ఇంట్లో ఎవరికైనా ఉద్యోగం వచ్చిందా? చెప్పాలన్నారు. 2018 ఎన్నికల్లో రూ.3016 నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారని విమర్శించారు.

లీకుల మీద లీకులు...

మరో పక్క పరీక్షల పేపర్లు లీక్ అవుతున్నాయనీ, పేపర్ లీకేజీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.తొమ్మిదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క యూనివర్సిటీ ఏర్పాటు చేయలేదనీ, వాటిలో ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. ప్రయివేటు యూని వర్సిటీలకు మాత్రం అనుమతులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రభుత్వ బడుల్లో చేరేవారి సంఖ్య తగ్గిందనీ, బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు తగ్గించారని విమర్శించారు. ప్రతి వ్యక్తిపై లక్షల రూపాయల అప్పులు మోపారనీ, కాంగ్రెస్ ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందని ప్రకటించారు. తెలంగాణ ఏర్పడ్డాక 8 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటి వరకు చేయలేదన్నారు. నిరుద్యోగ భతి రూ.3 వేలు ఇస్తామని చెప్పినా బీఆర్ఎస్ అమలు చేయ లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ. 4 వేలు భతి ఇస్తామని ప్రకటించారు. యువతకు రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

మణిపూర్ నుంచి హైదరాబాద్‌కు..

- చేరుకున్న తెలంగాణ విద్యార్థులు



నవతెలంగాణ-శంషాబాద్

తెలంగాణకు చెందిన 72 మంది విద్యార్థులు మణిపూర్ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సోమవారం చేరుకున్నారు. వారికి కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్, అడిషనల్ డీజీపీలు మహేష్ భగవత్, అభిలాష బిస్త్, డీఐజీ బి.సుమతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ తదితర అధికారులు స్వాగతం పలికారు.

మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ విద్యార్థులను సురక్షితంగా స్వరాష్ట్రానికి తరలించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు మణిపూర్ అధికారులతో చీఫ్ సెక్రటరీ శాంత కుమారి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీకుమార్ సంప్రదింపులు జరిపారు. మణిపూర్ నుంచి తెలంగాణ విద్యార్థులను తరలించేందుకు ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన మొత్తం 130 మంది విద్యార్థుల్లో 72 మంది రాష్ట్రానికి తిరిగి రాగా మిగిలిన విద్యార్థులు మంగళవారం తెల్లవారు జామున హైదరాబాద్‌కు చేరుకుంటారని అధికారులు తెలిపారు. సీఎం కేసీఆర్ సకాలంలో స్పందించి విద్యార్థులను స్వస్థలానికి తీసుకురావడం పట్ల మణిపూర్ నుంచి వచ్చిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి స్వస్థలాలకు చేరుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శంషాబాద్ మండల అధ్యక్షులు కే.చంద్రారెడ్డి, చిన్న గోల్కొండ పీఏసీఎస్ చైర్మన్ బొమ్మ దవణాకర్ గౌడ్ పాల్గొన్నారు.

మహిళలకు రూ.80కే టీ-24 టికెట్

- నేటి నుంచి అమల్లోకి...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణించే మహిళలకు టీ-24 టిక్కెట్‌ను రూ.80కే అందించాలని నిర్ణయించింది. ఈ టిక్కెట్‌తో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ప్రయాణించవచ్చు. సాధారణ ప్రయాణికులకు ఈ టిక్కట్ ధర రూ.90కాగా, సీనియర్ సిటిజన్లకు రూ.80గా ఇటీవల నిర్ణయించారు. అలాగే మంగళవారం నుంచి మహిళా ప్రయాణికులకు కూడా రూ.80కే ఈ టిక్కెట్ అందిస్తారు. అన్ని సిటీ బస్సుల్లోని కండక్టర్ల వద్ద ఈ టికెట్లు అందుబాటులో ఉంటాయి. టీ-24 టిక్కట్ ధరల తగ్గింపు తర్వాత రోజుకు సగటున 40 వేల వరకు ఈ అమ్ముడవుతున్నాయని టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. గతంలో ఈ టిక్కెట్లు రోజుకి 25 వేలు మాత్రమే అమ్ము డయ్యేవని చెప్పారు. అలాగే ఇటీ వల కుటుంబ సభ్యులు, స్నేహి తుల సౌకర్యార్థం ఎఫ్-24 టికెట్ ను అందుబాటులోకి తెచ్చారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో రూ. 300 చెల్లించి నలుగురు 24 గంటల పాటు ఈ టిక్కెట్లపై ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బారికేడ్లను ఛేదించి..

రెజ్లర్ల వద్దకు రైతులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల ఆరోపణలపై రెజ్లర్ల ఆందోళనలో పాల్గొనడానికి రైతుల సమూహం బారికేడ్లను నెట్టుకుంటూ...ముందుకు కదంతొక్కింది. రెజ్లర్ల నిరసన ప్రాంగణానికి సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను రైతులు ఛేదించారు. రైతులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. మల్లయోధుల నిరసన వేదిక వద్ద సోమవారం కూడా పెద్ద సంఖ్యలో రైతులు, మహిళ రైతులు కూర్చున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న మల్లయోధులకు మద్దతుగా వివిధ రాష్ట్రాల నుంచి రైతులు వస్తున్న నేపథ్యంలో ఢిల్లీ-ఘాజీపూర్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, బాధిత రెజ్లర్లకు న్యాయం చేయాలని రోడ్డెక్కిన రెజ్లర్లు, సోమవారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. గత 16 రోజులుగా జరుగుతున్న ఈ ఆందోళన రోజు రోజుకూ ఉధృతమవుతోంది. బజరంగ్ పునియా మాట్లాడుతూ "మేం రాజకీయాలు చేసేందుకు రాలేదు. న్యాయం కోసం వచ్చాం. నిరసనలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నవారికి స్వాగతం. ఎవరూ నిరసనను హైజాక్ చేయలేదు. బదులుగా మేము నిరసన కోసం పోరాడుతున్నాం" అని అన్నారు. "మాకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తున్న వారికి నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ఈ నిరసన కేవలం మల్లయోధులకు మాత్రమే పరిమితం కాదు. ఇది దేశం కోసం కూడా పోరాటం. భారతదేశపు ఆడబిడ్డల కోసం పోరాటం" అని బజరంగ్ పునియా అన్నారు. "పోరాడుతాం. దేవుడు మాకు ముందు అవకాశం ఇస్తే, మేం కచ్చితంగా ఆడతాం.. మేం ఇప్పటికీ నిరసనల సమయంలోనూ వీలైనంత ఎక్కువ శిక్షణ కోసం ప్రయత్నిస్తున్నాం. సమయాన్ని వెతకడానికి, మా శిక్షణా షెడ్యూల్‌ని ప్లాన్ చేయడానికి ప్రయత్నిస్తున్నాం" అని వినేష్ ఫోగట్ అన్నారు.

మల్లయోధులకు కేంద్ర కార్మిక సంఘాల మద్దతు

మల్లయోధుల ఆందోళనకు కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్, ఏఐయూ




టీయూసీ,టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ,ఎల్పీఎఫ్, యూటీయూసీ సంఘాలు ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి.

రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైన ఇండియన్ రెజ్లర్స్ ఫెడరేషన్ చైర్‌పర్సన్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్న యువతి రెజ్లర్ల న్యాయమైన డిమాండ్‌కు కార్మిక సంఘాలు హృదయపూర్వక మద్దతును తెలియజేస్తోన్నాయని పేర్కొన్నాయి. బ్రిజ్ భూషణ్ నుంచి వచ్చే ఒత్తిళ్ల విచారణను ప్రభావితం చేయకుండా విచారణ కొనసాగించాలని, ఆయనను వెంటనే అరెస్టు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రెజ్లర్లపై పోలీసులు దాడి చేయడం చాలా ఘోరమని పేర్కొన్నాయి. ఈ క్రమంలో బట్టలు చిరిగిపోయిన మహిళా జర్నలిస్టు సాక్షి జోషిపై పోలీసులు దాడి చేశారని విమర్శించాయి. కార్మిక సంఘాలు తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నాయని, తక్షణమే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని పేర్కొన్నాయి.

నాడు రైతులు..నేడు రెజ్లర్లు

రెజ్లర్ల ఆందోళనలు చేస్తున్నా..బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ పై చర్య తీసుకోవటానికి మోడీ ప్రభుత్వం వెనకడుగువేస్తున్నది. రెజ్లర్లకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకపోతోంది.. బారికేడ్లను పెట్టి ఆపలేకపోతున్నది. గతంలో రైతులు దీక్ష చేసినపుడు రోడ్లపై కీలలు కొట్టించిన విషయం విదితమే. ఇపుడు రెజ్లర్ల దీక్షాస్థలి వద్ద బారికేడ్లను తోసుకుని వెళ్లకుండా ..వెల్డింగ్ పనులకు ఉపక్రమించింది. దీనిపై దేశప్రజలు సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వీఐటీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (వీఐటీఈఈఈ) ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. దేశంలోని 121 నగరాలు, నాలుగు ఇతర దేశాల్లోని నగరాల్లో గతనెల 17 నుంచి 23వ తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహించారు. జార్కండ్‌కు చెందిన కుషగ్ర బాషిస్త్ ప్రథమ ర్యాంకు పొందారు. మహారాష్ట్రకు చెందిన ప్రక్షాల్ శ్రీనివాస్ చౌదరి రెండో ర్యాంకు, మహిన్ ప్రమోద్ ధోకే మూడో ర్యాంకు సాధించారు. కేరళకు చెందిన ఆషిక్ స్టెన్నీ నాలుగో ర్యాంకు, బీహార్‌కు చెందిన అంకిత్‌కుమార్ ఐదో ర్యాంకు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నంద్యాల ప్రిన్స్ బ్రన్హన్‌రెడ్డి ఆరో ర్యాంకు, బీహార్‌కు చెందిన ఎండీ ఉమర్ ఫైసల్ ఏడో ర్యాంకు, మహారాష్ట్రకు చెందిన అన్షుల్ సందీప్ నఫడే ఎనిమిదో ర్యాంకు, హర్యానాకు చెందిన రిషిత్ గుప్తాకు తొమ్మిదో ర్యాంకు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన తన్మయ్ బఘేల్ పదో ర్యాంకు పొందారు. ఈ ప్రవేశ పరీక్షలో లక్షలోపు ర్యాంకు వచ్చిన అభ్యర్థులు బీటెక్ ఇంజినీరింగ్‌లో చేరేందుకు అర్హులుగా ఉంటారు. వచ్చేనెల 14వ తేదీ వరకు కౌన్సెలింగ్‌ను ప్రక్రియను నిర్వహిస్తారు. లక్షపైన ర్యాంకు వచ్చిన అభ్యర్థులు వీఐటీ ఏపీ, వీఐటీ భోపాల్ ప్రాంగణాల్లో చేరేందుకు అర్హులుగా ఉంటారు. వారి కోసం ఐదో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను వచ్చేనెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఒకటి నుంచి పది ర్యాంకులు పొందిన వారికి వంద శాతం ట్యూషన్ ఫీజు నాలుగేండ్ల వరకు మినహాయింపు ఉంటుంది. 11 నుంచి 50వ ర్యాంకు వరకు ట్యూషన్ ఫీజులో 75 శాతం మినహాయింపు వర్తిస్తుంది. 51 నుంచి వంద ర్యాంకు వరకు ట్యూషన్ ఫీజులో 50 శాతం, 101 నుంచి 500 ర్యాంకుల వరకు ట్యూషన్ ఫీజులో 25 శాతం మినహాయింపు ఉంటుంది. సపోర్ట్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్ (స్టార్స్) పథకం కింద తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లలో చదివి జిల్లా టాపర్లుగా నిలిచిన ఒక అబ్బాయి, అమ్మాయికి వంద శాతం ట్యూషన్ ఫీజుతోపాటు హాస్టల్, మెస్ ఫీజులోనూ మినహాయింపు వర్తించనుంది.

మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులు



ర్యాంక్ 1 కుషగ్ర బాషిస్త్ | ర్యాంక్ 2 శ్రీనివాస్ చౌదరి | ర్యాంక్ 3 ప్రమోద్ ధోకే | ర్యాంక్ 4 ఆషిక్ స్టెన్నీ | ర్యాంక్ 5 అంకిత్ కుమార్



ర్యాంక్ 6 నంద్యాల ప్రిన్స్ బ్రన్హన్ రెడ్డి | ర్యాంక్ 7 ఎండి ఉమర్ ఫైసల్ | ర్యాంక్ 8 అన్షుల్ సందీప్ | ర్యాంక్ 9 రిషిత్ గుప్తా | ర్యాంక్ 10 తన్మయ్ బఘేల్

పరిశోధన విద్యార్థులపై ఫీజుల మోత

రీసెర్చ్ సెంటర్స్ కేటాయింపుపై తీవ్ర వ్యతిరేకత

- కష్టపడి తెచ్చుకున్న ఫెలోషిప్స్ ఫీజులుగా ఎందుకు చెల్లించాలంటున్న విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో భారీగా పెంచిన ఫీజులపై పీహెచ్‌డి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజులకు వ్యతిరేకంగా వరుసగా ఆందోళనలు చేస్తున్నారు. తమకు న్యాయం జరిగేదాకా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాలుగు సంవత్సరాల నిరీక్షణ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డి నోటిఫికేషన్ జారీ చేసింది. ఫలితాలు విడుదలై, జాయిన్ అయిన తరువాత విద్యార్థుల ఆశలపై ఓయూ అధికారులు నీళ్ల చల్లారు. గతంలో కేవలం రూ.6,250 మాత్రమే ఉన్న పీహెచ్‌డి ఫీజు (ట్యూషన్ ఫీజు)ను 5 సంవత్సరాలకు కలిపి లక్షరూపాయలకు (రూ.1,00,000), మరికొన్ని కోర్సులకు లక్షా ఇరవై ఐదువేల రూపాయలకు (రూ. 1,25,000) పెంచారు. దాంతో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫీజుల పెంపును ఉపసంహరించుకోవాలని ఉద్యమిస్తున్నారు. వారికి విద్యార్థి సంఘాలు మద్దతిచ్చాయి. కొన్ని విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మి షన్లు పొందిన విద్యార్థులకు హాస్టల్, మెస్ సౌక ర్యాలు కూడా ఇప్పటి వరకు యూనివర్సిటీ కల్పించలేదు. గతంలో అన్ని విభాగాల విద్యార్థులకు అడ్మిషన్, సూపర్ వైజర్ అలాట్మెంట్ ఓయూలోనే జరిగేది. నేడు దానికి భిన్నంగా ప్రయివేట్ రీసెర్చ్ సెంటర్స్‌కు అలాట్ చేశారు. ఆ సెంటర్స్‌లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులకు హాస్టల్, మెస్ సౌకర్యాలు కల్పించలేదు. (గ్రామీణ ప్రాంతాల్లో నుంచి వచ్చిన తాము పరిశోధన విద్యను ఎలా పూర్తి చేయగలమని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.



సమిష్టి నిర్ణయం

పీహెచ్‌డీ ఫీజులు డీన్స్, స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు పెంచాము. ఇది సమిష్టి నిర్ణయం. సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.25,000, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.20,000. ఆదాయం తక్కువ ఉన్న విద్యార్థులు స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవాలి..

- ఓయూ రిజిస్ట్రార్, ప్రొ.పప్పుల.లక్ష్మీ నారాయణ

ప్రయివేటు విద్యా సంస్థలాగా పెంచడం దారుణం సత్య నెల్లి, పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్



దేశంలోని ఏ ప్రభుత్వ యూనివర్సిటీలో లేని విధంగా ప్రయివేటు విద్యా సంస్థ లాగా ఓయూలో 5 ఏండ్లకు మొత్తంగా లక్ష రూపాయల వరకు ఫీజును పెంచడం దారుణం. ముందు రీయింబర్స్ అవుతుంది.. విద్యా ర్థులకే అవగాహన లేదని అధికారులు అన్నారు. ఇప్పుడు అడిగితే రీయింబర్స్‌మెంట్ తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నా మంటున్నారు. ప్రయత్నాల దశలో ఉన్నప్పుడు విద్యార్థుల నుంచి డబ్బులు ఎలా వసూల్ చేస్తారు? ఫీజులు పెంచడం వల్ల కొంత మంది విద్యార్థులు అడ్మిషన్లు క్యాన్సల్ చేసుకున్నారు. దీని గురించి వివరణ కోరితే '80 శాతం విద్యార్థులు ఫీజు చెల్లించారు. మిగతా 20 శాతం గురించి ఆలోచించాల్సిన అవసరం ఏముంది.? వాళ్ళు ఫీజు చెల్లించగలిగితే జాయిన్ అవుతారు లేకపోతే కారు' అని అధికారులు సమాధానం ఇస్తున్నారు. ఇది పేద వర్గాలకు దళిత వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర కాదా? నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ప్రజాస్వామ్య బద్ధంగా మా నిరసనను తెలియ చేస్తూనే ఉంటాం.

ఫీజుల గురించి ముందే చెప్పాల్సింది



మేము సెప్టెంబర్ 2022న ఓయూలో పరిశోధక విద్యార్థులుగా అడ్మిట్ అయ్యాము. మాకు ఇచ్చిన జాయి నింగ్ ఆర్డర్‌లో 4 ఏండ్లకు రూ.4000 ఫీజుగా చూపించారు. మేము రూ. 1000 చెల్లించి అడ్మిట్ అయ్యాము. 9 నెలల తర్వాత ఇవ్వాళ యూనివర్సిటీ నిర్ణయంగా లక్ష రూపాయలు చెల్లించాలంటున్నారు. జాయినింగ్ ఆర్డర్‌ను కూడా వాళ్ళు గౌరవించరా. ఒకవేళ ముందే ఇంత ఫీజు అని చెప్పి ఉంటే మా నిర్ణయం వేరే విధంగా ఉండేదేమో.

- అఖిల్ బొడ్డుపల్లి, తెలుగు పరిశోధక విద్యార్థి

సౌకర్యాలను కల్పించాలి



పీహెచ్‌డీ విద్యార్థులకు మంచి సౌకర్యాలను అందించవలసిన బాధ్యత ఓయూపై ఉంది. పరిశో ధన చేసే విద్యార్థికి హాస్టల్ వసతి లేదు. అడ్మిషన్ ఫీజు కట్టడానికి మూడు రోజుల వ్యవధి ఇచ్చారు. కానీ ఓయూలో జాయిన్ అయి 50 రోజులు అవుతున్నా తినడానికి తిండి లేక, పడుకోవడానికి చోటు లేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఓయూలో పరిశోధక విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి.

- చేవెళ్ల యాదగిరి, పరిశోధక విద్యార్థి

ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది...



ఓయూలో ఒక్కో ప్రొఫెసర్‌కు ఎనిమిది మంది, అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఆరుగురు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు నలుగురు విద్యార్థులను పరిశోధనకు కేటాయిస్తారు. ప్రొఫెసర్‌ల కొరత తీవ్రంగా ఉంది. రిక్రూట్‌మెంట్ జరగక విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా మారింది. దిక్కుతోచని స్థితిలో ప్రయివేటు రీసెర్చ్ సెంటర్‌లకు విద్యార్థులను వీసీ పంపిస్తున్నారు. అక్కడ రెక్టిఫైడ్ కానీ టీచర్ల వద్ద ఎలా పరిశోధనకు అనుమతిస్తారు. పీహెచ్‌డీ చదివే మా సెమినార్‌లను, పీహెచ్‌డీ విద్యార్హత లేని కొన్ని కళా శాలల ప్రిన్సి పాల్‌లు ఎలా పర్య వేక్షిస్తారు. తార డిగ్రీ కళాశాల సంగారెడ్డికి తెలుగు, బేగంపేట్ గౌట్ కళాశాలకు ఎకనామిక్స్, అరోరా డిగ్రీ కళాశాలకు కెమిస్ట్రీ కేటాయించారు. అక్కడ ఫీజులు మళ్ళీ కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.

- ఆజాద్, ఫిలాసఫీ రీసెర్చ్ స్కాలర్

నేటినుంచి వెబ్‌సైట్‌లో ఏవో అభ్యర్థుల హాల్‌టికెట్లు : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ, సహకార విభాగంలో అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టుల భర్తీకి ఈనెల 16న రాతపరీక్షను ఆన్‌లైన్ నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం నుంచి ఏవో పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్‌టికెట్లు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంటుందని వివరించారు. ఈనెల 16వ తేదీ పరీక్ష ప్రారంభానికి 45 నిమిషాల ముందు వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. 148 అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 28న నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

రేపటి నుంచి ఎంసెట్

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- 3.20 లక్షల మంది దరఖాస్తు
- 137 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ రాతపరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌లో పకడ్బందీగా ఈ పరీక్షలను నిర్వహించడం కోసం అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. రోజూ రెండో విడతల్లో పరీక్షలుంటాయి. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటలకు రెండో విడత పరీక్షలు జరుగుతాయి. మొదటి విడతకు ఉదయం 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. రెండో విడతకు మధ్యాహ్నం 1.30 నుంచి మూడు గంటల వరకు అనుమతిస్తారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతిని నిరాకరిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఉన్న నియమ, నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. తెలంగాణలో 104, ఏపీలో 33 కలిపి మొత్తం 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,05,405 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,15,361 మంది కలిపి మొత్తం 3,20,766 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇంజినీరింగ్‌కు తెలంగాణ నుంచి 1,53,935 మంది, ఏపీ నుంచి 51,470 మంది అభ్యర్థులు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి తెలంగాణ నుంచి 94,614 మంది, ఏపీ నుంచి 20,747 మంది దరఖాస్తు చేశారు. గతేడాది ఎంసెట్‌కు 2,66,714 దరఖాస్తులొచ్చాయి. అంటే గతేడాది కంటే ఈసారి 54,052 మంది అభ్యర్థులు ఎక్కువగా దరఖాస్తు చేశారు. ఈ ఏడాది ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల స్థానంలో ఈసారి సిట్టింగ్ అబ్జర్వర్లను ప్రతి కేంద్రంలో నియమిస్తారు. వారే పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని రకాల పనులనూ పర్యవేక్షిస్తారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచుతారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేక బస్సులను టీఎస్‌ఆర్టీసీ నడపనుంది. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు.

వైద్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బి.కిరణ్మయి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీవో 38 ద్వారా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో డీఎస్సీ ద్వారా నియమితులై అనేక ఏండ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు ఇందులోకి కవర్ కావడం లేదని చెప్పారు. ఈ ప్రక్రియలో నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వైద్య శాఖలోని ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలను ఎరియర్స్ రూపంలో వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ.కవిత, నగర ఉపాధ్యక్షులు పి.లక్ష్మి, నగర కోశాధికారి రాజేశ్వరి, హెచ్‌ఆర్‌డీ పద్మ, ఈసీ ఏఎన్‌ఎం షీలా, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



మృతిచెందిన వార్డు సభ్యుడి కుటుంబానికి జడ్పీ వైస్ చైర్మెన్ పరామర్శ



నవతెలంగాణ - వెల్దండ

వెల్దండ మండల పరిధిలోని కొత్త గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు పోనుగోటి విష్ణువర్ధన్ రావు ఇటీవల మృతిచెందారు. కాగా, ఆయన కుటుంబ సభ్యులను నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బాలాజీ సింగ్ పరామర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అన్నివిధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీఆర్‌ఎస్ నాయకులు పోనుగోటి రవీందర్ రావు, జంగయ్య, పురుషోత్తం, మల్లయ్య, రాజు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రావుకు కొవ్వొత్తులతో నివాళి...

విష్ణువర్ధన్ రావు మృతికి నివాళిగా గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామ కూడలిలో ఆయన చిత్రం ఏర్పాటుచేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఓబీసీ జాతీయ కమిషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ హన్సరాజ్ గంగారమ్ అలహిత్,సలహాదారు రాజ్‌కుమార్ మంగళవారం హైదరాబాద్ రానున్నట్టు సమాచార పౌరసంబంధాల శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో ఓబీసీలకు రిజర్వేషన్లు, వాటి జాబితా అమలుపై మెదక్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీఎండీతో సమావేశం కానున్నారని పేర్కొన్నది. శరత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), హైదరాబాద్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్లతోనూ సమావేశం కానున్నట్టు తెలిపింది.

పోలవరం బ్యాక్‌వాటర్స్ ప్రభావంపై సంయుక్త సర్వే

- సీడబ్ల్యూసీకి ఈఎన్సీ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పోలవరంపై బ్యాక్‌వాటర్స్ ప్రభావంపై సంయుక్త సర్వే చేపట్టాలని రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ కేంద్ర జల సంఘం చైర్మెన్‌కు(సీడబ్ల్యూసీ) ప్రత్యేకంగా లేఖ రాశారు. సర్వే చేయడానికి గతంలో ఒప్పుకున్న ఏపీ సర్కారు, ఇప్పుడు జాప్యం చేస్తున్నదని ఫిర్యాదు చేశారు. సర్వే విషయమై పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)సైతం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. ఆలస్యం మూలంగా నష్టం జరుగుతుందని గుర్తుచేశారు. సమాచారం అడిగినా ఇవ్వడం లేదని సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. 25 రోజుల్లో సంయుక్త సర్వే చేయకపోతే వర్షాకాలం ప్రారంభమవుతుందనీ, ఆ నేపథ్యంలో సర్వే చేయడానికి అనేక ఆటంకాలు ఎదురవుతాయని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయించిన గడువులోగా సర్వే జరిగేలా చూడాలని కోరారు. క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేలా తక్షణమే ఉమ్మడి సర్వే ప్రారంభించిలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గత కృష్ణాబోర్డు భేటీలో ఏపీ సర్కారు సర్వే చేయడానికి అంగీకరించి ఇప్పుడు తీవ్ర ఆలస్యం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు మూడు పేజీల లేఖను ఈఎన్సీ సి.మురళీధర్ సోమవారం సీడబ్ల్యూసీకి రాశారు.

10న కృష్ణాబోర్డు భేటీ

కృష్ణా యాజమాన్య బోర్డు సమావేశం ఈనెల 10న హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. ఈమేరకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. ఏపీతో ఉన్న వివాదాలు, ఇతర నీటి కేటాయింపులపై ఇందులో చర్చించనున్నారు.

నేడే ఇంటర్ ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల ఫలితాలను హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డులో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మార్చి 15 నుంచి గతనెల నాలుగో తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,82,677 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,65,022 మంది కలిపి మొత్తం 9,47,699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మార్చి 24వ తేదీ నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు ఫలితాలను https://tsbie.cgg.gov.in లేదా http://results.cgg.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంపాదకీయం

దాచేస్తే దాగని సత్యం!

వీధి బాలలు దైన్యంగా కనబడకూడదు. ఫుట్‌పాత్‌లపైన, చిరిగిన బట్టలతో, ఎండిన డొక్కలతో, దుమ్ము ధూళితో, మురికి పట్టి మన కంటపడకూడదు. లేకుంటే ప్రపంచం ముందు మన పరువేం కావాలి. ఇప్పుడిదీ మన ఏలికల ఆలోచన! ఈఏడాది అంతర్జాతీయ బాలల హక్కుల కన్వెన్షన్ (జీ20 శిఖరాగ్ర సమావేశాలు) మన దేశంలో జరగబోతుంది.

వచ్చే ప్రతినిధులకు మసిబారిన మన బాల్యం కనిపించకూడదనేగా మన వాళ్ళ హడావుడి. వీధి బాలలను పరిరక్షణా కేంద్రాలకు తరలిస్తున్నామనే పేరుతో ఏ చీకటి గుహల్లోకో నెట్టేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పైగా కనిపించే వాస్తవాన్ని కనుమరుగు చేసేందుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మా దేశం వెలిగిపోతోందని ప్రపంచ దేశాల ముందు గొప్పలు పోయేందుకు సిద్ధమవుతున్నారు.

వెంటనే రోడ్లపై కనిపించే బాలలందరినీ తరలించమని ఆదేశాలు జారీ చేశారు. దానికోసం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. మే 1 నుండి 31 వరకు దేశ వ్యాప్తంగా జిల్లాల్లో ఈ ఆపరేషన్ కొనసాగింపులో భాగంగా చర్యలు చేపడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే కేవలం దేశాన్ని సందర్శించనున్న జీ20 ప్రతినిధులకు మన దేశ బాలల వాస్తవ పరిస్థితి కంట పడకుండా దాచడానికి చేస్తున్న ప్రయత్నమే ఇది. వీధి బాలల అభివృద్ధి విషయంలో మన ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన చర్యలు చేపట్టలేదు. వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన సౌకర్యాలు ఎక్కడా లేవు' అంటున్నారు ప్రముఖ సమాజిక కార్యకర్త నిర్మల్ గోరానా.

నిజమే కదా! వచ్చే ప్రతినిధులకు మసిబారిన మన బాల్యం కనిపించకూడదనేగా మన వాళ్ళ హడావుడి. వీధి బాలలను పరిరక్షణా కేంద్రాలకు తరలిస్తున్నామనే పేరుతో ఏ చీకటి గుహల్లోకో నెట్టేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పైగా కనిపించే వాస్తవాన్ని కనుమరుగు చేసేందుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మా దేశం వెలిగిపోతోందని ప్రపంచ దేశాల ముందు గొప్పలు పోయేందుకు సిద్ధమవుతున్నారు.



ఇలా సమస్యలను దాచేయడం మన పాలకులకు కొత్తేమీ కాదు. గతంలో ట్రంప్ వస్తున్నాడని ఇలాగే హంగామా చేశారు మన ప్రధాని. ఆయన పర్యటించే ప్రాంతాల్లో యాచకులు కనబడకుండా వాళ్ళను ఎక్కడో దూరంగా పడేసి వచ్చారు. మనది సంపన్న దేశంగా చూపించేందుకు నానా తంటాలు పడ్డారు. ఇప్పుడు వీధి బాలల వంతు. ప్రజల బాధలే తన బాధలని చెప్పుకునే ప్రధాని పరివారం చెయ్యాల్సిన పనులేనా ఇవి? తనేదో గొప్ప పనులు చేస్తుంటే ప్రతిపక్షాలు తిడుతున్నారని కన్నీరు కారుస్తున్నారు. వీధి బాలల కన్నీళ్ళు మాత్రం ఆయనకు కనబడవా? నిజానికి వీధి బాలలకు సురక్షితమైన ప్రదేశం ఏదైనా ఉందీ అంటే అది కేవలం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మాత్రమే. నిర్మల్ గోరానా అన్నట్టు ప్రభుత్వ విద్యాసంస్థలను మన పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పేదలకు విద్యను అందని ద్రాక్షగా చేస్తున్న వీళ్ళు వీధి బాలల జీవితాలను ఎలా మారుస్తారో చెప్పాలి?

ఈ ఆపరేషన్‌కి అంతర్జాతీయ స్థాయిలో బాలల కోసం పని చేస్తున్న యునిసెఫ్‌ను దూరం పెట్టమన్నారు. అంటే వీరి చేతల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో దీనివల్ల అర్థమవుతుంది. జీ20 దేశాల ప్రతినిధులు మన దేశంలోని బాలల దుస్థితిని చూసి ఎక్కడ ఛీ కొడతారో అని వారి భయం. అయితే ఇక్కడ జీర్ణించుకోలేని వాస్తవం ఏమిటంటే దేశంలో వీధి బాలల సంఖ్యపై ప్రభుత్వం వద్ద సరైన డేటా లేకపోవడం. ఒక్కో స్వచ్ఛంధ సంస్థ అంచనాలు ఒక్కో రకంగా ఉంటున్నాయి. రెయిన్‌బో హోమ్స్ అనే ఎన్‌జీఓ ప్రకారం గత 20ఏండ్లుగా భారతదేశంలోని 10నగరాలైన ఢిల్లీ, ఆగ్రా, అలహాబాద్, కాన్పూర్, లక్నో, మొఘల్ సరాయ్, ముంబై, నాసిక్, పూణే, కోల్‌కతాల్లో కోటి ఎనభై లక్షల మంది వీధి బాలలున్నారు. ఈ నగరాల్లో నిర్వహించిన సెన్సస్ సర్వే 2,02,765 మంది పిల్లలను గుర్తించింది. ఇందులో ఢిల్లీ 81,235, మహారాష్ట్ర 52,535, ఉత్తరప్రదేశ్ 30,407, కోల్‌కతా 20,068గా సంఖ్యలు ఉన్నాయి. మరో సర్వే ప్రకారం ఒక్క మన హైదరాబాద్‌లోనే 50 నుండి 75 వేల మంది వీధి బాలలు ఉన్నట్టు తేలింది.


3-5 ఏండ్ల మధ్య వయసు వారిలో 58.1శాతం మందికి ప్రభుత్వ విద్య లేదు. 11-14 ఏండ్ల మధ్య పిల్లల్లో కేవలం 33శాతం మంది మాత్రమే ప్రాథమిక విద్య పొందుతున్నారు. మిగిలిన వారంతా కన్న వాళ్ళకు దూరంగా, దురలవాట్లకు అత్యంత దగ్గరగా మసులుతున్నారు. నేర ప్రపంచంలో పావులవుతున్నారు. లైంగిక వేధింపులకు గురవుతూ అసహాయంగా బతుకుతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లల పరిస్థితి మరింత దారుణం. ఇటువంటి దుస్థితిలో ఉన్న వీధి బాలల జీవితాలను బాగు చేయాల్సిన బాధ్యత ఎవరిది? ప్రభుత్వానిది కాదా? స్వచ్ఛంధ సంస్థలు చేస్తున్న పనిని మన దేశ పాలకులు ఎందుకు చేయలేకపోతున్నారో సమాధానం చెప్పాలి. సమస్యలు పరిష్కరించలేని నేతలు దానిని దాచేయడానికి తెగ ఆరాట పడుతున్నారు. కష్టాల కొలిమిలో కాలిపోతున్న భావి భారతాన్ని చీకట్లో దాచి వెలుగుల దేశంగా చూపించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నారు.

సత్యాలను, వాస్తవాలను కప్పిపుచ్చుటమే ఈనాటి పాలకుల లక్షణంగా కనపబడుతున్నది. అయితే సత్యాలు బయటికి రాకమానవు. అబద్ధాలు, దాచివేతలతో ఎంత కాలం కొనసాగుతారు. బాలల భవిష్యత్తు కోసం కృషి చేయాల్సిన వారు ఇలా కప్పిపుచ్చి తమ బాధ్యత నుండి తప్పుకోలేరు.

భయంకరంగా నిరుద్యోగ సమస్య

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నిరుద్యోగానికి సంబంధించి విడుదల చేసిన గణాంకాలు భయంకర పరిస్థితిని సూచిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. కరోనా కాలానికన్నా ముందునుంచీ ఇదే పరిస్థితి. ఇక కరోనా కాలంలో అది అమాంతం పెరిగిపోయింది. ఆ తర్వాత ఆర్థిక వ్యవస్థ మళ్లీ కొంత పుంజుకున్న తర్వాత కూడా పెద్దగా తగ్గలేదు. కనీసం జీడీపీలో ఏ మేరకు కోలుకోవడం జరిగిందో, ఆ మేరకైనా నిరుద్యోగం తగ్గింది లేదు.

2017-18లో నిరుద్యోగం రేటు 4.7గా నమోదైంది. 2018-19 నాటికి ఇది 6.3కి పెరిగింది. ఇక కరోనా కాలంలో లాక్‌డౌన్ విధించాక, డిసెంబర్ 2020 నాటికి అమాంతం 9.1కి చేరింది. ఆ తర్వాత ప్రభుత్వం మన ఆర్థిక వ్యవస్థ కోలుకుందని, మళ్లీ వేగంగా ముందుకు దూసుకుపోతోందని తెగ ప్రచారం చేసుకోవడం జరుగుతోంది. కానీ నిరుద్యోగం మాత్రం కనీసం పాత పరిస్థితికైనా చేరుకోలేదు. డిసెంబర్ 2022 నాటికి అది 8.3శాతం ఉంది. జనవరి 2023లో కొంత తగ్గి 7.4కి చేరింది. కానీ మళ్లీ మార్చి 2023లో 7.8కి పెరిగింది.


ప్రభాత్ పట్నాయక్

2022-23లో మన జీడీపీ 2019-20 నాటి కన్నా 8.4శాతం ఎక్కువ అని, 2018-19 కన్నా 12.95శాతం ఎక్కువ అని అంచనాలు చెపుతున్నాయి. జీడీపీ చూస్తే 12.95శాతం ఎక్కువ ఉన్నా నిరుద్యోగం మాత్రం తగ్గకపోగా 2018-19 కన్నా 1.5శాతం ఎక్కువగా ఉంది. అంటే జీడీపీ పెరుగుదల వల్ల కలుగుతున్న కొత్త ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఇదేదో ఈ నాలుగేండ్ల స్వల్ప కాల వ్యవధిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినందువల్ల వచ్చిన పరిణామం కాదు. ఆ విధంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏదీ చెప్పుకోదగ్గది రాలేదు.

జనవరి 2023లో 40కోట్ల 99లక్షల మంది మొత్తం ఉద్యోగులు, కార్మికులు పనుల్లో ఉంటే మార్చి 2023 నాటికి 40కోట్ల 70లక్షల మంది మాత్రమే ఉన్నారు. (రెండు నెలల్లో 29లక్షల మేరకు ఉద్యోగాలు తగ్గిపోయాయి) 2018-19లో దేశంలో ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 40కోట్ల 89లక్షలు. అంటే నాలుగేండ్ల తర్వాత దేశంలో ఉద్యోగాల సంఖ్య నికరంగా తగ్గిపోయింది. కొత్తగా ఉద్యోగాలు కల్పించడం మాట అటుంచి నాలుగేండ్ల క్రితం ఉన్న ఉద్యోగాలు కూడా ఇప్పుడు లేవు. ఇది భయంకర వాస్తవం.

మరి నిరుద్యోగంలో ఈ కాలంలో కనిపిస్తున్న అదనపు పెరుగుదలకు కారణం ఏమిటి? మొదటిది: ఏయే రంగాల్లో ఆర్థిక వ్యవస్థ కోలుకుందో ఆ రంగాలు ఉపాధిని కల్పించే రంగాలు కావు. ఉదాహరణకు చిన్న, మధ్య తరహా వస్తూత్పత్తి రంగాలు (మాన్యుఫాక్చరింగ్ రంగం) కరోనా అనంతరం పెద్దగా కోలుకోలేదు. మరోవైపు మార్కెట్‌లో డిమాండ్ పడిపోయిన కారణంగా గణనీయంగా లే ఆఫ్‌లు పెరిగాయి. ఆయా యజమానులు గాని, ప్రభుత్వాలు గాని తీసుకున్న 'పొదుపు చర్యలు' కూడా ఈ లే ఆఫ్‌లు పెరగడానికి కొంతవరకూ కారణం.

సిఎంఐఇ ఇచ్చిన వివరాలు దీనికి రుజువుగా ఉన్నాయి. జనవరి 2023లో 40కోట్ల 99లక్షల మంది మొత్తం ఉద్యోగులు, కార్మికులు పనుల్లో ఉంటే మార్చి 2023 నాటికి 40కోట్ల 70లక్షల మంది మాత్రమే ఉన్నారు. (రెండు నెలల్లో 29లక్షల మేరకు ఉద్యోగాలు తగ్గిపోయాయి) 2018-19లో దేశంలో ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 40కోట్ల 89లక్షలు. అంటే నాలుగేండ్ల తర్వాత దేశంలో ఉద్యోగాల సంఖ్య నికరంగా తగ్గిపోయింది. కొత్తగా ఉద్యోగాలు కల్పించడం మాట అటుంచి నాలుగేండ్ల క్రితం ఉన్న ఉద్యోగాలు కూడా ఇప్పుడు లేవు. ఇది భయంకర వాస్తవం.

కానీ ప్రభుత్వ అధికార ప్రతినిధులు మాత్రం దేశంలో ఉపాధి కల్పన పెరిగిపోతోందని చెప్పుకుంటున్నారు. సిఎంఐఇ విడుదల చేసే గణాంకాలను నమ్మవద్దని, అధికారికంగా ప్రభుత్వం నిర్వహించే పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని వాళ్లు చెపుతున్నారు. గ్రామీణ ఉపాధి హామీ కింద పనులు కావాలని కోరేవారి సంఖ్య తగ్గిపోతోందని, అటువంటప్పుడు నిరుద్యోగం పెరిగిందని నిర్ధారించడం ఏ విధంగా సబబు అని వాళ్లు అడుగుతున్నారు కూడా.

ప్రభుత్వం చేసే వాదనలో పస లేదు. ప్రభుత్వం చేపట్టే పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో ఇండ్ల వద్ద జరిగే పనులను (హోం బేస్‌డ్ వర్క్)ను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అటువంటి పనులకు కూలీ చెల్లించడం అనేది ఉండదు. అటువంటి పనులను సిఎంఐఇ లెక్కలోకి తీసుకోదు. కుటుంబానికి వెలుపల లే-ఆఫ్‌ల ఫలితంగా పనులు తగ్గిపోయినప్పుడు ఆ కారణంగా పనులు కోల్పోయినవాళ్లు ఇండ్ల వద్ద జరిగే పనుల్లో పాలు పంచుకుంటారు. అప్పుడు వాళ్లని నిరుద్యోగులుగా ప్రభుత్వ సర్వే పరిగణించదు. అందువల్ల ప్రభుత్వ సర్వేలో నిరుద్యోగం పెరిగినట్టు కనపడదు. ఒకవైపు లే-ఆఫ్‌లు పెరిగినా, ఇంకోవైపు నిరుద్యోగం పెరిగినట్టు ప్రభుత్వ సర్వే చెప్పదు.

సిఎంఐఇ సర్వేతో ఇటువంటి సమస్య లేదు. ఆ సర్వే హోం బేస్డ్ వర్క్‌ను పరిగణనలోకి తీసుకోదు. ఇండ్ల వద్దే పనులు చేసుకుంటూ బతుకుతెరువు కలిగివున్న కొంతమంది సిఎంఐఇ సర్వేలో కవర్ కారు. కానీ వేతనం పొందుతూ పని చేసేవారి పరిస్థితిని యథాతథంగా సిఎంఐఇ సర్వే చూపిస్తుంది. అందువల్ల నిరుద్యోగ పరిస్థితి వాస్తవ స్వరూపాన్ని సిఎంఐఇ సర్వే వెల్లడిస్తుంది.

లాక్‌డౌన్ కాలంలో పట్టణాలను విడిచి తమ స్వగ్రామాలకు పోయినవారిలో కొందరు తిరిగి పట్టణాలకు తరలి వచ్చిన మాట వాస్తవం. అందువల్ల లాక్‌డౌన్ కాలంలో ఉపాధి హామీ పనులు కోరుకున్నంతమంది ఇప్పుడు కోరుకోవడం లేదు. కానీ దేశం మొత్తం మీద నిరుద్యోగం పెరిగిన మాట వాస్తవం. కరోనాకు పూర్వం ఉన్న పరిస్థితితో పోల్చుకున్నా నిరుద్యోగం పెరిగింది. లాక్‌డౌన్ కాలంలో ఎంత పెరిగిందో ఆ మేరకైనా ఇప్పుడు తగ్గలేదు.

పైగా ఉపాధి హామీ కింద పనులు కల్పించమని కోరుతున్నవారి సంఖ్య తగ్గడానికి ఇంకో కారణం కూడా ఉంది.



వారికి చెల్లించవలసిన వేతనాల బకాయిలు పేరుకు పోతున్నాయి. ఏరోజుకు ఆ రోజు కూలీ డబ్బులమీద ఆధారపడి బతికే కుటుంబాలు ఇలా కూలీ డబ్బులు బకాయి పడితే అటువంటి పనులకు పోవడానికి ఎందుకు సిద్ధపడతారు? అందుచేత ఉపాధి హామీకింద పనులు కోరేవారు తగ్గిపోయారు కనుక నిరుద్యోగం తగ్గిపోయి నట్టేనన్నది సరైన వాదన అనిపించుకోదు. ఉపాధిహామీ పనులకు చెల్లించవలసిన వేతనాలను బకాయి పెడుతున్నది కేంద్ర ప్రభుత్వం. దాని కారణంగా ఆ పనుల పట్ల గ్రామాల్లో ఉత్సాహం తగ్గిపోతే దానిని చూపించి నిరుద్యోగం తగ్గిపోయిందని గొప్పగా చెప్పుకుంటున్నదీ ఆ ప్రభుత్వమే. ఈ ప్రభుత్వానికి ఎంత వెటకారంగా ఉందో చూడండి.

వేతనాలను చెల్లించే పనులు తగ్గిపోతే ఆ పనులు పోగొట్టుకున్నవారు ఇళ్ల వద్ద జరిగే పనుల్లో తక్కిన కుటుంబ సభ్యులతోబాటు భాగస్వాములవుతారు. అప్పుడు ఆ కుటుంబంలో ఇంటిదగ్గర చేసే పనికి ప్రతిఫలంగా లభించే ఆదాయాన్ని పంచుకునేవారు పెరుగుతారు. దాని వల్ల వారి సగటు ఆదాయం తగ్గిపోతుంది. ప్రభుత్వం నిర్వహించే పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే ప్రకారమే ఇండ్ల వద్ద పని చేసుకునే స్వయం ఉపాధి పనుల కార్మికుల ఆదాయాలు తగ్గిపోయాయి. పట్టణాల్లోను, గ్రామాల్లో సైతం స్వయం ఉపాధి పనులు చేసుకునే వారి సగటు ఆదాయం 2019 ఏప్రిల్-జూన్ కాలంతో పోల్చితే 2022 ఏప్రిల్-జూన్ నాటికి తగ్గిపోయినట్టు ప్రభుత్వ లెక్కలే వెల్లడి చేస్తున్నాయి. ఈ వాస్తవం కూడా సిఎంఐఇ గణాంకాలు విశ్వసనీయమైనవేనని ధృవపరుస్తున్నాయి.

భారతదేశంలోని నిరుద్యోగ పరిస్థితికి సంబంధించిన గణాంకాలు ఒక మౌలిక విషయాన్ని వెల్లడిస్తున్నాయి. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ఏనాటికీ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి తోడ్పడదు. ఈ నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెడుతున్నప్పుడు పాలకులు, వారిని సమర్థించే మేధావులు మనకు చెప్పింది ఏమిటి? ఈ విధానాల ఫలితంగా సంపన్న దేశాలనుండి పెట్టుబడి పెద్ద ఎత్తున మూడో ప్రపంచదేశాలకు తరలి వస్తుందని, దాని వల్ల ఇక్కడ చాలా పెద్ద మోతాదులో ఉద్యోగాలు కల్పించ బడతాయని వారు అప్పుడు నమ్మబలికారు. ఆ విధంగా జరగాలంటే ఆ పెట్టుబడుల ప్రవాహాలకు ప్రభుత్వం ఏ విధమైన ఆటంకాలనూ కల్పించకుండా, వాటికి తోడ్పడాలని, విదేశీ పెట్టుబడిదారులు కోరిన సహకారాన్నంతటినీ అందించాలని వాదించారు. ఆ విధంగా చేస్తే దేశంలో నిరుద్యోగమే లేకుండా పోతుందని, దేశం అభివృద్ధి చెందుతుందని ప్రచారం చేశారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తిస్థాయిలో అందరికీ ఉపాధి కల్పించడం అనేది ఏ నాటికీ జరగదు. పెట్టుబడిదారులకు ఎంతో కొంత నిరుద్యోగం ఉండడం అవసరం. అప్పుడే వాళ్లు కార్మికుల వేతనాలను తక్కువ స్థాయికి కుదించగలుగుతారు. నయా ఉదారవాద విధానాల వల్ల పూర్తిస్థాయిలో నిరుద్యోగం నిర్మూలించడం జరుగుతుందని ఎవ్వరూ ఆశించలేరు. కానీ ఉన్న నిరుద్యోగం ఎంతో కొంతమేరకు తగ్గి అదనపు ఉద్యోగాలు కల్పించబడతాయని కొందరు అభ్యుదయవాదులు సైతం ఆశపడ్డారు. కానీ నయా ఉదారవాదం వారిని మోసం చేసింది. వలస పాలన నుండి విముక్తి పొంది, ఎంతో కొంతమేరకు స్వతంత్ర ఆర్థిక విధానాలను అమలుచేస్తూ, విదేశీ పెట్టుబడి పట్టును తగ్గించుకోగలిగిన మూడో ప్రపంచదేశాలు మళ్లీ ఆ విదేశీ పెట్టుబడి పెత్తనానికి లోబడిపోయేవిధంగా చేసింది నయా ఉదారవాదవిధానం.

విదేశీ పెట్టుబడులు చిన్న చిన్న దేశాల్లోకి వస్తే అక్కడ ఉండే నిరుద్యోగం సంఖ్య రీత్యా తక్కువగా ఉంటుంది గనుక తగ్గుముఖం పట్టడం జరగవచ్చు. కానీ భారతదేశం వంటి ఎక్కువ జనాభా కలిగివున్న దేశంలో నిరుద్యోగం భారీ సంఖ్యలో ఉంటుంది. ఇటువంటి చోట చిన్న చిన్న దేశాలలో (సింగపూర్, తైవాన్, దక్షిణ కొరియా వగైరా) జరిగిన విధంగా నిరుద్యోగ సమస్య పరిష్కరించబడడం అనేది సాధ్యం కాదు. దానికి తోడు ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలే పెద్ద సంక్షోభంలో కూరుకుపోయివున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సంక్షోభాలు అనివార్యంగా వస్తాయి. ఈ సంక్షోభం నుండి బయటపడే మార్గం ఏదీ లేదు. అటువంటప్పుడు ఆ విధానాలను అమలు చేస్తున్న మన దేశంలో శ్రామిక ప్రజలు అనుభవించే కష్టాలకు సైతం అంతం అనేది లేదు.

నయా ఉదారవాద విధానంలో నిరుద్యోగాన్ని పరిష్కరించే మార్గాలు అంటూ ఏవీ లేవు. పెట్టుబడిదారులు నిరుద్యోగాన్ని పరిష్కరించే బాధ్యత తమది అని ఎప్పటికీ అనుకోరు. ప్రభుత్వం పూనుకుని ఆ బాధ్యతను తీసుకోవాలి. అలా జరగాలంటే ముందు ఈ నయా ఉదారవాద విధానాలనుండి విడగొట్టుకోవాలి. అప్పడే శ్రామిక ప్రజలకు ఏ ప్రభుత్వమైనా తోడుగా నిలవగలుగుతుంది.

నయా ఉదారవాద విధానంలో నిరుద్యోగాన్ని పరిష్కరించే మార్గాలు అంటూ ఏవీ లేవు. పెట్టుబడిదారులు నిరుద్యోగాన్ని పరిష్కరించే బాధ్యత తమది అని ఎప్పటికీ అనుకోరు. ప్రభుత్వం పూనుకుని ఆ బాధ్యతను తీసుకోవాలి. అలా జరగాలంటే ముందు ఈ నయా ఉదారవాద విధానాలనుండి విడగొట్టుకోవాలి. అప్పుడే శ్రామిక ప్రజలకు ఏ ప్రభుత్వమైనా తోడుగా నిలవగలుగుతుంది. (స్వేచ్ఛానుసరణ)

కర్నాటకలో ఊడుతున్న 'కమలం' రెక్కలు!

ప్రస్తుత పరిస్థితుల్లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలకు తన ప్రభావాన్ని విస్తరింపజేయాలని, అన్ని చోట్లా రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించాలని తహతహలాడుతున్న బీజేపీకి ఈ దక్షిణాది రాష్ట్రాన్ని నిలబెట్టుకోవడం అత్యంత కీలకంగా మారింది.

కర్నాటక ఎన్నికల ప్రచారం అన్ని విధాల ఉచ్ఛ స్థితికి చేరిన నేపథ్యంలో బీజేపీ విస్తృత స్థాయి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. తీవ్రంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత, విశృంఖలమైన అవినీతి, ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల దయనీయ పరిస్థితులు వీటన్నింటిపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి ఇందుకు కారణం.

'ఆపరేషన్ కమల్' పేరుతో పాలక కూటమి నుండి ఫిరాయింపులకు పాల్పడడం ద్వారా కాంగ్రెస్-జె.డి (ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత 2019 జులైలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుండి, గత నాలుగేండ్లలో, ఇద్దరు ముఖ్యమంత్రులను, ముగ్గురు డిప్యూటీ ముఖ్యమంత్రులను రాష్ట్రం చూసింది. 2021 జులైలో బి.ఎస్.యడ్యూరప్ప వైదొలగి ముఖ్యమంత్రిగా బసవరాజ్ బొమ్మైకి అవకాశం కల్పించారు. కానీ, బొమ్మై ప్రభుత్వం పూర్తిగా అవినీతితో నిండిపోయింది. జె.డి (ఎస్) నుండి బీజేపీకి మారిన బొమ్మై దూకుడుతో హిందూత్వ మతోన్మాద ఎజెండాను అనుసరించడం ద్వారా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని చూశారు.

గోవధపై కఠోరమైన నిషేధం విధించడం, ప్రధానంగా ముస్లింలు సాగించే మాంసం వ్యాపారానికి ఆటంకం కలిగించడం వంటి చర్యలతో బొమ్మై ప్రభుత్వం మెజారిటీవాదుల మనోభావాలను రెచ్చగొట్టి సొమ్ము చేసుకోవాలని నగ్నంగా ప్రయత్నిస్తున్నది. క్రైస్తవులకు వ్యతిరేకంగా నిరంకుశమైన మత మార్పిడి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్లస్ టూ చదివే విద్యార్థులు హిజాబ్ ధరించడంపై నిషేధం విధించింది. ఒబిసి కేటగిరీలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను రద్దు చేసింది. టిప్పు సుల్తాన్‌ను చంపింది బ్రిటిష్ వారు కాదని, వొక్కలిగ పురాణ పురుషులు ఇద్దరు చంపేశారనే అర్థం లేని కథనాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా ఆయనపై బురద చల్లే యత్నం చేసింది. మైనారిటీ వ్యతిరేక ఎజెండాను అమలు చేయడానికి కర్నాటక ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చూస్తుంటే హిందూత్వను గౌరవించేవారి జాబితాలో అగ్ర స్థానానికి చేరేందుకు గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లతో పోటీ పడుతున్నట్లుగా కనిపిస్తోంది. అయితే, మతోన్మాద పోకడలకు మరింత పదును పెట్టడం, మెజారిటీవాదుల మనోభావాలను రెచ్చగొట్టి తనవైపు తిప్పుకోవడానికి యత్నించడం ద్వారా... రికార్డు స్థాయిలో అవినీతి, కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను కప్పిపుచ్చాలని చూస్తున్నది. 40శాతం కమిషన్‌ని ముడుపులుగా తీసుకుని బొమ్మై ప్రభుత్వం అవినీతికి పర్యాయపదంగా మారింది. వివిధ విభాగాలు, మంత్రిత్వ శాఖలకు చెందిన బిల్లులు ఆమోదం పొందాలంటే మొత్తం బిల్లులో 40శాతం చొప్పున చెల్లించాల్సి ఉందంటూ రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ చేసిన విమర్శే ఇది. ముడుపులు కావాలని డిమాండ్ చేశారంటూ ఆరోపించి కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఆత్మహత్యకు పాల్పడడంతో మంత్రి కె.ఎస్.ఈశ్వరప్ప తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇటీవల కాలంలో ముడుపులు కావాలని డిమాండ్ చేసినందుకు బీజేపీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడిని అరెస్టు చేశారు. వారి ఇళ్ళ నుండి విజిలెన్స్ బ్యూరో అధికారులు రూ.8.1 కోట్లను స్వాధీనం చేసుకున్నారు.

వ్యవస్థీకృతమైన అవినీతి ద్వారా ఇలా బహిరంగంగా దోపిడీ చేయడంతోబాటు రైతాంగ వ్యతిరేక విధానాలకు కూడా ప్రభుత్వం పాల్పడింది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్చేందుకు అనుమతించేలా భూ సంస్కరణల చట్టాన్ని సవరించింది. పార్లమెంట్ ఆమోదించిన వ్యవసాయ బిల్లుకు అనుగుణంగా వ్యవసాయ వాణిజ్యంలోకి కార్పొరేట్ల ప్రవేశాన్ని అనుమతించేందుకు ఎపిఎంసి యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసింది. నిత్యావసర ఆహార పదార్థాలు, వంటనూనెల ధరల పెరుగుదల



అనేది నిరుపేద వర్గాలకు అతి పెద్ద సమస్యగా మారిందని తాజా సర్వేల్లో వెల్లడైంది. అవినీతి, ధరల పెరుగుదలతో పాటు నిరుద్యోగం కూడా ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ వ్యతిరేకత బాగా బలంగా ఉందని స్పష్టంగా గ్రహించిన బీజేపీ కేంద్ర నాయకత్వం హిందూత్వ విభజన ఎజెండాను ప్రముఖంగా తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రచారానికి స్వయంగా అమిత్ షా, నరేంద్ర మోడీ నాయకత్వ బాధ్యతలు నెత్తినేసుకున్నారు. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్ రద్దు చేస్తామని అమిత్ షా ప్రకటించారు. ఒకవేళ కాంగ్రెస్ గెలుపొందితే, కర్నాటకలో అల్లర్లు చెలరేగుతాయని ఆయన బెదిరించారు. తీవ్రవాదులను రక్షించేవారిగా, బుజ్జగింపు మాస్టర్లుగా కాంగ్రెస్ నాయకత్వాన్ని నరేంద్ర మోడీ చిత్రీకరిస్తున్నారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఉమ్మడి పౌరస్మృతి, జాతీయ పౌర పట్టికలను ప్రవేశపెట్టారు. ఆలయాల చుట్టూ స్థానిక వ్యాపారాలను క్రమబద్ధీకరించడం గురించి కూడా ఆ ఎన్నికల మేనిఫెస్టో మాట్లాడుతోంది. అంటే ఆలయాల చుట్టుపక్కల ముస్లింలు దుకాణాలు ఏర్పాటు చేసుకోకుండా నిషేధించారని అర్థం.

ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనుసరించే సాధారణ ఎత్తుగడలు, నినాదాలు పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదని ఇప్పటివరకు సాగిన ఎన్నికల ప్రచారం తెలియజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన తీరును దృష్టిలో పెట్టుకుంటే "డబుల్ ఇంజన్ సర్కార్" అన్న నినాదం పూర్తిగా కుప్పకూలింది. హిందూత్వ తరుపుముక్కకు కూడా కొన్ని పరిమితులు ఉన్నాయి. ఇప్పటికే మతపరంగా చీలిపోయిన ప్రాంతాల్లో ఇది కొంచెం పని చేసే అవకాశం ఉంది కానీ, అసమ్మతి, అసంతృప్తితో రగిలిపోతున్న అనేక వర్గాల ప్రజలను అంతగా ఆకర్షించలేక పోవచ్చు. హిందూత్వ పిలుపులు కేవలం కోస్తా తీర ప్రాంత జిల్లాలకు, అలాగే సెంట్రల్, మలనాడ్ ప్రాంతంలో కొన్ని భాగాలకు పరిమితమైనట్లు కనిపిస్తోంది. పైగా టిక్కెట్ల పంపిణీపై బీజేపీలో లింగాయత్ నాయకత్వంలో నెలకొన్న నిరాశ ఆ వర్గానికి చెందిన కొంతమంది ప్రముఖ నేతలు పార్టీ నుండి బయటకు వెళ్ళిపోవడానికి దారి తీసింది.

"డబుల్ ఇంజన్" నినాదంలో అంతర్లీనంగా ఉన్న కేంద్రీకృత ధోరణికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో ప్రాంతీయ కన్నడిగ గుర్తింపును పరిరక్షించడమన్నది ఆవిర్భవించింది. కేంద్ర పోటీ పరీక్షల్లో కన్నడాన్ని నిర్లక్ష్యం చేసి హిందీని రుద్దడానికి ఈ డబుల్ ఇంజన్ ప్రభుత్వం తెగించింది. రాష్ట్రంలో పేరుమోసిన పాల బ్రాండ్ నందినిని దెబ్బ తీసేలా కర్నాటక పాల సహకార సమాఖ్యను గుజరాత్ పాల సమాఖ్యతో విలీనం చేయడం గురించి మాట్లాడుతూ, కర్నాటకలో అమూల్ చొరబాటుకు అనుమతించింది.

"డబుల్ ఇంజన్" నినాదంలో అంతర్లీనంగా ఉన్న కేంద్రీకృత ధోరణికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో ప్రాంతీయ కన్నడిగ గుర్తింపును పరిరక్షించడమన్నది ఆవిర్భవించింది. కేంద్ర పోటీ పరీక్షల్లో కన్నడాన్ని నిర్లక్ష్యం చేసి హిందీని రుద్దడానికి ఈ డబుల్ ఇంజన్ ప్రభుత్వం తెగించింది. రాష్ట్రంలో పేరుమోసిన పాల బ్రాండ్ నందినిని దెబ్బ తీసేలా కర్నాటక పాల సహకార సమాఖ్యను గుజరాత్ పాల సమాఖ్యతో విలీనం చేయడం గురించి మాట్లాడుతూ, కర్నాటకలో అమూల్ చొరబాటుకు అనుమతించింది.

తీవ్ర నైరాశ్యంలో ఉన్న బీజేపీ మోడీ ప్రచారం పైనే పూర్తిగా ఆధారపడింది. బీజేపీ అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా ప్రధాని నరేంద్రమోడీ పట్ల మీరు అభిమానం చూపినట్లే అంటూ బసవరాజ్ బొమ్మై ఎన్నికల ర్యాలీల్లో చెబుతున్నారు. మోడీకి ఓటు వేయాలంటూ ఇలా విజ్ఞప్తి చేయడం ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలను గుర్తు చేస్తోంది. 'బీజేపీ అభ్యర్థిని మీరు గుర్తుంచుకోనక్కరలేదు, కేవలం కమలం చిహ్నాన్ని గుర్తుంచుకోండి. కమలానికి ఓటు వేయడమంటే మోడీకి ఓటు వేసినట్లే' అంటూ మోడీ తన ప్రసంగాల్లో పిలుపు ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఏమవుతుందో మనకు తెలుసు-బీజేపీ ఓడిపోయి, ప్రభుత్వాన్ని కోల్పోవడం తథ్యం. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి గణనీయమైన రాజకీయ, సైద్ధాంతిక ప్రభావాన్ని కలిగివున్న ఏకైక దక్షిణాది రాష్ట్రం కర్నాటక మాత్రమే. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి హిందూత్వ శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ కాగలదు. అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తీవ్రమైన సవాలును విసిరేందుకు లౌకిక, ప్రజాతంత్ర ప్రతిపక్ష ఐక్యతను ఇది మరింత వేగవంతం చేస్తుంది. ('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

రిపోర్టర్స్ డైరీ

ఫ్లెక్సీల్లోనూ పేదరికమే!

బీదతనం, పేదరికం, దరిద్రం... ఇలా పేర్లేవైనా భావం ఒక్కటే. కాంగ్రెస్ పార్టీ అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారానికి దూరమై పదేండ్లు దాటింది. ఇప్పట్లో అప్పటి రాజసం వస్తుందో లేదో అనే డౌట్ అలాగే ఉంది. తాజాగా ఆపార్టీ ప్రియాంకగాంధీని హైదరాబాద్‌కు పిలిపించి, పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేశారు. సరూర్‌నగర్ స్టేడియం చుట్టుపక్కల రోడ్లకు అటూ, ఇటూ ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టి ఏదో హడావిడి చేసే ప్రయత్నం చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. మీటింగ్‌కు వస్తున్నామె కాంగ్రెస్‌పార్టీ వారసురాలు. ఒక్కసారి కనీసం తమ ఫొటో అయినా ఆమె కంట్లో పడితే చాలనుకొనే ఔత్సాహిక పార్టీ నేతలు భారీగానే బ్యానర్లు కట్టారు. కాకపోతే... ఆ బ్యానర్లు ముద్రించిన ప్రింటర్‌కి డబ్బులు ఇచ్చారో... మళ్లీ ఇస్తాం... అని చెప్పారో ఏమో..! అన్ని ఫ్లెక్సీల్లోనూ వెలిసిపోయిన పాత రంగులే తప్ప, కొత్తగా ఇంకు పోసినట్టు కనిపించలేదు. మీటింగ్ అయ్యాక ఆ నేతలు అలవాటు ప్రకారం డబ్బులు ఇస్తారో లేదో అనే డౌట్‌తో సదరు ప్రింటర్ తనదగ్గరున్న పాతరంగునంతా వాడేసినట్టున్నాడని పబ్లిక్ కామెంట్. ఒక్క ఫ్లెక్సీలో ఓ 50 మంది ఫోటోలు ముద్రించుకున్నారు. అదేదో హోలీ పండక్కి రంగునీళ్ల కుమ్మరించినట్టు తెల్లఫ్లెక్సీలు రకరకాల రంగుల్లోకి మారాయే తప్ప, అందులో ఉన్న ఒక్కరి ముక్కుమూతీ సక్కంగ లేకపాయే! అధికారంలోకి రాలేకపోతే... పెట్టిన పెట్టుబడి వృధా అనుకున్నారో, ఒక్క రోజు భాగ్యానికి అంత భోగం ఎందుకనుకున్నారో, ఏదో పెద్దోళ్లు పెట్టమన్నారని మొహమాట పడ్డారో... ఫ్లెక్సీలు కట్టేటప్పుడే వెలిసిపోయి ఉండటం ఆపార్టీ పదేండ్ల దరిద్రాన్ని కండ్లకు కడుతుందంటూ అపోజిషనోళ్ళు ఎకసెక్కాలాడుతున్నారు సామీ!! - ఎస్ఎస్ఆర్ శాస్త్రి

గిదేంది సామీ..ఫోన్‌లేదా?

అంతా స్మార్ట్ ఫోన్ల మాయ. చేతిలో ఒక్కరోజు ఫోన్ లేకపోతేనే అల్లాడిపోతున్న కాలమిది. సామాన్యులు సైతం అప్పోసప్పో చేసి కొనేస్తున్నారు. అదీ కుదరకపోతే వాయిదాల చెల్లింపుల పద్ధతిలోనైనా ఫోన్ కొని హమ్మయ్యా !అని ఊపిరిపీల్చుకుంటారు. సన్నిహితులకు, తమకు అవసరమున్న వారందరికీ ఫోన్ చేసి మరీ కొత్త ఫోన్ కొన్నా అని చెబుతున్నారు. ఇదీ నడుస్తున్న కాలం. కానీ, బండి సంజయ్ చెబుతున్న సమాధానాలు మాత్రం నలుగురికీ నవ్వు పుట్టిస్తున్నాయి. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో ఈటల బృందం భేటీ అవుతున్నదంటగా అని మీడియా ప్రశ్నిస్తే తనకు ఆ విషయం తెలియదని బండి చెప్పేశాడు. పైగా, తన దగ్గర ఫోన్ లేదు కాబట్టి సమాచారం ఇవ్వలేదని దాటేశాడు. నిజంగానే ఆయన ఫోన్ పోయిందే అనుకుందాం. ఒక ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న బండి సంజయ్‌కుమార్ దగ్గర నెల రోజులకు పైగా ఫోన్ లేకుండా ఉండటమంటే అది ప్రపంచంలో ఎనిమిదో వింతనే అయి ఉంటుంది. గల్లీనాయకుండే ఫోన్ లేకుంటే అల్లాడిపోతుంటారు..ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడివి అయ్యి ఉండి ఫోన్ లేదంటే ఎట్లా స్వామీ?. ఏది చెబితే అది వింటున్నరని ప్రజల చెవ్వుల్లో పువ్వు పెట్టడమెందుకు బండీ. ఇట్లనే మాట్లాడుకుంటూ పోతే నాలుగురోజులైతే ఎవ్వరూ నీ మాట నమ్మరు జర చూసుకుని మాట్లాడు స్వామీ. -అచ్చిన ప్రశాంత్

ఫోన్లు పాడుగాను..!

మాయా... మాయా.. .అంతా మాయా. ఎక్కడ చూసినా స్మార్ట్‌ఫోన్ల మాయనే. పిల్లల నుంచి పెద్దల దాకా లేచిన దగ్గర నుంచీ పడుకునే దాకా అది చేతిలో ఉండాల్సిందే. లేకుంటే పొద్దుపోనట్టే. పిల్లలు పాలు తాగాలన్నా.. తిండి తినాలన్నా చేతిలో ఉండాల్సిందే. లేకుంటే ఏడ్చుకుంట కూర్చుంటారే తప్ప ముద్దనోటిలోకి దిగని దుస్థితి. నిద్రలోనూ చేతివేళ్లతో ఫోన్లను ఆపరేట్ చేసేలా పిచ్చి పీక్ స్టేజీకి చేరుకున్నది. ఏమైనా అంటే 'ఎప్పుడు మీరే చూస్తరా? చూసుకోండి. నేనేం తినను పో అంటూ మారాం. బెదిరిస్తే ఏడ్చేయటమే. మొదట్లో మురిపెం కోసం పాటలంటూ..డ్యాన్సులంటూ పిల్లల చేతికి స్మార్ట్ ఫోన్ ఇచ్చిందీ మనమే. 'ఆ స్మార్ట్‌మాయ నుంచి బయటపడటం ఎలారయ్యా?' అంటూ తలలు పట్టుకుంటున్నదీ మనమే. పిల్లలు అనేదాంట్లోనూ వాస్తవం ఉందండోయ్. ఇంట్లో ముగ్గురు పెద్దోళ్లుంటే ముగ్గురి చేతుల్లో స్మార్ట్‌ఫోన్లే. లేచినదగ్గర నుంచీ పడుకునేదాకా నిమిషానికోసారి వాట్సాప్.. ఫేస్‌బుక్... ఇన్‌స్టాగామ్..ట్విట్టర్, యూట్యూబ్.. జీమెయిల్.. మెసెంజర్.. తొక్కాతోలు.. తోటకూర అంటూ చూస్తూ గడిపేయటం షరామామూలే. 'ఆవు చేన్లో మేస్తే దూడ గట్టున మేస్తుందా'? అన్న సామెతకు గుర్తుచేసేలా స్మార్ట్‌ఫోన్ల విషయంలో పిల్లలు, తల్లిదండ్రుల మధ్య తంతు నడుస్తున్నది. అంతా అయిపోయినాక 'ఈ ఫోన్లు పాడుగాను' అని తలలు పట్టుకుంటే ఏం లాభం. -గుడిగ రఘు

ఆట, పాటలే మేలు...

కరోనా... లాక్ డౌన్...ఆన్‌లైన్ చదువుల పుణ్యమానీ స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడిన పిల్లలు వాటిని వదిలి ఉండటం లేదు. నగరాలు, పట్టణాల్లో పిల్లలైతే మరీ ఆటలకు పూర్తిగా దూరమై ఆన్‌లైన్ గేమ్‌లకు వ్యసనపరులుగా మారిపోయారు. ఆఫ్ లైన్ చదువులకు పరిమితం కాగా, మళ్లీ వేసవిలో స్మార్ట్ ఫోన్ల అల్లరి మొదలైంది. ఫోన్ ఇస్తే ఒక బాధ...ఇవ్వకపోతే ఒక బాధ అన్నట్టుగా తల్లిదండ్రుల పరిస్థితి తయారైంది. దీంతో పిల్లలను దాన్నుంచి డైవర్ట్ చేసేందు కన్నట్టుగా నగరాలు, పట్టణాల్లో వీధి, వీధికొకటి అన్నట్టుగా సమ్మర్ క్యాంపులు పుట్టుకొస్తున్నాయి. ఇందులో కళలకు సంబంధించినవి కొన్నైతే, మరికొన్ని క్రీడలకు సంబంధించినవి ఉంటున్నాయి. ప్రభుత్వం నుంచి కొన్ని క్యాంపులను నిర్వహిస్తున్నా.... మారిన పరిస్థితుల్లో భవిష్యత్ తరం కోసం వాటిని మరింత పెంచాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్ల వంటి వాటికి అతుక్కుపోయే పిల్లలు చురుకుదనం కోల్పోతున్నారని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకుంటుందా?.... -కె.ప్రియకుమార్

మన ఉక్కు మనిషి దుర్గాబాయి





మహిళలు నాలుగు గోడలు దాటి అడుగు బయట పెట్టడమే తప్పుగా భావించే రోజులవి. ఏన్నో కట్టుబాట్లు, అంక్షల మధ్య వారి జీవితాలు గడిచిపోతుండేవి. అటువంటి రోజుల్లోనే ఉన్నత విద్యను అభ్యసించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. అంతేకాదు ఒక సంఘ సంస్కర్తగా, రచయిత్రిగా, న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆమే చెన్నై, హైద్రాబాద్ నగరాల్లో ఆంధ్ర మహిళా సభలను స్థాపించిన దుర్గాబాయ్ దేశముఖ్. ఈ రోజు ఆమె వర్ధంతి సందర్భంగా ఆ స్ఫూర్తిదాయక జీవితాన్ని ఒకసారి మననం చేసుకుందాం...

దుర్గా బాయ్ 15, జులై 1909 రాజమండ్రి లోని రామారావు, కృష్ణవేణి దంపతులకు జన్మించారు. వీరిది మధ్య తరగతి కుటుంబం. 8 ఏండ్ల వయసులో ఆమెకు మేనమామ సుబ్బారావుతో వివాహం జరిగింది. అయితే కొంత ఊహ తెలిసాక చదువు పై దృష్టి పెట్టాలనే ఆలోచనతో ఆమె ఆ వివాహాన్ని వ్యతిరేకించారు. కుటుంబ సభ్యులు కూడా ఆమె ఇష్టానికి మద్దతు పలికారు. ఇక అప్పటి నుండి దుర్గాబాయ్ చదువుపై దృష్టి పెట్టి బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రిక్యులేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎమ్మె పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. 1942లో న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకుని మద్రాసు హై కోర్ట్‌లో ప్రాక్టీస్ మొదలు పెట్టారు.

12 ఏండ్ల వయసులోనే...

దుర్గాబాయ్ చిన్నతనం నుండే స్వాతంత్ర పోరాటంలో పాలుపంచుకున్నారు. తన 12 ఏండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం ప్రారంభించారు. రాజమండ్రిలో బాలికలకు హిందీ విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించింది. తెలుగు గడ్డపై మహాత్మాగాంధీ రాకను పురస్కరించుకుని 12 ఏండ్ల వయసులో విరాళాలు సేకరించి ఆయనకు అందచేశారు. అంతేకాదు ఆంధ్ర పర్యటనలలో గాంధీజీ హిందీ ఉపన్యాసాలు తెలుగులోకి అనువదించారు. దుర్గాబాయ్ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనప్పుడు మహిళ అని కూడా లేకుండా బ్రిటిష్ ముష్కరులు విచక్షణా రహితంగా లాఠీ చార్జీ చేసారు. ఆ సమయంలో రెండు చేతులకు గాయాలై రక్తం కారుతున్నా తన పిడికిలిలో చిక్కుకున్న గుప్పెడు ఉప్పును మాత్రం నేల జారనియ్యని చైతన్యవంతురాలు.



దేశముఖ్‌తో పరిచయం...

1937లో చెన్నైలో ఆమె ఆంధ్ర మహిళా సభను ప్రారంభించారు. 1941లో ఆంధ్ర మహిళా పత్రికను స్థాపించి, సంపాదకత్వ బాధ్యతలు తానే స్వయంగా చూశారు. అంతేనా దుర్గాబాయ్ భారత దేశ రాజ్యాంగ సభ, ప్రణాళిక సంఘం సభ్యురాలు. భారత రాజ్యాంగ నిర్మాణసభలో 1946 నుండి 1950 వరకు సభ్యురాలిగా పని చేశారు. తర్వాత 1952లో ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా కూడా పని చేశారు. ఆ సమయంలో దేశముఖ్‌తో ఏర్పడిన పరిచయం వారి వివాహానికి దారి తీసింది. అప్పటి నుండి దుర్గాబాయ్ దేశముఖ్‌గా ఆవిడ ప్రాచుర్యం పొందారు.



మహిళా విద్య కోసం...

1953 ఆగస్టులో భారత ప్రభుత్వం నెలకొల్పిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలుగా పనిచేశారు. 1958లో హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మహిళా వసతి గృహ ఏర్పాటుకై పాటుపడ్డారు. రాష్ట్రమంతటా ఎన్నో కళాశాలలు, వసతి గృహాలు, నర్సింగ్ హోములు, వృత్తి విద్యా కేంద్రాలు నెలకొల్పారు. 1971లో నెహ్రూ లిటరసీ అవార్డు వయోజన విద్యా సేవలకు గుర్తింపుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. 1975లో భారత ప్రభుత్వం ఆమెకు పద్మ విభూషణ అవార్డును ఇచ్చి సత్కరించింది.

స్టోన్ దట్ స్పీక్

దుర్గాబాయ్ తన అనుభవాలతో 'స్టోన్ దట్ స్పీక్' పేరిట ఒక పుస్తకం రాశారు. ఆ పుస్తకంలో ఆమె కాలాన్ని ఎలా వినియోగించుకోవాలో రాస్తూ "ఒక సంకల్ప శక్తి కలిగిన వ్యక్తి, కాలం విలువను అర్థం చేసుకో గలిగిన వ్యక్తి, ప్రణాళిక బద్ధంగా కాలాన్ని తీర్చిదిద్దుకోగలిగిన వ్యక్తి, ఏ కార్యాన్ని సాధించాలనుకున్నాడో, దానికి అనుస రించాల్సిన వ్యూహాన్ని సిద్ధం చేసుకుని లోభ కారకాలనూ, మోహ కారకాలనూ జయించి నిలబడగలిగిన వ్యక్తి కొన్ని కోట్ల రూపాయలు సంపాదించి తీసుకురాగలడేమో కానీ కోట్లాది రూపాయలు మాత్రం అటువంటి వ్యక్తిని తయారు చేసి తీసుకురాలేవు. అటువంటి వ్యక్తులు దేశ చరిత్రను తిరగ రాస్తారు' అని అన్నారు. ఎంతో అద్భుతమైన వాక్యాలు ఇవి. ఈ ప్రతి పదంలోను, వాక్యంలోను ఎంతో అర్థం ఉంది.

స్ఫూర్తిదాయక జీవితం

మహిళా సంక్షేమం, సాధికారత కోసం విశిష్ట సేవలు అందించిన స్వచ్ఛంద సంస్థలను గుర్తించేందుకు కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఆమె పేరు మీద వార్షిక అవార్డును ఏర్పాటు చేసింది. అక్షరాస్యత రంగంలో విశేష కృషి చేసినందుకు యునెస్కో అవార్డు కూడా ఆమెకు లభించింది. దుర్గాబాయి అందరికీ స్ఫూర్తి. ఒక రచయిత్రిగా, స్వతంత్ర సమర యోధురాలిగా, న్యాయవాదిగా, రాజకీయ వేత్తగా ఆవిడ ఎదుర్కొన్న సమస్యలు, వివక్షలు ఆమెను భారత ఉక్కుమనిషిగా నిలబెట్టాయి. బ్రిటిషు వారికి ఆడ సింహంగా, ధీరవనితగా పేరు గడించారు. అందరినోటా కీర్తించ బడ్డ దుర్గాబాయ్ 1981 మే 9న తుది శ్వాస విడిచారు. ఓ తెలుగింటి ఆడబడుచు తెలుగు రాష్ట్రాలు గర్వించే విధంగా జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఈ రోజున ఆమెను స్మరించుకుంటూ, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరుకుంటూ

- పాలపర్తి సంధ్యారాణి

కొన్నింటికి దూరంగా ఉండాలి

టీనేజీ అమ్మాయిల నుంచి మహిళల వరకు మనలో చాలామందిలో కనిపించే సమస్య.. హార్మోనుల్లో అసమతుల్యత! అసలే వేసవి. చాలామంది మనసు పర్యటనలపై ఉంటుంది. దీంతో తినే ఆహారంపై కాస్త పట్టు విడుస్తాం. సమస్య తీవ్రమవొద్దంటే ఈ కాలం కొన్నింటికి దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు..

సోయా
సాధారణంగా ఇవి ఆరోగ్యానికి మేలు చేసేవే! కానీ ఈ కాలంలో దీనిలో ఉండే ఫైటో ఈస్ట్రోజన్.. ఈస్ట్రోజన్‌లానే పని చేస్తుందట. దీంతో పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం పడుతుంది. కాబట్టి సోయాసాస్, సోయా మిల్క్, చంక్స్ వంటి వాటికి దూరంగా ఉండండి.

పాల పదార్థాలు
ఇవి ఈ కాలం జీర్ణవ్యవస్థలో ఇన్‌ఫ్లమేషన్‌కి తద్వారా హార్మోనుల్లో అసమత్యులతకూ కారణమవుతాయట. ఒక్కోసారి చెడు కొవ్వులు పేరుకోవడానికీ దారితీస్తాయట. హార్మోనుల అసమతుల్యత సమస్య ఉన్న వారు ఈ కాలంలో వీలైనంత వరకూ పాలు, పాలపదార్థాలను తగ్గించడమే మేలు.

చక్కెర
తీపి పదార్థాలు, కృత్రిమ చక్కెరలు జీర్ణాశయంలోని మేలు చేసే సూక్ష్మజీవులపై ప్రభావం చూపుతాయి. దీంతో పదే పదే ఆకలి వేస్తున్నట్లు అనిపించి, అతిగా తినడం వైపునకు మనసు మళ్లుతుంది. ఇదీ హార్మోనులపై ప్రభావం చూపేదే. వీలైనంత వరకూ చాక్లెట్లు, స్వీట్లతోపాటు జంక్ ఫుడ్‌కీ దూరంగా ఉండాలి. తీపి తినాలనిపిస్తే బెల్లాన్ని ఆశ్రయించడం మేలు.

కెఫిన్
నిద్ర మత్తు పోగొట్టుకోవడానికే కాదు.. కాస్త మనసు చిరాగ్గా తోచినా, ఒత్తిడి అనిపించినా మనసు కాఫీ, టీలవైపు మళ్లుతుంది. శరీరంలో కెఫిన్ స్థాయిలు పెరిగితే నిద్రపై తద్వారా హార్మోనులపై దుష్ప్రభావం పడుతుంది. రెండు కప్పులకు మించి తీసుకోవద్దు. వేడికి ఐస్క్రీమ్‌ల వైపూ మనసు మళ్లుతుంటుంది. దీనివల్లా శరీరంలో కార్టిసాల్ స్థాయిలు పెరుగుతాయి. ఇదీ శరీరానికే చేటే!



కర్నాటకలో ముగిసిన ప్రచార పర్వం..

(మొదటిపేజీ తరువాయి)

10న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 13న ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, ఈ ఎన్నికల్లో అధికారిక బీజేపీకి ఎదురుదెబ్బ తగలనున్నదనీ, కాంగ్రెస్‌కు ఫలితాలు ఆశాజనకంగా ఉండనున్నాయని పలు ప్రీపోల్ సర్వేలతో పాటు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కర్నాటక ఎన్నికల్లో రూ.375 కోట్లకు పైగా సీజ్

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటక రాష్ట్రంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. గెలుపు కోసం కోట్లు ఖర్చు చేయడానికి సైతం వెనకాడటం లేదు. ఇందులో భాగంగా ఎన్నికల అధికారులూ ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి చర్యలు తీసుకున్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల నగార మోగిన తర్వాత మార్చి 29 నుంచి ఇప్పటి వరకు రూ. 375 కోట్లు పట్టుబడ్డాయి. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం.. రూ.375.6 కోట్లు సీజ్ చేశారు. ఇందులో నగదు రూ. 147 కోట్లుగా ఉన్నది. అలాగే, మద్యం, బంగారం మరియు వెండి రూ. 97 కోట్లు, ఉచితాలు రూ. 24 కోట్లు, డ్రగ్స్, నార్కోటిక్స్ రూ. 24 కోట్లుగా ఉన్నట్టు కర్నాటక ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడించారు. నగదు సీజ్‌కు సంబంధించి ఇప్పటి వరకు 2,896 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎన్నికల తేదీల ప్రకటనకు ముందు (మార్చి 9 నుంచి మార్చి 27 వరకు) మొత్తం రూ. 58 కోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

యూనియన్ పెట్టుకుని సమ్మె చేస్తే నోటీసులా?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. ఆ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరారు. సోమవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 'జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 28 నుంచి సమ్మెలో ఉన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నది. వారితో చర్చించి సామరస్యంగా పరిష్కరించకుండా అవిచివేత ధోరణికి పాల్పడుతున్నది. యూనియన్ పెట్టుకున్నందుకు, సమ్మె చేస్తున్నందుకు విధుల్లోకి తొలగిస్తున్నామని నోటీసులు జారీ చేయడం దుర్మార్గం' అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు యూనియన్ పెట్టుకోవడం, సమ్మె చేయడం హక్కు అని స్పష్టం చేశారు. రెగ్యులర్ చేయాల్సి వస్తే కమిటీ వేసి ఉద్యోగుల పనితీరు ఆధారంగా చేస్తామని మెలిక పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రొబేషన్ పీరియడ్ డిక్లేర్ చేసి సర్వీసు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సుకుమా అడవుల్లో ఎదురుకాల్పులు

- మహిళా మావోయిస్టుతో సహా దళ కమాండర్ మృతి



నవతెలంగాణ-చర్ల

తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా దంతేష్ పురం దండకారణ్యంలో సోమవారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 8 లక్షల రివార్డు గల ఎల్‌వోఎస్ కమాండర్ మడకం ఎర్ర, ఎల్‌వోఎస్ సభ్యురాలు పొడియం భీమా మృతి చెందినట్టు సుకుమా ఎస్పీ సునీల్ శర్మ ధృవీకరించారు. గొల్లపల్లి ఎల్‌వోఎస్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మడకం ఎర్ర దంతేష్ పురం అడవుల్లో సంచరిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. పోలీసులను చూసి విచక్షణారహితంగా మావోయిస్టులు కాల్పులు జరిపారు. దాంతో పోలీసులు సైతం కాల్పులు జరిపారు. సుమారు గంట పాటు జరిగిన ఎదురు కాల్పుల అనంతరం ఇద్దరు మావోయిస్టులు చనిపోగా సంఘటనా స్థలంలో మావోయిస్టుల దైనందిన సామగ్రితో సహా మందు గుండు సామగ్రిని పెద్ద మొత్తంలో స్వాధీనపర్చుకున్నట్టు ఎస్పీ వివరించారు.

బాగేపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి హత్యకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం గతంలో తెచ్చిన ఎన్ఆర్‌సీ, సీఏఏలకు వ్యతిరేకంగా అప్పట్లో పోరాడారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బహిరంగంగా మద్దతు తెలుపుతున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా బ్రహ్మరథం పడుతుండడంతో ఈసారి బాగేపల్లిలో సీపీఐ(ఎం) గెలుపు ఖాయం అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో, సీపీఐ(ఎం) అభ్యర్థిని హత్య చేసేందుకు ఆ రాష్ట్ర అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు కుట్రలు చేసినట్టు తెలుస్తోంది. అందులో భాగంగా ఇటీవల కొందరు గూండాలు అనిల్‌కుమార్ ఇంటిపై ఒక గదిలో మకాం వేశారు. ఆదివారం రాత్రి వారంతా 15 నిమిషాలకు ఒకసారి కిందకు రావడం, అనిల్‌కుమార్ ఇంట్లోకి తొంగిచూసి వెళ్లడం చేశారు. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో అనిల్‌కుమార్ ఇంట్లో ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో సీపీఐ(ఎం) కార్యకర్తలు ఉన్నారు. దీంతో, వారు ఇంట్లోకి చొరబడలేకపోయారు. వారిపై అనుమానం వచ్చిన కొందరు సీపీఐ(ఎం) నాయకులు సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. పోలీసులు వచ్చి అక్కడ అనుమానాస్పదంగా ఉన్న యువకులను విచారించారు. ఈ సమయంలో వారంతా మద్యం మత్తులో ఉండడం, పొంతనలేని సమాధానం చెప్పడంతో వారిని అరెస్టు చేశారు. వారి బ్యాగులను పరిశీలించగా తుపాకీ బయటపడింది. వారు వాడిన వాహనాల్లో బీజేపీ కండువాలు ఉన్నాయి. తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకొని 19 మంది అనుమానితులను అరెస్టు చేశారు. మరో 11 మంది పరారయ్యారని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. బీజేపీకి అనుబంధంగా ఉన్న వారంతా అనిల్‌కుమార్‌ను హత్య చేసేందుకు పథకం పన్నారని చెప్పారు. సీపీఐ(ఎం) అభ్యర్థికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి బాగేపల్లి పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు.

ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలి : సీపీఐ(ఎం) అభ్యర్థి

అనిల్‌కుమార్‌పై హత్య కుట్ర తెలుసుకున్న సీపీఐ(ఎం) కార్యకర్తలు బాగేపల్లిలోని ఆయన నివాసం వద్దకు బాగేపల్లి, గుడిబండ, చేళూరు తాలుకాల నుంచి సోమవారం పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా వారితో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనతో కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ఇలాంటప్పుడు సంయమనంతో ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎవరూ రావొద్దని కోరారు. హత్యా రాజకీయాలకు, దాడులకు పాల్పడే వారికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు.

ఆర్ఎస్ఎస్ గూండాల నుంచి అనిల్‌కు రక్షణ కల్పించాలి .. : సీపీఐ(ఎం) చిక్‌బళ్లాపూర్ జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప

బాగేపల్లిలో సీపీఐ(ఎం)కు పెరిగిన జనాదరణ చూసి ఓర్వలేని బీజేపీ హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని సీపీఐ(ఎం) చిక్‌బళ్లాపూర్ జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప విమర్శించారు.

దాడిని తీవ్రంగా ఖండించిన సీపీఐ(ఎం)

- సమగ్ర విచారణకు డిమాండ్
- నిరసనలకు పిలుపు

బెంగళూరు : కర్నాటకలోని బాగెపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి అనిల్ కుమార్‌పై దాడిని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. దాడికి సంబంధించిన సమగ్ర దర్యాప్తునకు పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) తన అధికారిక ట్విట్టర్ వేదికగా స్పందించింది. కామ్రేడ్ అనిల్ కుమార్, సీపీఐ(ఎం)కు భద్రత కల్పించాల్సిన అవసరమున్నదని పేర్కొన్నది. ఈ మేరకు నిరసనలు నిర్వహించాలని రాష్ట్రంలోని తన అన్ని యూనిట్లకూ పార్టీ పిలుపునిచ్చింది.

సీపీఐ(ఎం) అభ్యర్థి అనిల్‌కుమార్‌కు ప్రాణహాని ఉందని తెలిపారు.

ఈ కుట్రలో పట్టుబడింది కొంతమంది మాత్రమేనన్నారు. ప్రశాంతంగా ఉన్న బాగేపల్లిని మరో బెంగళూరు చేసేందుకు బిజెపి కుట్రపన్నుతోందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు, ఎన్నికల వ్యవస్థ సక్రమంగా పనిచేయాలని కోరారు. బాగేపల్లిలో ఎగిరేది ఎర్రజెండానేనని తెలిపారు.

విధుల్లో చేరకుంటే ఉద్యోగం ఊస్టే

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. సోమవారం ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా నోటీసులను జారీ చేశారు. 'జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేయడం నిబంధనలను ఉల్లంఘించడమే. జేపీఎస్‌లు యూనియన్ ఏర్పాటు చేయడం, సమ్మెకు దిగడం చట్టవిరుద్ధం. ప్రభుత్వంతో జేపీఎస్‌లు చేసుకున్న అగ్రిమెంట్ బాండ్‌ను ఉల్లంఘిస్తూ యూనియన్‌గా ఏర్పడి, తమ సర్వీసు డిమాండ్‌తో 2023 ఏప్రిల్ 28 నుండి సమ్మెకు దిగినట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. 'జూనియర్ పంచాయితీ సెక్రటరీగా విధుల్లో చేరే ముందు సంఘాలు, యూనియన్‌లలో చేరబోం అని ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. దాని ప్రకారం వారికి ఆందోళన చేసే, సమ్మెకు దిగే హక్కు లేదు. ఈ వాస్తవాలు తెలిసినప్పటికీ, జేపీఎస్‌లు ఒక యూనియన్‌గా ఏర్పడ్డారు. చట్టవిరుద్ధంగా ఏప్రిల్ 28, 2023 నుంచి సమ్మెలోకి వెళ్లారు. నిబంధనలు అతిక్రమించిన నేపథ్యంలో ఉద్యోగాలలో కొనసాగే హక్కును ఇప్పటికే వారు కోల్పోయారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో జేపీఎస్‌లకు చివరి అవకాశాన్ని ఇస్తున్నది. మే 9న సాయంత్రం ఐదు గంటల్లోపు విధుల్లో చేరాలి. విధుల్లో చేరని జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరూ టర్మినేట్ అవుతారు' అని నోటీసులో పేర్కొన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించనందుకే సమ్మెలోకి...

రాష్ట్ర ప్రభుత్వం 2019లో రిక్రూట్‌మెంట్ టెస్టు ద్వారా 9,355 పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. మూడేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ ఒప్పందం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి జేపీఎస్‌లు విధులు చేపట్టారు. ఆ తర్వాత నాలుగేండ్లకు పెంచింది. అన్ని శాఖల ఉద్యోగులకు రెండేండ్లు ఉంటే వీరికి నాలుగేండ్లకు పెంచడమేంటనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అయినా, రాష్ట్ర సర్కారు వెనక్కి తగ్గలేదు. గొడ్డుచాకిరీ చేయలేక, మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు ఇవ్వటం, వేరే ఉద్యోగాలు రావటం వంటి కారణాలతో చాలామంది జేపీఎస్ కొలువును వదిలేసిపోయారు. వారి స్థానంలో ఎంట్రెన్స్ టెస్టు మెరిట్ లిస్టు ప్రకారం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జేపీఎస్‌లను నియమించారు. వీరి బతుకులు మరీ దారుణంగా ఉన్నాయి. నాలుగేండ్ల పూర్తయినా పర్మినెంట్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఏప్రిల్ 28వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు.

స్పష్టమైన హామీ ఇవ్వరు..సమ్మె చేయొద్దంటరు...

సమ్మెకు వెళ్లేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరూ కలిశారు. ఆ సందర్భంగా మంత్రి వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సీఎం కేసీఆర్ దగ్గర ఫైలు ఉంది కాబట్టి తొందరపడి సమ్మెలోకి వెళ్లొద్దంటూ ఆయన వారికి సూచించారు.

ఇప్పటికే ఏ ప్రభుత్వ ఉద్యోగికి జరగని అన్యాయం తమకు జరుగుతున్నదనీ, ఇంకా నాన్చొద్దని జేపీఎస్‌లు మంత్రి దగ్గర గోసను వెళ్లబుచ్చుకున్నారు. తమను ఎప్పటిలోగా పర్మినెంట్ చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు అడిగారు. ఫైలు సీఎం దగ్గర ఉంది కాబట్టి తానేం చెప్పలేననీ, పర్మినెంట్ చేస్తారు కాబట్టి సమ్మెలోకి వెళ్లొద్దని ఎర్రబెల్లి అల్టిమేటం జారీ చేశారు. మంత్రి దగ్గర నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో అనివార్యంగా 28 నుంచి జేపీఎస్‌లు సమ్మెలోకి వెళ్లారు. మంత్రి చెప్పాడు కాబట్టి సమ్మెలోకి వెళ్లొద్దని కొందరు...లేదులేదు సమ్మెలోకి వెళ్లాల్సిందేనని జేపీఎస్‌ల యూనియన్ రెండుగా చీలిపోయింది. ఎక్కువ సంఖ్యలో జేపీఎస్‌లు సమ్మెలోకి వెళ్లారు. తాజాగా మూడు రోజుల కిందట కూడా మంత్రి దయాకర్‌రావు వారిని పిలిపించుకుని సమ్మె విరమించాలని సూచించారు. నిర్థిష్టమైన హామీ ఇచ్చే వరకు తమ సమ్మె కొనసాగుతుందని జేపీఎస్‌లు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అల్టిమేటం జారీ చేసింది.

మధురఫలం చేదెక్కింది

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. చలి కాలంలో భారీ వర్షాలు కురవడం, రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోవడం.. ఫిబ్రవరి నుంచి ఎండలు మండిపోవడం.. మార్చిలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పూత ఎండి పిందె రాలిపోయింది. నిమ్మకాయల పరిస్థితిలోనూ ఎలాంటి మార్పు లేదు. గతంలో ఒక నిమ్మచెట్టుకు 5 నుంచి 6 బస్తాల కాయలు వచ్చేవి. చీడపీడల కారణంగా ఈసారి ఒకటి రెండు బస్తాలకే పరిమితమయింది. వ్యవసాయ మార్కెట్‌లో బస్తా రూ.2,500 పైగా రిటైల్‌గా సైజును బట్టి ఒక్కొక్క కాయ రూ.10 నుంచి రూ.15 పలుకుతోంది. ప్రస్తుతం పచ్చళ్ల సీజన్ మొదలైంది. సాధారణంగా ఈ సీజన్‌లో ప్రతి ఇంట్లో మామిడి, నిమ్మ పచ్చళ్లని తయారు చేసుకొని ఏడాదంతా నిలువ చేసుకుంటారు. మామిడి, నిమ్మకాయల ధరలకు తోడు వంట నూనెలు, మసాలా దినుసులు, కారం పొడులు కూడా భారీగా పెరగడంతో పచ్చడి మెతుకుల కోసం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక బారం తప్పడం లేదు.

రుచి చూడలేక పోతున్నాం : తిరుమల, గృహిణి

సాధారణంగా నలుగురు కుటుంబ సభ్యులున్న ఒక కుటుంబం ఏడాది వినియోగానికి 5 నుంచి 10 కిలోల పచ్చడి తయారుచేసుకోవాలి. పచ్చడిలో వాడే మామిడితోపాటు నూనెలు, ఆవాలు, జీలకర్ర, మెంతులు, వెల్లుల్లి, కారం ధరలు పెరిగాయి. 5 కిలోల పచ్చడికి గతంలో కంటే అదనంగా రూ.300 ఖర్చు చేయాల్సి వస్తోంది. పచ్చిడి రుచిని ఆస్వాదించాలని ఉన్నా చూడలేకపోతున్నాం.

సోనియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిని పరిశీలిస్తే సార్వభౌమత్వం అనే పదాన్నే ఆమె ఉపయోగించలేదని తేలింది. అయినప్పటికీ కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్‌ను కలిసి ఆమెపై ఫిర్యాదు చేసింది. సోనియా ఉద్దేశపూర్వకంగానే ఆ పదాన్ని ఉపయోగించారని, అది 'తుక్డే తుక్డే గ్యాంగ్' అజెండా అని బీజేపీ ప్రతినిధి బృందం విమర్శించింది. దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కలిగించేలా ఆమె ఆ పదాలు వాడారని తెలిపింది. కాంగ్రెస్ గుర్తింపును రద్దు చేయాలని బీజేపీ నాయకుడు తరుణ్ చుగ్ డిమాండ్ చేశారు. సోనియా వ్యాఖ్యలు దిగ్భ్రాంతి కలిగించాయని, అవి ఆమోదయోగ్యం కావని కేంద్ర మంత్రి శోభా కరంద్లజే అన్నారు. సోనియా వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ విమర్శలు గుప్పించిన మర్నాడే బీజేపీ బృందం ఆమెపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఓఆర్ఆర్ లీజు విధివిధానాలను బయటపెట్టాలి...

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే ఓఆర్ఆర్ లీజు విధివిధానాలను పారదర్శకంగా ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు మణిహారంగా, ప్రజలకు సౌకర్యంగా, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉన్న ఓఆర్ఆర్‌ను ముంబయికి చెందిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్ అనే ప్రయివేటు కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం లీజుకివ్వాలని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ఆర్నెళ్ల క్రితమే లీజు నిర్ణయం జరిగినా గోప్యంగా ఉంచిందని పేర్కొన్నారు. ప్రతి ఏటా పెరుగుతున్న ఓఆర్ఆర్ ఆదాయం మేరకు లీజు నిర్ణయం జరగలేదని, నిబంధనలేవీ పాటించలేదని, వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆర్థిక నిపుణులు, సంస్థలు డిమాండ్ చేస్తున్నాయని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అదానీ, అంబానీల వంటి ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకుంటామని, ప్రయివేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్ తదితరాలను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టకుండా చూడాలని డిమాండ్ చేశారు. లీజుకు సంబంధించిన విమర్శలు వస్తున్నందున ఒప్పంద వివరాలను ప్రజలముందుంచాలని డిమాండ్ చేశారు.

ఫీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్‌గా వంశీకృష్ణ



నవతెలంగాణ - బోడుప్పల్

మేడ్చల్ జిల్లా ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ గా వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్ గా పనిచేసిన డాక్టర్. రామకృష్ణ రావు నిజాంపేట్ కార్పొరేషన్ కు బదిలీపై వెళ్లారు. నిజాంపేట్ లో కమిషనర్ గా బాధ్యతలు నిర్వహించిన వంశీకృష్ణ ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు.

ఆలయానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి : గిరీష్



నవతెలంగాణ- బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు తిమ్మని గిరీష్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలా పూర్ గ్రామంలోని పురాతన సంతాన శ్రీ శ్రీ వేణుగో పాలస్వామి దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో రూ.1కోటి నిధులను కేటాయించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. అనంతరం ఆ ఆలయానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డికి బాలాపూర్ ప్రజలు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

'దొంగ' ప్రేమ జంట అరెస్టు



నవతెలంగాణ - బోడుప్పల్

జల్సాలకు అలవాటు పడిన ఓ ప్రేమ జంట దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్న మహిళ కండ్లలో కారం కొట్టి మెడలోని బంగారు పూస్తేల తాడుని అపహరించిన ఈ ప్రేమికులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మల్కాజిగిరి డీసీపీ డీ.జానకి మీడియాకు వివరాలను వెల్లడించారు. బండారి యాదమ్మ డిపల్లి పీఎస్ పరిధిలోని సీపీఆర్ఐ రోడ్డు ఎదురుగా ఓ చాయ్ బండి నడుపుతూ జీవనం సాగిస్తుంది. ఈ నెల 5న సాయంత్రం 4గంటల సమయంలో హెూండా అక్టీవా స్కూటీపై ఒక మహిళ, మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి చాయ్ తాగి వెళ్ళిపోయారు. తర్వాత ఇద్దరు అదే రోజు సాయంత్రం 6గంటల ప్రాంతంలో వచ్చి చాయ్ బండి నిర్వాహకురాలిని సిగరెట్ కావాలని అడిగారు. సిగరెట్ ఇచ్చే లోపే తమ వెంట తెచ్చిన కారంపొడిని ఆమె కండ్ల లో చల్లి మెడలోని బంగారు పూస్తేల తాడును లాక్కుని పారిపోయారు. బాధితురాలు కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరి డీసీపీ జానకి, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి,మేడిపల్లి సీఐ గోవర్ధన గిరి, డీఐ ప్రవీణ్ బాబులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంను రంగంలోకి దింపారు. సమీపంలోని సుమారు 70 సీసీ టీవీ ఫుటేజ్ లను బాధితురాలికి చూపించారు. దీంతో ఆ ఇద్దరు ప్రేమికులు ధరించిన డ్రెస్ ల ఆధారంగా వారిని గుర్తించింది. ఉప్పల్ భరత్ నగర్ లో నివాసం ఉంటున్న గొల్ల నరేష్, రామంతాపూర్ లో నివాసం ఉండే యెల్లి శిరీషలు. వీళ్లను వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లుగా ఒప్పుకున్నారు. వాళ్ల నుండి ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా రెండు తులాల బంగారాన్ని రికవరీ చేయాల్సి ఉంది. ఈ ఘటన జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన మేడిపల్లి డీఐతో పాటు సిబ్బందిని డీసీపీ జానకి అభినందించారు.

నెంబరు ప్లేట్ సరిగ్గా లేకుంటే కఠిన చర్యలు తప్పవు....

కొంతమంది తమ వాహనాలకు జరిమానాలు పడకుండా నెంబరు ప్లేట్ కనపడకుండా, వంకర చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని , అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ జానకి హెచ్చరించారు. అదే విధంగా వేసవి సెలవుల దృష్ట్యా ఊర్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, మేడిపల్లి ఇన్ స్పెక్టర్ గోవర్ధన గిరి, డీఐ ప్రవీణ్ బాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 'ప్రియాంక గాంధీ' జోష్

- నగరంలో ఉత్సహంగా యువ సంఘర్షణ సభ
- భారీగా తరలి వచ్చిన యువత, కాంగ్రెస్ శ్రేణులు
- ఎల్బీనగర్‌లోని శ్రీకాంతచారి విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో/ఎల్బీనగర్

కాంగ్రెస్ చేపట్టిన యువ సంఘర్షణ సభ విజయవంతమైంది. సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అందులోనూ ప్రియాంక గాంధీది తెలంగాణలో తొలి రాజకీయ పర్యటన కావడంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా నిరుద్యోగులు, విద్యార్థులు, యువతకు అండగా తామున్నామని భరోసా కల్పించి.. వారిని కాంగ్రెస్ వైపు ఆకర్షించడంతోపాటు శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేలా ప్రియాంక పర్యటనను సద్వినియోగం చేసుకోవడంలో సక్సెస్ అయ్యింది. ప్రధానంగా నగర ప్రజలు, యువత, పెద్దలు, పిల్లలు ప్రియాంక గాంధీని చూసేందుకు పెద్ద సంఖ్యలో సరూర్‌నగర్ స్టేడియానికి తరలివచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వివిధ జిల్లాల నుంచి నిరుద్యోగులను తరలిచడంలో జిల్లా నాయకులు మంచి కృషి చేయడంతో యువ సంఘర్షణ సభకు విశేష స్పందన లభించింది. అంతకుముందు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, పలువురు నాయకులు ఎల్బీనగర్‌లోని శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అక్కడి నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సరూర్‌నగర్ స్టేడియానికి పాదయాత్రగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడునా జనం నీరాజనం పలికారు. ఈ క్రమంలో జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన యువత, కాంగ్రెస్ నాయకులు, అభిమానులతో కొత్తపేట, ఎల్బీనగర్, హస్తినాపురం, వనస్థలిపురం, మలక్‌పేట్, దిలిసుఖ్‌నగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఫ్లైఓవర్లు పలు రహదారులు వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒకదశలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రించలేక చేతులెత్తేయడంతో ఆస్పత్రులకు రోగులు తీసుకువెళ్లే అంబులెన్స్‌లకు సైతం ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు చిరువ్యాపారుల సందడి కనిపించింది. పాదయాత్రగా బయలుదేరిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నేరుగా సరూర్‌నగర్ హెలీప్యాడ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ప్రియాంక గాంధీకి స్వాగతం పలికారు. ఇక ప్రియాంక గాంధీ సభాస్థలికి చేరుకోగానే కార్యకర్తలు, యువత చప్పట్లతో ఆమెకు స్వాగతం పలికారు. వేదికపై ఉన్న కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఆమె కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా చనిపోయిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చొప్పున చెక్కులను అందించారు. పోచంపల్లి చేనేత చీరను ప్రియాంక గాంధీకి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అందించారు. ఆ తర్వాత తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌పై ఆమె మాట్లాడారు. ఆమె స్పీచ్ పూర్తయిన వెంటనే సభ నుంచి కార్యకర్తల పిలుపుమేరకు వారి వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. వారి నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం సభ వేదికపైకి వచ్చి అందరికి అభివాదం చెబుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సభకు వివిధ కారణాలతో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహా గైర్హజయ్యారు. ఇక ఈ సభలో అదిలాబాద్ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

చనిపోయిన కార్యకర్తలకు చెక్కుల పంపిణీ

సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ యువ సంఘర్షణ సభలో పాల్గొన్న ప్రియాంక గాంధీ మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చనిపోయిన ఆ కార్యకర్తల కుటుంబ సభ్యులు ప్రియాంక గాంధీ కాళ్లపై పడి కంటతడి పెట్టుకున్నారు. వారిని ఆమె ఒదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించారు.

ప్రభుత్వ స్కూళ్లకు దాతలు సహకరించాలి

- మంత్రి చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రభుత్వ స్కూళ్లకు దాతలు సహకరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి కోరారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్ల లో టెక్నిప్ ఎఫ్ఎంసీ వారి సహకారంతో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మండల ప్రజా పరిషత్ హై స్కూల్ నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందని అన్నారు. ఈ భూమి పూజలో మేయర్ సామల బుచ్చి రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్, ఎఫ్ఎంసీ కంపెనీ ఎండీ తివారి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, యాజమాన్యం, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

నియోజకవర్గ పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని రాగాల ఎన్ క్లేవ్ లో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, సహారా వద్ద రూ.87లక్షలతో బీటీ రోడ్డు, ఆర్టీసీ కాలనీలో రూ.53లక్షలతో సీసీ రోడ్డు, రాజరాజేశ్వరి కాలనీ రూ. 35లక్షలతో కమ్యూనిటీ హాల్, పవన గిరి కాలనీలో రూ.29లక్షలతో, శివమ్ హిల్స్ కాలనీ లో రూ. 28లక్షలతో డ్రైనేజీ పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేతో పాటుగా కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం రూ. 2.62కోట్ల నిధులతో అభివద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.మొదటగా మంచి నీటి పైప్ లైన్, తర్వాత డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లా రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, మహిళా అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, శివ గంగా కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, రఘు నాథ్, నాగభూషణం, కళ్యాణ్, జక్కిడి రఘువీరారెడ్డి, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటా

- రాష్ట్ర అధ్యక్షులు జాగిరి అంజి గౌడ్



నవ తెలంగాణ - చైతన్యపురి

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటా అని సర్వాయి పాపన్న మోకుదెబ్బ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాగిరి అంజి గౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న మోకుదెబ్బ సంక్షేమ సంఘం మొదటి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వనస్థలిపురంలో రాష్ట్ర అధ్యక్షులు జాగిరి అంజి గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, ఎరుకల మహేందర్ గౌడ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సర కాలంలో జిల్లాలో దాదాపుగా 25 మంది తాటి చెట్టు ప్రమాద బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.15000 ప్రభుత్వం నుండి సంఘం ఇప్పించిందని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలోని వద్దులకు రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఓల్డ్ ఏజ్ హెూం ఆర్గనైజర్ పెద్ది శంకర్ గౌడ్, శంకర్ గౌడ్, బత్తిని వీరస్వామి గౌడ్, పల్లెర్ల శారద గౌడ్, రాజేందర్, కిరణ్ రమ్యకృష్ణ పాల్గొన్నారు.

సరూర్ నగర్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-బోడుప్పల్

సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పీర్జాదిగూడ డెకథ్లాన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ కుటుంబ అవసరాలకు అనుగుణంగా వాడుకుంటున్నారని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే ఏటా లక్ష ఉద్యోగాలు అంటూ ప్రగల్భాలు పలికిన కేసీఆర్.. ఊరికి ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. నిరుద్యోగులకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం'



నవ తెలంగాణ - చైతన్యపురి

రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సరూర్ నగర్ లో సోమవారం నిర్వహించే యువ సంఘర్షణ సభ కు ఆర్ కేపురం నుండి ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువత తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్పీఎస్సీ లో ప్రశ్నా పత్రాలు లీకై నిరుద్యోగులు ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీఎస్పీఎస్సీ అక్రమాలపై కమిటీ వేసి దొంగలను పట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పున్నా గణేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్రినేత్ర ఆంజనేయ స్వామి ఉత్సవాల్లో కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధి లోని సాహెబ్ నగర్ లో శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయ అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉమేష్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, దేవేందర్ గౌడ్,టెంపుల్ ఈవో ప్రవీణ్ కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ జెండాలు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ లో ఎక్కడ చూసినా కాంగ్రెస్ జెండాలే కనిపిస్తున్నాయి. విజయవాడ జాతీయ రహదారిపై ఓడింగ్ లు,ఫెక్సీలు ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియం యువ సంఘర్షణ సభ వేదిక అయింది. సోమవారం నిర్వహించిన ఈ సభకు ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రాంరెడ్డి 20 వేల మందిని తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ యువ డిక్లరేషన్ ను ప్రియాంక గాంధీ ప్రకటించినట్లు తెలిపారు. 80 బస్సుల్లో నిరుద్యోగులను సభకు తరలించినట్లు తెలిపారు. 120 డీసీఎంలను కాలనీ కాంగ్రెస్ అభిమానుల కోసం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి 20,000 మంది నిరుద్యోగులు సభకు వచ్చినట్లు తెలిపారు. ప్రియాంక రాకతో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఉప్పల్, ఎల్బీనగర్, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలలో సభ జోష్ పెరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రతి నలుగురిలో ముగ్గురికి నోమో ఫోబియా

నవతెలంగాణ -హైదరాబాద్

ప్రపంచ స్థాయి స్మార్ట్-ఉపకరణం బ్రాండు అయిన ఓప్పో, విశ్లేషణా సంస్థ అయిన కౌంటర్పాయింట్ సమన్వయంతో లో బ్యాటరీ ఉత్కంఠగా అనిపించే నోమో ఫోబియాపై ఒక వినియోగదారు అధ్యయనంను విడుదల చేసింది. ఈసందర్భంగా ఓప్పో ఇండియా, సిఎంఒ దమ్యం త్ సింగ్ ఖనోరియా మాట్లాడుతూ... ఓప్పో తన టెక్నాలజీ వినూత్నతపై తనకు తాను గర్విస్తోందన్నారు. వినియోగదారు అవసరాలను అర్థం చేసుకోవడానికి తాము స్థిరంగా అధ్యయనాలపై ఆధారపడతామన్నారు. ప్రపంచానికి చిరస్థాయి అయిన విలువ, దయాగుణాన్ని తీసుకువచ్చే ఉత్పత్తులను, అనుభవాలను సృష్టిం లో చడం తమ ధ్యేయమన్నారు. లో బ్యాటరీ ఉత్కంఠపై రీసర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ మాట్లాడుతూ... మనం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అనుసంధానమై ఉండడానికి, వినోదం కోసం కూడా వీలు కలిగించే మన స్మార్ట్ ఫోన్లు మన వ్యక్తిగత ప్రపంచాలుగా మారుతున్నాయన్నారు. ఆ పర్యవసానంగా, మనలో అనేకమంది ఫోన్లు లేకుండా ఉండలేమనే ఫోబియాను వృద్ధి చేసుకుంటున్నారన్నారు. దాని ఫలితంగా వ్యక్తులు బ్యాటరీ అయిపోతుందేమో, తమ ఫోన్లను వాడుకోలేమేమో అనే ఉత్కంఠను తరచుగా అనుభవిస్తూ గడుపుతున్నారన్నారు. లో బ్యాటరీ ఉత్కంఠ అనే భావన 31 నుండి 40 సంవత్సరాల వయో సమూహంలో ఉండే పనిచేయు వ్యక్తుల్లో అత్యధికంగా, ఆ తర్వాత 25 నుండి 30 సంవత్సరాల వయసు వ్యక్తుల్లో ఉంటోందన్నారు.

మొనాకోలో విజయాలుసాధించిన నిక్ క్యాసిడి

నవతెలంగాణ -హైదరాబాద్

నిక్ కాసిడీ (ఎన్విజన్ రేసింగ్) ఏబీబీ ఎఫ్ఎస్ఐఏ ఫార్ములా ఈ ప్రపంచ ఛాంపియన్షిప్లో గ్రిడ్లో తొమ్మిదవ నుండి ఒక స్టార్మింగ్ డ్రైవ్తో అగ్రస్థానానికి చేరుకుని 2023 మొనాకో ఈ-ప్రిక్స్లో రేసును గెలుచుకున్నాడు. క్యాసిడీ ఇంటికి మిచ్ ఎవాన్స్ (జాగ్వార్ టీసీఎస్ రేసింగ్) నాయక "సత్వం వహించాడు. ఈసందర్భంగా ఎన్విజన్ రేసింగ్ నెం.37 నిక్ కాసిడీ మాట్లాడుతూ... బెర్లిన్కు వ్యతిరేకంగా తనకు ఏమీ లేదన్నారు. కానీ ఇది అద్భుతంగా అనిపిస్తుందన్నారు. ఇది చాలా ప్రత్యేకమన్నారు. తాను మాటల కోసం ఓడిపోయానన్నారు. రెండు ఉచిత అభ్యాసాలలో ఇది తనను సంతోషంలో ముంచెత్తిందన్నారు. తాను చాలా సంతోషంగా ఉన్నానన్నారు. జాగ్వార్ టీసీఎస్ రేసింగ్ నెం.9 మిచ్ ఎవాన్స్ మాట్లాడుతూ... తాను ఈ రోజు తన ఉత్తమమైనదాన్ని ఇచ్చానన్నారు. పూర్తి క్రెడిట్ నిక్, ఎన్విజన్ లేదని.. వారు గొప్ప పని చేసారన్నారు.. సరైన సమయంలో నిక్ తనను దాటేశాడన్నారు. తాను సేఫ్టీ కార్ తర్వాత కొంచెం లాక్ అయ్యానన్నారు. అవలాంచె ఆండ్రెట్టి ఫార్ములా ఈ టీ మ్ నెం.27 జేక్ డెన్నిస్ మాట్లాడుతూ... తన మొదటి ల్యాప్లో గోడను కొట్టిన తర్వాత తాను అబ్బాయిలతో సరిపెట్టుకోవలసి వచ్చిందని అనుకుంటు న్నానన్నారు. ముందు రెండు వరుసలలో స్టార్ట్ చేయడానికి తమకు కారు ఉంది. తన తరఫున పొరపాటు జరిగిందన్నారు. ముందున్న కార్ల కంటే 2శాతం ఎక్కువ కలిగి ఉండటం కొంచెం నిరాశపరిచిందన్నారు.

మంత్రి సబితా ఇంద్రా రెడ్డికి కృతజ్ఞతలు



నవ తెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కురుమల్ గూడలో బ్రాహ్మణ భవన్ కు వేయి గజాలు కేటాయించిన మంత్రి సబితా ఇంద్రా రెడ్డికి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచీతం శ్రీధర్, మహేశ్వరం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మలు కతజ్ఞతలు తెలియజేశారు. ఆర్కే పురంలోని కార్యాలయంలో సోమవారం మహేశ్వరం బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక, శ్రీ వేద భారతీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణులు (సుమారుగా 25 నుండి 30 వేల ఓటు బ్యాంక్) అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. బ్రాహ్మణ భవన్ కోసం విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిని సంప్రదిండంతో వెంటనే స్పందించి మంత్రి వేయి గజాల స్థలం కేటాయించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మంగు రాఘవరావు, జనరల్ సెక్రెటరీ ప్రమోద్ కొటార్, గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి, తులసి శ్రీనివాస్, మునిపల్లె శ్రీనివాస్, బ్రాహ్మణ నాయకులు ప్రకాష్, మధుసూదన్ రావు , యాదగిరి రావు, రఘునందన్ రావు, రాజేశ్వర శర్మ, శ్యాంసుందర్ ఆచార్యులు, రమా శంకర్, బొడ్డుపల్లి రామ్మోహన్ రావు, తాటికొండ అనురాధ పాల్గొన్నారు.

ఆర్టీసీని పటిష్టపరచడంలో భాగస్వాములు కావాలి

- ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యాదగిరి



నవతెలంగాణ - బోడుప్పల్

ఆర్టీసీని పటిష్టపరచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇ.యాదగిరి కోరారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో సోమవారం ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అభివద్ధికి ప్రతి ఉద్యోగి అంకితభావంతో కషి చేసినప్పుడే లాభాలు చేకూరుతాయని అన్నారు. ఓఆర్, ఈపీకే, కేఎంపీఎల్ సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలంటే ప్రయాణికుల మన్ననలను పొందాలని సూచించారు. సమయ పాలన, ప్రయాణికుల పట్ల మర్యాదగా మెదలాలని కోరారు.

కండక్టర్ ను సన్మానించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్న మాణిక్యమ్మ ఒక్క రోజులో 50 టీఏవైఎల్ టికెట్లు అమ్మింది. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ యాదగిరి శాలువా కప్పి సన్మానించారు. 12 ఏండ్లు పైబడిన బాలికలు, మహిళలకు ఈ నెల 9 నుండి వచ్చే నెల 15 వరకు 80 రూపాయలకే టీఏవైఎల్ టికెట్లను అమ్ముతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎన్. ఈసు, అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్) సుబ్రహ్మణ్యం, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.


'సత్యదేవ్ ఎంక్లేవ్ కాలనీ సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తా'



నవతెలంగాణ -హస్తినాపురం

గత కొంతకాలంగా సత్యదేవ్ ఎంక్లేవ్ కాలనీ లో నెలకొన్న మౌలిక సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారం జంగయ్య ఆధ్వర్యంలో సోమవారం కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో మంజూరైన పార్కు పనులు దాదాపు గా పూర్తి అయ్యాయని తెలిపారు.ఫెన్సింగ్ పనులు కూడా చేపట్టి పార్క్ ను అభివద్ధి చేసేలా కషి చేయాలని కార్పొరేటర్ ను కోరారు. స్పందించిన కార్పొరేటర్ త్వరలో ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యదేవ్ ఎంక్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజయభాస్కర్ రెడ్డి, గోపాల్ రావు, రాంరెడ్డి, రాజేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజయ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజా వ్యతిరేక విధానాలు



నవతెలంగాణ, బడంగ్ పేట్

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తరిమి కొట్టాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ స్టేడియంలో సోమవారం జరుగుతున్న నిరుద్యోగ భరోసా సభకు సోమవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి,పెద్దబావి వెంకట్ రెడ్డిల ఆధ్వర్యంలో వేలాది కాంగ్రెస్ నాయకులు, మహిళలు,అభిమానులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ చేపట్టారు. బాలాపూర్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి, అనంతరం బడంగ్ పేట్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బయలు దేరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే'

నవతెలంగాణ - హస్తినాపురం

తెలంగాణ రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెండి శశిధర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం తలపెట్టిన యువ సంఘర్షణ భారీ బహిరంగ సభకు డివిజన్ నుండి నిరుద్యోగులు, యువత అధికంగా తరలి వచ్చారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి తోనే బంగారు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. రాష్ట్రం లో రాజకీయ సమీకరణాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని శశిధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అల్వాల్ సర్కిల్ పరిధిలోని లోతుకుంట విజయ్ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్న ప్రసాద వితరణ గావించారు. ప్రతి సంకట హరి చతుర్థి నాడు అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కంటోన్మెంట్



కౌన్సిల్ సమావేశాన్ని వాక్ అవుట్ చేసిన అవినీతి అధికారుల మీద యాక్షన్ తీసుకోవాలని మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక నరేష్ డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర బీజేపీ కార్పొరేటర్లు నిరసన తెలిపి రాజ్యాంగం కల్పించిన లోకల్ బాడీ హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాన్ని, అధికారుల మీద ఒక వినతి పత్రం అంబేద్కర్ విగ్రహానికి ఇచ్చారు. కౌన్సిలింగ్ మీట్ కూడా మళ్లీ ఎప్పుడు పెడతారో డేట్ ఇవ్వమని పెట్టమని కూడా కార్పొరేటర్ దీపిక అధికారులను డిమాండ్ చేశారు.

జులై 9న సికింద్రాబాద్ ఆషాడ బోనాల ఉత్సవాలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్ ఆషాడ బోనాల ఉత్సవాలను జులై 9వ తేదీన నిర్వహించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మంత్రిని ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులను మంత్రి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితన ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తూ ఎంతో ఘనంగా నిర్వహిస్తూ వస్తుందన్నారు. ప్రతి ఏడాదీ గోల్కొండలో బోనాల ఉత్సవాలు ప్రారంభమై తర్వాత సికింద్రాబాద్ బోనాలు, ఆ తర్వాత ఓల్డ్ సిటీ బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ ఏడాది సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలు జులై 9వ తేదీన, 10న రంగం (భవిష్యవాణి) నిర్వహించనున్నట్టు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెప్పే బోనాలు, బతుకమ్మ వేడుకల విశిష్టతను రాష్ట్ర ప్రభుత్వం మరింత పెంచి విశ్వవ్యాప్తం చేసిందని చెప్పారు. అనేక దేశాల్లో ఎంతో ఘనంగా బోనాలు, బతుకమ్మ పండుగలను జరుపుకుంటారనీ, ఇది మనకెంతో గర్వకారణం అన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నగరం నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది హాజరై అమ్మవార్లను దర్శించుకుంటారని చెప్పారు. ఎన్ని లక్షల మంది వచ్చినప్పటికీ భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆలయ పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను రూ.కోట్లతో చేసినట్టు చెప్పారు. అమ్మవారి బోనాల మరుసటి రోజు వివిధ వేషధారణలు, డప్పు చప్పుళ్ళు, కళాకారుల నృత్యాలతో నిర్వహించే ఫలహారం బండ్ల ఊరేగింపు ఉత్సవాలకే ప్రత్యేక శోభను తీసుకొస్తాయని చెప్పారు. ఈ సంవత్సరం బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై త్వరలోనే అధికారులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. అధికారులు, పాలకమండలి సభ్యులు సమన్వయంతో వ్యవహరించి ఆలయ అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత మీ పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కృష్ణ, మనోహర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, కిరణ్మయి, గణేష్ టెంపుల్ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసాని ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు..



నవతెలంగాణ-బేగంపేట

మంత్రి తలసాని సనత్ నగర్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారని రామ్ గోపాల్ పేట కార్పొరేటర్ చీర సుచిత్ర, సీనియర్ బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పాన్ బజార్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు బీజేపీ కార్పొరేటర్‌ను దూరం పెడుతున్నారని తెలిపారు. నియోజవర్గంలో ముగ్గురు బీజేపీ కార్పొరేటర్లు ఉండగా ఓడిపోయిన కార్పొరేటర్లతో అభివృద్ధి శంకుస్థాన కార్యక్రమాలు చేపట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తానని పదేపదే చెప్పిన మంత్రి ఎన్నికల అనంతరం ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందన్నారు. ఇటీవల కలాసిగూడలో నాలాలో మృతి చెందిన మౌనిక ఘటన మంత్రి రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. నష్టపరిహారం అందించే సమయంలో స్థానిక కార్పొరేటర్‌ను వెంటబెట్టుకోకుండా ఓడిపోయిన కార్పొరేటర్‌ను తీసుకెళ్లి బాధితులకు నష్టపరిహారం అందించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మంత్రి ఇలాగే కొనసాగితే నియోజకవర్గం ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరపున తాను పోటీ చేస్తానని చీర శ్రీకాంత్ వెల్లడించారు. తమ పార్టీ అధిష్టానం ఎవరి కేటాయించిన బీజేపీ గెలుపుకు తన వంతు కృషి చేస్తానని చీర శ్రీకాంత్ తదితరులు తెలిపారు.

కురుమన్నకు డిప్యూటీ కమిషనర్ అభినందనలు



నవతెలంగాణ-నాచారం

జీహెచ్ఎంసీ, మున్సిపల్, పారిశుధ్య కార్మికుడు జి.కురుమన్న శ్రమ శక్తి అవార్డు అందుకున్న సందర్భంగా కాప్రా డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మిక సంఘం నాయకుడుగా కురుమన్న ఎన్నో సేవలను అందించారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా కృషి చేసినందుకు కార్మికపక్షపాతిగా శ్రమశక్తి అవార్డు అందుకోవడం సర్కిల్లోని పని చేస్తున్న కార్మిక వర్గానికి ఎంతో గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు పొంది కార్మికుల హక్కులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ లైసెన్స్ ఆఫీసర్ నర్సింగరావు, ఎస్ ఎస్ నాగరాజు పలువురు కురుమన్నను సన్మానించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-నాచారం



నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయనగర్ హెూరేబ్ చర్చిలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో రోడ్లను దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్తికేయ నగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 9,10 లో అంతర్గత రోడ్లు త్వరలోనే బీటీ నిర్మాణం చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, కార్తికేయనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అప్పర్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చి గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



వరద నీటి ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని 133 మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని ఫార్చ్యూన్ ఎంక్లేవ్ వద్ద నూతనంగా చేపట్టబోయే బాక్స్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో వరద నీటి ముంపు సమస్యలతో కాలనీల ప్రజలు నానా ఇబ్బం దులు పడుతున్నారనీ, ఇది గుర్తించి సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో మచ్చ బొల్లారం డివిజన్ ను అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఎన్ని సమస్యలు వచ్చినా, నిధులు మంజూరు చేయించి అన్ని కాలనీలు, బస్తీల్లో అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి భాస్కర్, మేనేజర్ మల్లికార్జున్, జీహెచ్ఎంసీ ఈ ఈ రాజు, ఏఈ రవళి, కాలనీవాసులు అబ్దుల్, సలాం, సత్య, మల్లేష్, కెఎస్ వర్మ, ఫాతిమా, పద్మ, చిత్ర, మాధవి, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రావణ్, శ్రీనివాస్ గౌడ్, రమేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, సతీష్ కుమార్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ విలీనం కోసం పోస్ట్ కార్డు ఉద్యమం

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని ముమ్మరం చేసింది. మూడు రోజులగా కంటోన్మెంట్ లో వార్డులు, బస్తీల వారీగా వికాసస్ మంచ్ పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని చేపడుతోంది. ప్రధానమంత్రి మోడీ పేరిట ఉత్తరాలను పంపిస్తున్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని ఆ పోస్ట్ కార్డులపై సారాంశం రాసి ప్రధానమంత్రి మోడీకి పంపిస్తున్నారు. సోమవారం అన్నానగర్‌లో యాదగిరి ముదిరాజ్, కనకయ్య, నరసింహ, మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం అబేల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, ఎలగంటి ప్రభు గుప్తా, మహమ్మద్ ఫసి, ఇటుక గోపి, అరుణ్ యాదవ్, కృష్ణ ముదిరాజ్, ప్రవీణ్, హేమలత, మహేష్, చింతకాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి, ప్రాచీన భరత నాట్య కళల ప్రదర్శన



నవతెలంగాణ-బేగంపేట్

ప్రాచీన నాట్య కళలను కాపాడుతూ ప్రపంచానికి ప్రాచీన కళల ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకు కృషి చేస్తున్నట్టు విందావన్ నాట్యోత్సవ మండలి నిర్వాహకురాలు మీరా శేషాద్రి నాథన్ తెలిపారు. బేగంపేట్‌లో ఎయిర్ లైన్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వ్రిందావన్ నాట్యోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు కుమారి మానశ్రీ నిర్మల్, నందిత సిద్ధంశెట్టి, సతాధి రాయ్, ఎస్.వియశి, తాన్వి కన్నన్ అద్భుతమైన భరత నాట్యకల ప్రదర్శన అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరత నాట్యం గురించి పిల్లల్లో యువతలో ఆసక్తి పెంచుతూ వాళ్ళలో అవగాహన కల్పించేందుకు వ్రిందావన్ నాత్యోత్సవ్ ఆధ్వర్యంలో కూచిపూడి, ప్రాచీన భరత నాట్య కళలను ప్రదర్శన చేసినట్టు పేర్కొన్నారు. పాశ్చాత్య సంస్కృతి విస్తతంగా పెరగడం మూలంగా కూచిపూడి, భరత నాట్య కళలు కనుమరుగవుతున్నాయనీ, నాట్య కళలను, ప్రాచీన కళలను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన ప్రముఖ నటి, కళాకారిణి అపర్ణ సుందరం, శివ పంచాక్షరీ స్తుతి, తోడి వరణం, నెత్రాంది నేరతిల్, వంటి వివిధ నాట్య కళా రూపాలను ప్రదర్శించారు. ప్రాచీన కళాఖండాలు, నాట్య కళా రూపాల వల్ల భక్తి భావం అలవడుతుందన్నారు. విద్యార్థుల్లో యువతలో క్లాసి కల్ డాన్స్, భరతనాట్యం గురించి మరింత అవగాహన కల్పించి వారిలో ఆసక్తిను నింపి ప్రతిభ కనబరిచే విధంగా కృషి చేసేందుకు పాటుపడుతున్నట్టు తెలిపారు.

నిరాధారమైన ఆరోపణలు తగదు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అల్వాల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదనీ, ఇలాంటి వాటిల్లో నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అక్రమ కట్టడాల్లో కార్పొరేటర్‌ల ప్రమేయం ఉదంటూ ఓ పత్రికలో వచ్చిన నిరాధార ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణమలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ప్రజా జీవితంలో తాము అభివృద్ధిని కాంక్షిస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్‌ల పేరుతో ఎవరైనా ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, వాటిని తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. పత్రికా సోదరులు ఇలాంటి నిరాధార ఆరోపణలతో వార్తలు రాసే ముందుగా తమ వివరణ అడగి వార్త రాస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. అలా కాదని ప్రజా జీవితంలో ఉన్న తమపై ఏకపక్షంగా నిరాధారమైన ఆరోపణలు, చేయడం ఏమాత్రం సరి కాదన్నారు.

నేడు బేగంపేట డివిజన్‌లో శ్మశాన వాటిక ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట్ డివిజన్‌లోని తాతాచారి కాలనీకి సమీపంలో ఉన్న ధనియాలగుట్ట శ్మశాక వాటికను మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఆయనతో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొననున్నారు. సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ పోలీసులు బేగంపేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, సురేశీయాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో అక్కడ తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తలు, బందోబస్త్ కోసం ఇన్స్పెక్టర్ శ్రీనివాసయాదవ్ ఎస్ఐలకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, డివిజన్ అధ్యక్షుడు సురేశీయాదవ్ మాట్లాడుతూ బేగంపేట్ డివిజన్‌లో పార్టీలకు అతీతంగా శ్మశాన వాటిక కోసం దశాబ్దాల కాలంగా పోరాడామని తెలిపారు. కానీ గత పాలకులు తమ ఇబ్బందులను పట్టించుకోలేదని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తమ ఇబ్బందులను అర్థం చేసుకుని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరిగౌడ్, నరేష్, సి.సత్యనారాయణ, మహ్మద్ అఖిల్ హమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

యువ సంఘర్షణ సభకు తరలిన నాయకులు

నవతెలంగాణ-కాప్రా



సరూర్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ యువ సంఘర్షణ సభకు మేడ్చల్ జిల్లా ఎస్సీవిభాగం చైర్మన్ పత్తి కుమార్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పత్తి కుమార్ మాట్లాడుతూ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. తెలంగాణలో పేద ప్రజల కోసం కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ హర్షం అశోక్, సందీప్ గౌడ్, రామలింగం, సింగం కిరణ్ సాయి నాగరాజు నవీన్ రాజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బస్ పాస్‌ల పంపిణీ

నవతెలంగాణ-మల్కాజిగిరి



జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద సోమ వారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.వినయ్ ఆధ్వర్యంలో వికలాంగులకు రాయితీ పాసులు పంపిణీ చేశారు. ఇందులో ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారికి 50 మందికి పాసులను అందజేశారు. కొత్త వారివి 50 మంది దరఖాస్తు ఫామ్స్ ఇచ్చారు. వికలాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులను మన వద్దకే పిలిపించి బసుపాసులు ఇప్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రజనీకాంత్, ఉదయ్ కుమార్, శ్రీనివాస్, పలువురు వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాప్రా



అమీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాగ మల్లేష్ అనారోగ్యంతో చనిపోయాడు. మృతుడి కుటుంబానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎవరికి ఏ కష్టం వచ్చినా బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మధు గౌడ్, సీనియర్ నాయకురాలు మంజుల, దూసరి నవీన్ గౌడ్, కుమార్, టిల్లు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ సమావేశానికి ప్రియాంక గాంధీ హాజరు కానుండటంతో మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాగారం మున్సిపాలిటీ నుంచి కార్యకర్తలు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గండి ఓం ప్రకాష్ గౌడ్, మనిగౌడ్, సాయి గౌడ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాప్రా



కాప్రా డివిజన్ వంపుగూడ కాలనీకి చెందిన యువకుడు లింగాల సుధాకర్ గుండె పోటుతో మృతి చెందడంతో వారి కుటుంబానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం ట్రస్ట్ ప్రతినిధి భైరి నవీన్ గౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తి కుమార్, కాశీనాద్, సలీం, కిరణ్ గౌడ్, సతీష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ సుభాష్ నగర్ ప్రధాన రహదారి పై ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్‌కు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడతాయి అని సుభాష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, నరసింహారెడ్డి ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మల్టీ స్టోర్ బిల్డింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా హాస్పిటల్ ఏర్పాటు చేస్తున్నారనీ, మున్సిపల్ అధికారులకు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. హాస్పిటల్ వ్యర్థాల వల్ల కాలనీ వాసులకు ఇబ్బంది ఉంటుందనీ, ప్రమాదకరంగా, అసౌకర్యంగా ఉన్న భవనంలో ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు దాసరి కృష్ణారెడ్డి, సందీప్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, గోపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. హాస్పిటల్‌కు పార్కింగ్ సౌకర్యం ఉంది : యజమాని కార్తీక్

సుభాష్ నగర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్‌కు 600 గజాల స్థలంలో పార్కింగ్ సౌకర్యం ఉందని భవన యజమాని అన్మోల్ కార్తీక్ తెలిపారు. హాస్పిటల్ భవనం 550 గజాలు ఉండగా కేవలం పార్కింగ్ కోసం 600 గజాల స్థలాన్ని లీజుకు తీసుకున్నామని వివరించారు. సుభాష్ నగర్ కాలనీ వాళ్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి చర్యలు తీసుకుంటామనీ, 24 గంటలు సెక్యూరిటీ పార్కింగ్‌ను చూసుకుంటారనీ, హాస్పిటల్ వ్యర్థాలకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేశామన్నారు. స్థానికులకు, చుట్టుపక్కల గ్రామాల వారికి అందుబాటులో ఉండాలని లక్ష్యంతో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కాలనీ వాసులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సూచనల మేరకు వ్యవహరిస్తామని తెలిపారు.



నవతెలంగాణ-కాప్రా

వ్యాపార రంగంలోకి 'హాకా'

● హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశవ్యాప్తంగా వ్యాపారంలోకి ప్రవేశించాలనే ముఖ్య ఉద్దేశంతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా ముందుకు వెళు తున్నట్టు హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా) చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హెూటల్‌లో హాకా జనరల్ బాడీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులు విత్తనాలతో పాటు ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్టేషనరీ, ఏసీలు, ఫ్యాన్లు, జిరాక్స్ మెషీన్లు, ప్రింటర్లు, సెల్ ఫోన్లు, టేబుళ్లు, కుర్చీలు వివిధ రకాల వస్తువులను అందించేందుకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుని, సరఫరా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కోట్లలో ఉన్న టర్నోవర్ వందల కోట్ల రూపాయలకు విస్తరించడమే హాకా ముఖ్య ఉద్దేశం అన్నారు.

'చట్టాలపై బాలికలకు అవగాహన అవసరం'



నవతెలంగాణ - సుల్తాన్‌బజార్

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సివిల్ జడ్జ్ రాధిక జైస్వాల్ అన్నారు. ఆశ్రిత రెయిన్ బోలో పిల్లలకు చట్టాలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు క్రమ శిక్షణ కలిగి, బాగా చదువుకొని బంగారు భవిష్యత్తుకోసం బాటలు వేసుకోవాలని అన్నారు. బాలికలు చట్టాలను గురించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాలికలు తమ హక్కులు తెల్సుకోవాలన్నారు. పిల్లలు బయట సమాజంలో పరిస్థితులు బాగా లేనందున మనో నిబ్బరం కలిగి ధైర్యంగా ఎదగాలని సూచించారు. కేరింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్టు కో ఆర్డినేటర్ అబ్దుల్ వాసిక్ మాట్లాడుతూ.. న్యాయ పరమైన సహకారం అన్ని వేళలా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రిత కమ్యూనిటీ కేర్ కో -ఆర్డినేటర్ వి. పర్వతాలు, పారా లీగల్ వాల ంటీర్స్, మజీద్ వుదిన్, షహీద్ అలి, మహ్మద్ వాజిద్ ప్యానెల్ అడ్వకేట్, ఆశ్రిత సిబ్బంది రామస్వామి, నాగమణి, చిన్నారులు పాల్గొన్నారు.

వృద్ధులు, ఎన్‌ఆర్‌ఐలే టార్గెట్

● కస్టమర్లకు తెలియకుండానే క్లైమ్స్ కొట్టేస్తున్న ఘరానా ముఠా

● కోట్లల్లో మోసం చేసినట్టు గుర్తింపు

● ఆరుగురిని అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీమా పాలసీలు తీసుకున్న ఎన్‌ఆర్‌ఐలు, వృద్ధులతో పాటు పాత కస్టమర్లను టార్గెట్ చేసుకుని వారికి తెలియకుండానే క్లైమ్ డబ్బులను కాజేస్తున్న ఆరుగురు నిందితులను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.22 లక్షల విలువగల బంగారు ఆభరణాలు, రివాల్వర్, మూడు కార్లు, 13 చెక్‌బుక్‌లు, రూ.6 లక్షల నగదుతో పాటు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నేరేట్‌మెట్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ తెలిపిన వివరాల మేరకు నిజామాబాద్‌కు చెందిన కే.రంగసాయి హరీష్, డీ.అక్షయ కుమార్, మొహ్మద్ యాసీన్ హైమద్, మాన్యం ప్రశాంత్, ఖమ్మంకు చెందిన వీ.అచ్యుత్, బుద్వేల్‌కు చెందిన ఏ.ప్రకాష్ రెడ్డిలు ఒక ముఠాగా ఏర్పాడ్డారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన రంగసాయి హరీష్ ప్రముఖ బీమా సంస్థలో పనిచేశాడు. కొందరు పాలసీదారులు మృతి చెందినా వారికి సంబంధించిన వ్యక్తులుగానీ, నామినీలు గానీ పాలసీ క్లైమ్ చేసేందుకు రావడం లేదన్న విషయాన్ని గుర్తించాడు. అంతేకాకుండా ఎన్‌ఆర్‌ఐ, వృద్ధులు సైతం క్లైమ్ చేయడం లేదన్న గమనించాడు. అలాంటి వారి డేటాను సదురు బీమా సంస్థ నుంచి సేకరించాడు. బీమా కాలపరిమితి తీరిన తర్వాత కస్టమర్ పేరుతో వచ్చే క్లైమ్ డబ్బులను కాజేస్తే ఎవరికీ అనుమానం రాదని, సులువుగా డబ్బులు సంపాదించొచ్చని ముఠా సభ్యులకు వివరించాడు. పథకం ప్రకారం బీమా తీసుకున్న వారిపేరుతోవున్న ప్యాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, సెల్‌నెంబర్లు మార్చి అదే పేరుతో బ్యాంక్ అకౌంట్లు తీసుకునే వారు. ఆ వివరాలతో సంస్థకు మేయిల్ చేస్తున్నారు. మార్చిన వివరాలతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నారు.

ఇదే తరహాలో దాదాపు నాలుగు కోట్ల విలువగల పాలసీలను కాజేశారు. అయితే కొద్ది రోజుల క్రితం ఓ పాలసీదారుడు తన పాలసీ గడువు తీరడంతో క్లైమ్ కోసం సదురు బీమా సంస్థను సంప్రదించాడు. అయితే ఆ డబ్బులు తీసుకున్నట్టు సమాధానం రావడంతో అనుమానం వచ్చి రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠా సభ్యులు 2019 నుంచి ఇదే తరహాలో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితులపై 19కేసులున్నాయన్నారు. బీమా తీసుకున్న కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలని సీపీ తెలిపారు. ఎప్పటికప్పుడు మేయిల్స్, బ్యాంక్ అకౌంట్లు చెక్‌చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అనురాధా, ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ జే.నరేందర్ గౌడ్, ఎస్‌ఐ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం అంతా అబద్ధం

● ఆమ్ ఆద్మీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు

డాక్టర్ దిడ్డి సుధాకర్



నవ తెలంగాణ-అడిక్‌మెట్

ఢిల్లీ మద్యం కుంభకోణం అంతా అబద్ధమని తేలిపోయిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. లంచం లేదా కిక్‌బ్యాక్ కోసం ఏదైనా నగదు చెల్లింపునకు సంబంధించిన ఎలాంటి సాక్ష్యాలను ఢిల్లీ రూస్ అవెన్యూ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చూపలేకపోయిందని, దీనిని బట్టి మద్యం కుంభకోణం అంతా అబద్ధమని తేలిపోయిందన్నారు. దోమల్‌గూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజేష్ జోషి గౌతమ్ మల్హోత్రాలకు రూస్ అవెన్యూ కోర్టు బెయిల్ ఇచ్చిన తర్వాత కోర్టులు కూడా ఈ స్కామ్ కల్పితమనే భావనను ప్రతిధ్వనించడం ప్రారంభించాయని పేర్కొన్నారు. బడా బంధిపోట్లయిన నీరవ్ మోదీ, లలిత్ మోదీ, మెహుల్ చౌక్సీ ప్రజా ధనాన్ని దోచుకుని విదేశాలకు పారిపోయారని, అలాంటి వ్యక్తులపై నరేంద్ర మోదీ నేతత్వంలోని ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి కేసులు పెట్టి జైళ్లకు పంపదని, కేవలం బీజేపీ ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించే ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని అయన మండిపడ్డారు. ఆప్ నేతలపై బీజేపీ వేధింపులు, ప్రతీకార రాజకీయాలు ఆపకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలే చావుదెబ్బ కొడుతారని హెచ్చరించారు. భూక్యా శోభన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆప్ ఎదుగుదలను చూసి బీజేపీ ఓర్వలేక ఆప్ నేతలపై నిస్సంకోచంగా ప్రతీకార చర్యలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేని బూటకపు కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని, సాక్ష్యాలు లేవని కోర్టులు విడుదలకు బెయిల్‌లు మంజూరు చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థలకు సిగ్గు రావడం లేదని చెప్పారు. మద్యం కుంభకోణం కల్పితమని, ఆప్ నేత మనీష్ సిసోడియాకు త్వరలో బెయిల్ లభిస్తుందని తెలిపారు. మరో నేత బుర్ర రాము గౌడ్ మాట్లాడుతూ... ప్రతిపక్ష పార్టీలను బిజెపి లక్ష్యంగా చేసుకోవడానికి ఈడీ, సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించుకుంటుందని, బీజేపీ ప్రతీకార రాజకీయాలు ప్రజాస్వామ్యంపై దాడులని, దీనిని ఆప్ తిప్పికొడుతుందని హెచ్చరించారు. ద్రవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి దేశవ్యాప్తంగా ఆప్ తన స్వరాన్ని పెంచుతూనే ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో భూక్యా శోభన్, తదితర నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో నాయినిది ప్రత్యేక పాత్ర

● క్రీడా రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన ప్రభుత్వం

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

● ముగిసిన నాయిని మెమోరియల్ షటిల్ టోర్నమెంట్-2 పోటీలు



నవతెలంగాణ-ముషీరాబాద్

క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధుల కేటాయించి క్రీడాకారులను అంతర్జాతీయస్థాయి క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. వాయిని నర్సింహారెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ షటిల్ టోర్నమెంట్ - 2 పోటీల ముగింపు కార్యక్రమం ముషీరాబాద్ డివిజన్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి సీనియర్ పటిల్ క్రీడాకారుడు బొల్లం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, గౌరవ అతిథిగా ఏషియా ఇంటర్నేషనల్ హ్యాండ్లూమ్ అంబాసిడర్ రష్మీఠాకూర్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు, నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు నాయిని దేవేందర్రెడ్డి, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ శ్రీలతలు హజరయ్యారు. షటిల్ పోటీలో 50 సంవత్సరాలు దాటిన విజేతలు సోమేశ్వర్. ఎనో నివాస్, రన్నర్స్ సి.హెచ్.వీరారెడ్డి, బొల్లం శ్రీనివాస్, జనరల్ క్యాటగిరిలో విజేతలు రాహుల్ రాజకుమార్, రన్నర్స్, చిరంజీవి, షహన్నా, బాలికల పోటీలో విజేతలుగా హార మధ్య రాగిణి, మేరి పద్మశ్రీ, రన్నర్స్ దేదీప్య, ప్రదీప్యలకు అతిథులు మెమొంటోలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక సహాయం కల్పించేందుకు కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, బుజ్జి వెంకటేశ్వరరావు, వన్న ప్రవీణ్, హస గోరవ్‌నాథ్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, అనిల్, అమరం వినోద్, ముచ్చకూర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, సిద్దిఖి, క్రీడాకారులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 4న లింగాయత్ మహాసభ



నవతెలంగాణ-బంజారాహిల్స్

లింగాయత్‌ల సమస్యల సాధనకై జూన్ 4న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లింగాయత్ మహాసభ నిర్వహిస్తున్నా మని లింగాయత్ సమన్వయ సమితి తెలిపింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సమితి ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి నేతలు ఈశ్వరప్ప, సంగమేశ్వరప్ప మాట్లాడుతూ... 40 లక్షల జనాభా కలిగిన లింగాయత్‌లకు అన్ని రంగాలలో సమాన వాటా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దాదాపుగా 42 అసెంబ్లీ, 5 పార్లమెంట్ స్థానాలలో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తున్న లింగాయత్‌లకు అన్ని రాజకీయ నాయకులు సముచిత స్థానాలను కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలని, అలాగే నూతన పార్లమెంట్ భవనానికి "అనుభవ మటమని" నామకరణం చేయాలన్నారు. బసవేశ్వరుని బోధనలను కేజీ నుండి పీజీ వరకు పాఠ్యాంశాల్లో చేర్చే విధంగా వచన సాహిత్యాన్ని ప్రచురించాలని కోరారు. మహానుభావుడైన బసవేశ్వరుని విగ్రహాన్ని అసెంబ్లీ ముందు ప్రతిష్టించాలని, హైదరాబాద్ నగరంలో 150 అడుగుల బసవేశ్వరుని విగ్రహ నిర్మాణం చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 10వేల కోట్ల బడ్జెట్‌తో లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 80% మార్జిన్ మనీతో రుణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లింగాయత్ మహాసభలో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుండి లింగాయత్‌లు అధిక సంఖ్యలో పాల్గొననున్నారని తెలిపారు.

స్టిచ్చింగ్ చార్జీలను పెంచాలి..

● తెలంగాణ టైలర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి



నవ తెలంగాణ-బంజారా హిల్స్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించనున్న యూనిఫామ్ స్టిచ్చింగ్ చార్జీలను పెంచాలని తెలంగాణ టైలర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టైలర్లు వరలక్ష్మి, అర్చన, వెంకటేశ్‌లు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం యూనిఫామ్‌కు 50 రూపాయలు మాత్రమే చెల్లిస్తుందని.. ఇది ఎంత మాత్రం తమకు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో యూనిఫామ్ సాధారణంగా ఉండేదని, ప్రస్తుతం మరింత ఫ్యాషన్‌గా కుట్టాలని చెప్పడంతో తమకు పని కూడా పెరిగిందని అన్నారు. పెరిగిన మెటీరియల్ ధరలు ఓ వైపు ప్రభుత్వం సూచించిన విధంగా కుట్టాల్సిన రావడంతో తాము కనీస కూలీని కూడా పొందలేకపోతున్నామని అన్నారు. ప్రభుత్వం మాత్రం 50 రూపాయల కంటే ఒక్క రూపాయి కూడా పెంచమని చెబుతుందని అన్నారు. క్లాత్‌ను సకాలంలో సప్లై చేయని ప్రభుత్వం పని మాత్రం పాఠశాలలు తెరిచే లోపు చేయాలని ఒత్తిడి చేస్తుందని చెప్పారు. ఈ విషయంపై తాము పలుమార్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఇబ్బందులు గమనించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక నెల రోజుల క్రితం బట్టలను పంపితే కుట్టి ఇవ్వటానికి సులువుగా ఉండేదని, కానీ ఇప్పుడు 15 రోజుల్లో బట్టలు ఇవ్వాలని ఆదేశిస్తే తాము పనులను ఏ విధంగా పూర్తి చేస్తామని, తమ కష్టాన్ని గుర్తు ఉంచుకొని తమపై దయ తలచాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 60 వేల డ్రెస్సులను సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, వెంకటేష్, నిరంజన్, శ్రీనివాస్, ఎండీ ఆసిఫ్, అర్చన, స్వర్ణలత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులేషన్ చేయాలి

● కార్యదర్శులతో చర్చలు జరపాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

11 రోజులుగా సమ్మె చేస్తున్న 9,355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను చర్చలకు పిలిపించి డిమాండ్లను పరిష్కరించి, సమ్మె విరమింపజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి కేసీఆర్‌కి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాచిగూడ అభినందన్ హెూటల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు న్యాయమైనవి అన్నారు. వీరిని ఉద్యోగంలోకి తీసుకున్నప్పుడు మూడేండ్లలో రెగ్యులరైజ్ చేస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు కానీ తర్వాత జీఓ 26 ద్వారా మరో ఏడాది పొడిగించినట్టు తెలిపారు. జీవో 26 ప్రకారం నాలుగేండ్లు గడిచినా రెగ్యులర్ చేయకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లినట్టు తెలిపారు. వీరిని న్యాయమైన డిమాండ్లకు ప్రజా సంఘాలు, బీసీ/ఎస్సీ/ఎస్టీ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, అధికార పార్టీలు శాసనసభ్యులు పూర్తి మద్దతు ప్రకటించారు. కానీ ఇంతవరకు ప్రభుత్వం తగురీతిలో స్పందించకపోవడం న్యాయం కాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమాల ద్వారానే గొప్ప జాతీయ నాయకుడిగా గుర్తింపు పొందారనీ, ఉద్యమాలు చేసి తెలంగాణను తెచ్చారనీ, ఉద్యమాలను గౌరవించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతిష్టకు పోకుండా చిరు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ చేయాలంటూ రెండేండ్లు అధికారులు, మంత్రుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. మూడేండ్ల ప్రొహిబిషన్ పీరియడ్ నిబంధనతో రూ.15వేల జీతంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించుకుని, మూడేండ్ల తర్వాత గ్రేడ్-4 ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌లోనే పేర్కొన్నదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా వెంటనే ప్రమోట్ చేసి వీరిని కూడా రెగ్యులర్ చేయాలనీ, చనిపోయిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు రూ.20 లక్షల నష్ట పరిహారం చెల్లిస్తూ కారుణ్య నియామక ప్రక్రియ చేపట్టి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీల వెంకటేష్, రాఘవ జోషి, వేముల రామకృష్ణ, పగిడాల సుధాకర్, జి.అనంతయ్య, హరీష్, నికిల్, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలను వీడాలి


● క్రీడల్లో రాణించాలి : వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్



నవతెలంగాణ-అడిక్‌మెట్

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్యతో పాటు క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్, అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్, తెలంగాణ బెవరేజెస్ చైర్మన్ గజ్జల నగేష్ పిలుపునిచ్చారు. మాజీ హెూం మంత్రి నాయిని నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం ఎన్ఎస్ఆర్ మోరియల్ క్రికెట్ పోటీలను ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం మూడవ రోజు వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్, అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్, తెలంగాణ బెవరేజెస్ చైర్మన్ గజ్జల నగేష్‌లు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తు పానియాలకు బానిసలు కాకుండా క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నగర నాయకులు కల్వగోపి, బల్లెకారి రమేష్ నేత, శ్రీనివాస్, రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, నాయకులు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలివెళ్ళిన తెలుగు తమ్ముళ్ళు



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు సోమవారం ఖైరతాబాద్‌లో జరిగింది. ఈ మినీ మహానాడుకు సికింద్రాబాద్ పార్టీ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో బౌద్ధ నగర్‌లో ఆయన నివాసం నుంచి కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో నగరంలో, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు. పార్టీకి పూర్వ వైభవం దిశగా కార్యకర్తలు, నేతలు సమిష్టిగా కషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

● పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

● మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్




నవతెలంగాణ-బంజారాహిల్స్

నేటి బాలలే రేపటి పౌరులని, రెటినోబ్లాస్టోమా (కంటి కాన్సర్)తో బాధపడుతున్న పిల్లల పట్ల సమాజంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో వైటథాన్ రన్ టీ-షర్ట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిధుల సేకరణ కోసం ఎల్వీపీఈఐ ఒక మంచి లక్ష్యంతో ఈ నెల 21న రన్ - వైటథాన్ 5వ ఎడిషన్ నిర్వహిస్తోందన్నారు. రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్ సాధారణంగా 90 శాతం వరకు 3 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. పిల్లల్లో ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కంటి క్యాన్సర్ కేసుల్లో 20 నుండి 25 శాతం వరకు భారతదేశానికి చెందినవే కావడం ఆందోళనకరమైన విషయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా 50 శాతం కేసులను ఆలస్యంగా గుర్తించడం, సరైన చికిత్స అందని కారణంగా పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రెటినోబ్లాస్టోమా క్యాన్సర్ కణితిని ముందుగానే గుర్తించి, చికిత్స చేస్తే, పిల్లల ప్రాణంతో పాటు వారి కంటి చూపును కూడా కాపాడవచ్చని సూచించారు. రన్‌లో 10కె (టైమ్డ్ రన్), 5కె (టైమ్డ్ రన్), 5కె (ఫన్ రన్), 3కె (ఫన్ రన్) అనే నాలుగు విభాగాలు ఉన్నాయి. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మద్దతు ఇస్తున్న ఎన్ఎమ్‌డీసీ హైదరాబాద్ మారథాన్ 2023కు వైటాథాన్ ఒక క్వాలిఫైయర్ రన్‌గా ఉండనున్నది. 2018లో వైటథాన్ ప్రారంభించబడిందని సంస్థ ఆపరేషన్ ఐసైట్ యూని వర్సల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఐ క్యాన్సర్ అధిపతి, ఆక్యులర్ ఆంకాలజిస్ట్, డాక్టర్ స్వాతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు, ఫౌండర్-చైర్ పర్సన్ ప్రతిభా రావు, బోర్డు సభ్యులు డాక్టర్ రాజీవ్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ మెర్లే ఫెర్నాండెజ్, డైరెక్టర్, కల్లం అంజి రెడ్డి రైతుల బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలు బోధించేదే ఉత్తమ సాహిత్యం

● ఆచార్య అనుమాండ్ల భూమయ్య



నవతెలంగాణ-ధూల్‌పేట్

మానవీయ విలువలు బోధించేదే ఉత్తమ సాహిత్యమని ప్రముఖ సాహితీ వేత్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'మకర హృదయం' కావ్యం అవగాహనా సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కవి బలహీనుల పక్షాన నిలబడి వారి మూగ వేదనకు అక్షరూపం ఇవ్వాలన్నారు. కండబలం కంటే ధర్మబలమే అన్ని విధాలా గొప్పదన్నారు. మహా భాగవతంలో పోతన, గజరాజు మొరను గజేంద్ర మోక్షంగా రాస్తే, పోతన స్ఫూర్తితో తాను మొసలి ఆవేదనను మకర హృదయం కావ్యంగా రాశానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ సోయితో బడుగు జనుల చైతన్య స్ఫూర్తితో సమకాలీన దృక్పథంతో మకర హృదయం కావ్యాన్ని రాశానని విశ్లేషించారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు తనకు పాఠాలు బోధించిన ఉద్దండ కవి పండితుల ప్రేరణతో మహాకవుల కావ్య అధ్యయన శక్తితో తాను అనేక పద్య కావ్యాలను గేయ కావ్యాలను వెలువరించానని తెలిపారు. భాషా సాహిత్యాల అధ్యయనం వల్ల విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణిస్తారని తెలిపారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు, మూసీ పత్రిక సంపాదకులు, ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ గుణ సౌందర్యమే ఉన్నతమైన సౌందర్యమన్నారు. అధ్యాపకులు తమ బోధనతో విద్యార్థుల్లో సుగుణ సంపదను పెంపొందింపజేయాల్సిన అవసరముందన్నారు. మకర హృదయం కావ్యంలో ఉదాత్తమైన మానవీయ దృష్టితో పాటు జీవకారుణ్య స్పృహ కూడా ఉందన్నారు. పోతన సాహిత్య తత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకుని, ఆధునిక ఉద్యమాల స్ఫూర్తితో అనుమాండ్ల భూమయ్య మకర హృదయం కావ్యాన్ని రచించారని తెలిపారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తాజా పాఠ్యప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ పాఠ్యాంశంలోని సమున్నత విలువలను అందిపుచ్చుకుని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పాఠ్యభాగ రచయిత అనుమాండ్ల భూమయ్య జవాబులు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్. కోయి కోటేశ్వరరావు, డాక్టర్.జె.నీరజ, అవధానం సుజాత, కేథరీనా, అజ్మీరా సుజాత, డాక్టర్.కమల సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

రూ.8.54కోట్లతో శ్మశాన వాటిక

● నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మానవుల చివరి మజిలీలో పాల్గొన్న వారికి, బంధువులకు సకల సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో మోడల్ శ్మశాన వాటికలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్మిస్తోంది. ఈ క్రమంలో బేగంపేట్ శ్యామ్ లాల్ బిల్డింగ్ వద్ద రూ.8 కోట్ల 54 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన శ్మశాన వాటికలను రాష్ట్ర మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా శ్మశానవాటికలో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణం, సెరిమోనియల్ హాల్, చెక్క నిల్వ గదితోపాటు పిండ ప్రదానం చేసే ప్రాంతం అభివృద్ధి చేశారు. వెయిటింగ్ హాల్, బాడీ ప్లాట్‌ఫారమ్‌లు, ఫీచర్ గోడలు, ప్రవేశం, నిష్క్రమణకు తోరణాలు, ఫలహారశాల, నీటి వసతితో సహా టాయిలెట్ బ్లాక్‌ల ఏర్పాటు చేశారు. పాత్ వేస్ అభివృద్ధి, పార్కింగ్ ప్రాంతం అభివృద్ధి, వైఫై సౌకర్యం, సీ.ఎస్.ఆర్ పద్దతిన శివుని విగ్రహంతోపాటు రెండు అంతిమ యాత్ర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలతో నిర్మించారు.

భిన్న సంస్కృతుల నిలయం హైదరాబాద్

● డిప్యూటీ స్పీకర్ పద్మారావు

● ఓయూలో ఘనంగా ఈద్ మిలాప్..



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర తర్వాత సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్ర పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని డిప్యూటీ స్పీకర్ తిగుళ్ళ పద్మారావు అన్నారు. సోమవారం సాయంత్రం ఉస్మానియా విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ హెూమ్‌లో మూడు బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఈద్ మిలాప్" కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఓయూ ఉద్యోగులు గత కొన్ని సంవత్సరాలుగా ఈద్ మిలాప్‌ను ఘనంగా నిర్వహించడం వారి మత సామరస్యానికి గొప్ప ఉదాహరణ అన్నారు. రాష్ట్ర ఏర్పాటులో ఓయూ విద్యార్థుల, ఉద్యోగుల కషిని ప్రశంశించారు. ఓయూ ఉద్యోగ సంఘాల ప్రతిని ధులు వివిధ అంశాలపై ప్రసంగించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వీసీ దష్టికి తీసుకువెళ్లారు. వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల కషి, చొరవను ప్రశంశించారు. తాము చేస్తున్న అభివద్ధిలో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పప్పుల లక్ష్మీ నారాయణ, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, డా.సయ్యద్ ఉన్నిసా బేగం, టీఎస్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు యం.రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రావు, ఓయూ ఎన్‌జీఓ ఎస్ అధ్యక్షుడు బియాని జ్ఞానేశ్వర్, రవి, కె.ఎస్.నాగరాజ రావు, ఎస్.విజయ్ కుమార్, టి.శివ శంకర్, అక్బర్ బేగ్‌తో పాటుగా భారీగా ఓయూ టైమ్ స్కెల్, కాంట్రాక్టు, పార్ట్ టైమ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఫిరాసత్ అలీ బాక్రీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

కర్ణాటక ఎన్నికల సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో సోమవారం సమావేశ మయ్యారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బెంగళూరులో మద్దతుదారులను ఉర్రూతలూగించి రోడ్ షోను ఉత్సాహపరిచారని, కర్ణాటకలో పూర్తి మెజారిటీ వస్తుందని చర్చించామని బాక్రీ తెలిపారు.

సంఘర్షణ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

హైదరాబాద్ సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పీసీసీ డెలిగేట్ మెంబర్ గొట్టిముక్కల వెంగల్ రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నుండి భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వెంగల్ రావు మాట్లాడుతూ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ నిరుద్యోగి వేదనను తీర్చేందుకు, యువ సంఘర్షణ సభ నిర్వహించారని అన్నారు.

స్మశానవాటిక పనుల పరిశీలన



నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంశిగుడా స్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శంశిగుడా స్మశానవాటికలో ఇప్పటికే ప్రహరీగోడ నిర్మాణం పూర్తయిందని, మరుగుదొడ్లు, స్నానాల గదులు, పూజగది వంటివి నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. బండ రాళ్లను తొలగింపు పనులను నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట భాస్కర్, వెంకట్ నాయక్, కసాని శంకర్, వై.శ్రీను, యాదయ్య, సత్తయ్య, మల్లేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం

• కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ - మేడ్చల్

రైతుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పూడూరు గ్రామంలో రైతు వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ సుధాకర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ వరి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు చేసిన గంటల వ్యవధిలోనే ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. రైతులెవ్వరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నర్సింహా రెడ్డి, సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నందా రెడ్డి, సర్పంచ్ బాబు యాదవ్, ఎంపీటీసీ రఘు, సీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్‌రెడ్డి, నాయకుడు ఆర్.మల్లారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వ్యవసాయ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్ :

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి శామీర్‌పేట మండలంలోని అలియబాద్,



మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం, ఉద్దేమర్రి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నందా రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్ వాణి, ఎంపీటీసీలు, సర్పంచులు జ్యోతి బలరాం గౌడ్, అనురాధ రవీందర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు మల్లేష్ గౌడ్, విష్ణు గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల ఐక్యత కోసమే ఆట, పాటల పోటీలు'

నవతెలంగాణ - దుండిగల్

కార్మికుల ఐక్యత కోసమే మే డే వారోత్సవాల్లో ఆట, పాటల పోటీలను నిర్వహించినట్టు కామ్రేడ్ బీఎన్ సుదర్శన్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాలను జిల్లా కమిటీ నాయకుడు ఎమ్.చంద్రశేఖర్ అధ్యక్షతన బాచుపల్లి ఎస్సీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీఐటీయూ సీనియర్ నాయకుడు, నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ బి.వెంకటరామయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ పి.బాలపీర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ముందుగా అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ పెద్ద ఎత్తున కార్మికులు డప్పు చప్పుళ్ళతో నృత్యాలతో అలరించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు నిత్యం ఆట, పాటల పోటీలు నిర్వహించారు. సోమవారం మే డే వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో క్రీడల్లో గెలుపొందిన వారికి కామ్రేడ్ సుదర్శన్, కార్పొరేటర్ బి.వెంకటరామయ్య బహుమతులు అందజేశారు. అనంతరం ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కుల, లింగ వివక్ష కొనసాగినంత కాలం సమాజం అభివృద్ధి చెందదన్నారు. కార్మికుల ఐక్యత కోసం లింగ అసమానతలకు వ్యతిరేకంగా అలాగే కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడే దానికోసం ఈ వారోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. వాటికి వ్యతిరేకంగా కార్మికుల పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. మే డే స్ఫూర్తితో సాధించలేని ఎనిమిది గంటల పని దినం చట్టబద్ధత చేయటం కోసం రాజ్యాంగంలో పొందుపంచడం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి అసమానమని కొనియాడారు. మోడీ ప్రభుత్వం 12 గంటల పని దినాన్ని అమలు చేస్తున్నదని కార్మిక చట్టాలను కాలరాస్తుందని మండిపడ్డారు. భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేసి సమాజాన్ని మధ్యయుగాల నాటికి నెట్టివేయడానికి ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరూ ఐక్యంగా పోరాడి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లుగా సీఐటీయూ నాయకులు మాణిక్యం, ప్రవీణ్, యాదగిరి, శ్రీను వ్యవహరించారు. సీఐటీయూ మండల నాయకులు ఎస్.ఎల్లమ్మ, పీ.పెంటయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఐఏఆర్ఈ కళాశాలకు అవార్డుల వెల్లువ

నవతెలంగాణ - దుండిగల్



దుండిగల్‌లోని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఎక్సలెన్స్‌లో 8 అవార్డులను సొంతం చేసుకుంది. ప్రతి సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలలకు ప్రతిష్టాత్మకంగా అందజేసే అవార్డులను సీఎస్ఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో చాప్టర్ ఎక్సలెన్సీ అవార్డులను హైదరాబాద్ టీ హబ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 250 కళాశాలలకుపైగా ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోగా ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాల 8 అవార్డులను దక్కించుకుంది. ఈ అవార్డులను ఐఏఎస్ జయేశ్ రంజన్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఐటీ, గోవర్ధన్ జెఎన్‌టీయూ హెచ్ రిజిస్టర్ చేతుల మీదగా అందజేశారు. ప్రిన్సిపల్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఐఏఆర్ఈ ప్రిన్సిపల్ డా.ఎల్ వి నరసింహ ప్రసాద్, ఉమెన్ లీడర్షిప్ అవార్డును మధు బాల సీఎస్సీ ప్రొఫెసర్, అవుట్ స్టాండింగ్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విత్ బెస్ట్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్‌గా ఏ.సతీష్ కుమార్, ఎఫెక్టివ్ ప్రాక్టీసెస్ ఆఫ్ ఇంక్యుబేషన్ సెంటర్ బై ఆన్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా పి.పాల ప్రసాద్ రెడ్డి, ఎఫెక్టివ్ ఇంట్రడక్షన్ టెక్నికల్ స్కిల్స్‌గా డాక్టర్ వై.మోహన రూప, ఎంట్రా ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ కింద డాక్టర్ పి.మునస్వామి, బెస్ట్ ప్లేస్‌మెంట్ కింద డాక్టర్ జి.రాము, ఆన్ లైన్ డెలివరీ ఎడ్యుకేషన్‌గా డాక్టర్ కే.విశ్వనాథ్, అల్లం రాజులు ఎంపికై ఈ అవార్డులు అందుకున్నారు.

అన్ని పార్కులకు కాపౌండ్ వాల్ పటిష్టంగా నిర్మించాలి

• కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ - కేపీహెచ్‌బి

డివిజన్లలోని అన్ని పార్కులకు కాంపౌండ్ వాల్ పటిష్టంగా నిర్మించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, అల్లాపూర్, కూకట్‌పల్లి డివిజన్లకు సంబంధించి పార్కులు, డ్రయినేజీ, రోడ్లు సంబంధిత అభివృద్ధి పనులపై వీరు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.17 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. వాటితో పార్కుల్లో నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు, 20 ఓపెన్ జిమ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎక్కడైనా పైపులైన్ల మరమ్మత్తులు జరిగి రోడ్లకు సంబంధించి ఇతర పెండింగ్ పనులు ఉంటే సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్ పోల్స్‌కు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడెక్కడ విద్యుత్ దీపాలు వెలగడం లేదో, పోల్స్ సమస్యలు ఉన్నాయో గుర్తించి దాన్ని పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు డీఈ గోవర్ధన్, ఆనంద్, ఈఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

• కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆయనను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు.



స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం వారు వివిధ ఆహ్వాన పత్రికలను ఆయనకు అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన శ్రమశక్తి అవార్డు గ్రహీతలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం శివాలయ నగర్‌కు చెందిన సుభాష్, రాజీవ్ గహకల్పకు చెందిన దేవేందర్ సింగ్‌లు కార్మిక సంక్షేమానికి విశేష కషి చేసినందుకు వారు 'శ్రమశక్తి అవార్డు' అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ కంపాస్‌ను ప్రారంభించిన కాలేజ్ దేఖో

నవతెలంగాణ -హైదరాబాద్

భారతదేశపు అతిపెద్ద అత్యంత విశ్వసనీయమైన ఉన్నత విద్యా ఎకోవ్యవస్థ అయిన కాలేజ్ దేఖో తన తాజా ఆవిష్కరణ కెరీర్ కంపాసన్ను ప్రారంభించింది. కెరీర్ కంపాస్ పరీక్ష కాలేజ్ దేఖో ద్వారా ఇన్-హౌస్ రూపొందించబడిన ఒక సాంకేతిక సాధనం ద్వారా మూడు ఉత్తమ వ్యక్తిగత లక్షణాలను గుర్తిస్తుంది. భారతదేశం కోసం ప్రత్యేకంగా సృష్టించబడిన ఇది, కేవలం మూడు నుండి అయిదు నిమిషాల సమయం పట్టే ఒక సామాన్య పరీక్ష. ఈసందర్భంగా కంపెనీ ఇటీవలి ఆఫర్ పై గర్వాన్ని వ్యక్తపరుస్తూ కాలేజ్ దేఖో సీఈఓ అండ్ సహ-వ్యవస్థాపకుడు రుచిర్ అరోరా మాట్లాడుతూ... కాలేజ్ దేఖో కెరీర్ కంపాసను ప్రారంభించుటకు తాము గర్విస్తున్నామన్నారు. ఇది విద్యార్థులు ఒక సరైన కెరీర్ మార్గాన్ని కనుగొనుటకు, కళాశాల ప్రవేశాలకు ఉచిత మార్గదర్శకాన్ని అందుకొనుటకు సహాయపడేలా రూపొందించబడిందన్నారు. ఈ విశేషత విద్యార్థులకు, ముఖ్యంగా 12వ తరగతి పూర్తి చేసి తమ కెరీర్ ఎంపికల గురించిన గందరగోళంలో ఉన్నవారికి ఎంతో సహాయకారిగా ఉంటుందని తాము విశ్వసిస్తున్నామన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం



• ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు

నవతెలంగాణ - కూకట్‌పల్లి

దేశంలోని ఏ రాష్ట్రాల్లో లేని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తూ మన రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే కష్ణారావు తాన క్యాంపు కార్యాలయంలో 123 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 16 వేల మంది లబ్ధి పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పండాల సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ గుండెల్లో దడ మొదలైంది'

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట



కొన్ని నెలల కిందట ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ జోడోయాత్ర.. ప్రస్తుతం ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ సంఘర్షణ సభతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుల గుండెల్లో దడ మొదలైందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ 'యువ సంఘర్షణ' సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంటు నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ముందుగా ఎల్బీనగర్ చౌరస్తాలోని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సరూర్ నగర్ బహిరంగ సభ స్థలానికి భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పాలనలపై ప్రజలు పూర్తిగా విసుగు చెందారని రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రావణ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూతన్, వినయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు



నవతెలంగాణ - కేపీహెచ్‌బీ

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ గ్రౌండ్‌ను సోమవారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బాలాజీనగర్‌లో యశ్వి బోటిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, బండి సుధ, అంజిరెడ్డి, మల్లికార్జున్ రావు, రవీందర్‌రెడ్డి, సుభాష్ గౌడ్, ఆరోగ్య రెడ్డి, సిద్ధు, నర్సింహా, కల్యాణి, సంతోష్ కుమార్, అజయ్ రైనా, సావిత్రి, సత్యనారాయణ, డాక్టర్ రవి, శ్రీనివాస్, రాజు, సాంబశివ రావు, నాగ, భాస్కర్ రావు, సుశీల్, శారద తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు
అండగా నిలిచిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుభాష్ నగర్ 130 డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జగన్‌కు జీవనోపాధి కోసం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తన సొంత నిధులతో ఆటోను ఇప్పించి అండగా నిలిచారు. దీంతో సోమవారం జగన్ ఎమ్మెల్యేని తన నివాసంలో కలిసి కతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, నాయకులు అడప శేషు, పద్మజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రాజ్యాంగ గ్రంథాన్ని ఇవ్వాలి

• ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ - బాలానగర్

ప్రతి ఇంటికీ రాజ్యాంగ గ్రంథాన్ని ఇవ్వాలని బాలానగర్ మండల ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల డీఎస్పీ అధ్యక్షుడు పరశురాం మహారాజ్ మాట్లాడుతూ భారతదేశంలోని 90 శాతం ప్రజానీకమైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు భారత రాజ్యాంగ విలువలను తెలియజేసేందుకు రాజ్యాంగ పరంగా విద్య అందరికీ అవసరమైనదని అన్నారు. దేశంలోనే ప్రతి ఇంటికీ భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రజల వాడుక భాషలో సాధ్యమైనంత త్వరగా



అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు గొట్టే సురేష్ మహారాజ్, బాలానగర్ మండల జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ మహారాజ్, కురుమయ్య మహారాజు, శంకర్ మహారాజ్, గిరి మహారాజ్, శ్యామ్, వెంకటేష్, సురేష్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ యువతకు భరోసా కల్పించడమే యూత్ డిక్లరేషన్'

నవతెలంగాణ - బాలానగర్




నిరుద్యోగ యువతకు భరోసా కల్పించడమే యూత్ డిక్లరేషన్ అని పీసీసీ సభ్యుడు డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధ్యక్షతన ప్రియాంక గాంధీ ముఖ్యఅతిథిగా జరగనున్న యువ సంఘర్షణ సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో సోమవారం కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పుష్పా రెడ్డి, నాగి రెడ్డి, ఎండి మోయిజ్, తూము వేణు, నల్లోల రాజేందర్, మధు గౌడ్, క్రిష్ణా రాజ్‌పుత్, నవీన్ గౌడ్, మట్టే ప్రసన్న కుమార్, రిషి యాదవ్, బంధిగ బాల నర్సింహ, జమీర్ హుస్సేన్, మహేందర్, శేఖర్ గజానంద్, చోటా మోయిజ్, బోయిన్ పల్లి మోయిజ్, ఫిరోజ్, సంతోష్, మహేష్ యాదవ్, రేణుక, జోజమ్మ, రజిత, విజయలక్ష్మి, నరేష్, వెంకటేష్, పుట్టపాక మధు, పుట్టపాక రాము, యుగేందర్, భరత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం
అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనాథ్, కామ్రేడ్ సత్యం

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట


చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో జరిగాయి. ఈ ఎన్నికల బరిలో మాజీ అధ్యక్షులు అల్లా బకాష్ పై శ్రీనాథ్ అధ్యక్షుడిగా గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా నరసింహ పై సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ సత్యం గెలిచారు. గెలిచిన వీరిద్దరిని చింతల్ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ బాల్‌రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



వాట్సప్ సేఫ్టీ అవగాహన క్యాంపెయిన్

నవతెలంగాణ -హైదరాబాద్

ఆన్లైన్ భద్రత గురించి అవగాహన కల్పించే ప్రయత్నంలో, వాట్సాప్ ఇటీవలి మార్కెటింగ్ క్యాంపెయిన్ వాట్సాప్తో సురక్షితంగా ఉండండి పేరిట వినియోగదారులకు వారి భద్రత, సురక్షతను నియంత్రించుకునేందుకు వినియోగదారులకు సాధికారత కల్పించే వాట్సాప్ లోని ప్రొడక్ట్ ఫీచర్లు, సేఫ్టీ మెజర్లపై చర్యలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వినియోగదారుల భద్రత వాట్సపు మొదటి ప్రాధాన్యతగా ఉంది. కంపెనీ తన ప్రొడక్ట్ ఫీచర్లు, పరికరాల గురించి అవగాహన కల్పిస్తూ, వినియోగదారులు ఆన్లైన్ స్కామ్లు, మోసాల బారిన పడకుండా సురక్షితంగా ఉండేందుకు సహాయపడుతుంది. స్కామర్లు నమ్మకంగా, పట్టుదలతో ఉన్నప్పటికీ, వినియోగదారులు అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం.



ఇషాన్‌కు పిలుపు

- కెఎల్ రాహుల్ స్థానంలో ఎంపిక
- జైదేవ్ ఉనద్కట్, ఉమేశ్‌లకు గాయాలు
- ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత జట్టు

నవతెలంగాణ-ముంబయి

ఐసీసీ మెగా టైటిల్ వేటలో టీమ్ ఇండియా దశాబ్ద కాల నిరీక్షణకు తెరదించే అవకాశాలకు గాయాలు గండికొట్టేలా కనిపిస్తున్నాయి!. కారు ప్రమాదంతో విధ్వంసకారుడు రిషబ్ పంత్, వెన్నునొప్పి శస్త్రచికిత్సతో పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా, వెన్నుగాయంతో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అప్పటికే ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూరం కాగా.. తాజాగా ఆ జాబితాలో మరో ఆటగాడు చేరిపోయాడు. వికెట్ కీపర్, బ్యాటర్ కెఎల్ రాహుల్ గాయం బారిన పడ్డాడు. ఐపీఎల్16లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఆడుతున్న కెఎల్ రాహుల్ తొడ గాయం బారిన పడ్డాడు. కొన్ని మ్యాచులకు బెంచ్‌కు పరిమితమైన కెఎల్ రాహుల్ వైద్య బృందం సలహాతో ఐపీఎల్16కు దూరమయ్యాడు. పేస్ బౌలర్ జైదేవ్ ఉనద్కట్, ఉమేశ్ యాదవ్ సైతం గాయాల బారిన పడిన ఆటగాళ్ల జాబితాలో చేరారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో మ్యాచ్‌లో ఉమేశ్ యాదవ్ తొడ కండరాల గాయానికి లోనయ్యాడు. జైదేవ్ ఉనద్కట్, ఉమేశ్ యాదవ్ గాయాలను బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షిస్తోంది. అవసరమైతే ఈ ఇద్దరికి ప్రత్యామ్నాయ ఆటగాళ్లను బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేయనుంది. ఇక కెఎల్ రాహుల్ త్వరలోనే శస్త్రచికిత్సకు వెళ్లనున్నాడు. సర్జరీ అనంతరం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రిహాబిలిటేషన్ కోసం రిపోర్టు చేయనున్నాడు. ఈ మేరకు బీసీసీఐ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

కెఎల్ రాహుల్ నిష్క్రమణతో ఆ స్థానంలో యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎంపికయ్యాడు. 48 ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడిన కిషన్ 38.76 సగటుతో 2985 పరుగులు చేశాడు. తాజా రంజీ సీజన్‌లో రెండు మ్యాచులు ఆడిన ఇషాన్ కిషన్ 45 సగటుతో 180 పరుగులు సాధించాడు. సూర్యకుమార్ యాదవ్, రుతురాజ్ గైక్వాడ్, ముకేశ్ కుమార్‌లను ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ స్టాండ్ బై ఆటగాళ్లుగా ఎంపిక చేసింది. స్టాండ్ బై ఆటగాళ్లలో సూర్యకుమార్ యాదవ్‌కు మాత్రమే టెస్టు క్రికెట్ అనుభవం ఉంది. జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో భారత్, ఆస్ట్రేలియాలు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గద కోసం పోటీపడనున్నాయి. తొలి టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ తలపడగా.. కివీస్ గదను ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పోటీపడటం భారత్‌కు ఇది వరుసగా రెండోసారి కావటం విశేషం.

భారత టెస్టు జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, కె.ఎస్ భరత్ (వికెట్ కీపర్), అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనద్కట్, ఇషాన్ కిషన్.



టాప్-4లో చోటు కోసం!

- ముంబయి, బెంగళూర్ ఢీ నేడు
- రోహిత్ శర్మ ఫామ్‌పై అందరి దృష్టి

నవతెలంగాణ-ముంబయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2023 లీగ్ దశ చివరి అంకంలోకి ప్రవేశించింది. పది జట్లు పది మ్యాచులు ఆడేశాయి. టాప్-4లో నిలిచిన నాలుగు జట్లు 11 చొప్పున మ్యాచులు ఆడేశాయి. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు సైతం ప్లే ఆఫ్స్ తలుపులు తెరిచే ఉండటంతో ఇప్పుడు ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుంది. పాయింట్ల పట్టికలో వరుసగా 5, 6 స్థానాల్లో కొనసాగుతున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, ముంబయి ఇండియన్స్ టాప్-4లోకి అడుగుపెట్టేందుకు ఎదురు చూస్తున్నాయి. పది మ్యాచుల్లో ఐదేసి విజయాలు, పరాజయాలతో నిలిచిన బెంగళూర్, ముంబయి నేడు విజయంతో ఏకంగా టాప్-3లోకి నిలిచేందుకు చూస్తున్నాయి. చిన్నస్వామిలో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై బెంగళూర్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. నేడు వాంఖడెలో బెంగళూర్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు రోహిత్‌సేన సిద్ధంగా ఉంది.

రోహిత్ మెరిసేనా? : ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక సార్లు డకౌట్‌గా నిలిచిన చెత్త రికార్డును మూటగట్టుకున్న రోహిత్ శర్మ.. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఐదు పరుగులే సాధించాడు. రోహిత్ శర్మ వైఫల్యం జట్టుపై ప్రభావం చూపుతోంది. ఆరంభం నుంచి మిశ్రమ ఫలితాలు సాధిస్తున్న ముంబయి ఇండియన్స్ నిలకడ చూపించలేదు. చివరి దశ మ్యాచుల్లో నిలకడ లేకపోతే ప్లే ఆఫ్స్‌లో చోటు దక్కదు!. టెస్టు జట్టులో చోటు దక్కిన ఆనందంలో ఇషాన్ కిషన్ నేడు మెరుపు ఇన్నింగ్స్‌పై కన్నేయనున్నాడు. తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, కామెరూన్ గ్రీన్ ముంబయి ఇండియన్స్‌కు కీలకం కానున్నారు.

టాప్‌పైనే భారం! : ఐపీఎల్‌లో సీజన్లు మారుతున్నా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ సమస్య మారటం లేదు. ఆరంభం నుంచి బెంగళూర్ స్టార్ క్రికెటర్లపైనే ఎక్కువగా ఆధారపడుతుంది. అదే ఆ జట్టు బలం, బలహీనతగా మారింది. విరాట్ కోహ్లి, డుప్లెసిస్, గ్లెన్ మాక్స్‌వెల్ బెంగళూర్ బ్యాటింగ్ భారం మోస్తున్నారు. ఈ ముగ్గురు అంచనాలు అందుకోవటంలో విఫలమైతే.. బెంగళూర్ బ్యాటింగ్ కుదేలైతుంది. కీలక మ్యాచుల్లో బెంగళూర్ ఈ సమస్యను అధిగమిస్తేనే ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగవుతాయి. బౌలర్లు జోశ్ హాజిల్‌వుడ్, మహ్మద్ సిరాజ్‌ల, వానిందు హసరంగ కీలకంగా మారనున్నారు.

ముంబయి ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌కు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. వాంఖడెలో సంప్రదాయ పిచ్‌ను సిద్ధం చేశారు. ఇక్కడ జరిగిన నాలుగు మ్యాచుల్లో మూడు సార్లు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్టును విజయం వరించింది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

కోల్‌కత కొట్టేసింది

- ఉత్కంఠ ఛేదనలో పంజాబ్‌పై గెలుపు
- రాణించిన నితీశ్ రానా, రసెల్

నవతెలంగాణ-కోల్‌కత

ప్లే ఆఫ్స్ రేసులో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై కోల్‌కత నైట్‌రైడర్స్ విజయం సాధించింది. చివరి బంతి వరకు ఉత్కంఠ రేపిన 180 పరుగుల ఛేదనలో కోల్‌కత నైట్‌రైడర్స్ 5 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై గెలుపొందింది. ఈ విజయంతో నైట్‌రైడర్స్ పాయింట్ల పట్టికలో ఐదోస్థానానికి ఎగబాకింది. కెప్టెన్ నితీశ్ రానా (51, 38 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), ఆండ్రీ రసెల్ (42, 23 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు)) సహా ఓపెనర్ జేసన్ రాయ్ (38, 24 బంతుల్లో 8 ఫోర్లు), రింకూ సింగ్ (21 నాటౌట్, 10 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ఆ జట్టు కెప్టెన్ శిఖర్ ధావన్ (57, 47 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీకి తోడు షారుక్ ఖాన్ (21 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), హర్‌ప్రీత్ బరార్ (17 నాటౌట్, 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ దంచికొట్టడంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 179 పరుగులు చేసింది.

ధావన్ ఒక్కడే

టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ ఈడెన్‌గార్డెన్స్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. పవర్‌ప్లేలో పంజాబ్ కింగ్స్ రన్‌రేట్ నిలుపుకున్నా.. వికెట్లు కాపాడుకోలేదు. హర్షిత్ రానా దెబ్బకు ప్రభుసిమ్రన్ సింగ్ (12), భానుక రాజపక్స (0) డగౌట్‌కు చేరగా.. లియాం లివింగ్‌స్టోన్ (15) కథ వరుణ్ చక్రవర్తి ముగించాడు. ఆరు ఓవర్ల అనంతరం 58/3తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న పంజాబ్ కింగ్స్‌ను కెప్టెన్ శిఖర్ ధావన్ ఆదుకున్నాడు. జితేశ్ శర్మ (21, 18 బంతుల్లో 2 సిక్స్‌లు)తో కలిసి నాల్గో వికెట్‌కు 53 పరుగులు జోడించిన ధావన్.. తొమ్మిది ఫోర్లు, ఓ సిక్సర్‌తో 41 బంతుల్లో అర్థ సెంచరీ బాదాడు. చివర్లో రిషి ధావన్ (19, 11 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), షారుక్ ఖాన్ (21 నాటౌట్), హర్‌ప్రీత్ బరార్ (17 నాటౌట్) ధనాధన్‌తో పంజాబ్ కింగ్స్ మంచి స్కోరు సాధించింది. చివరి 12 బంతుల్లో షారుక్, హర్‌ప్రీత్ ఏకంగా 36 పరుగులు పిండుకున్నారు. స్పిన్నర్లు 13 ఓవర్లలో 4 వికెట్లకు 92 పరుగులే ఇవ్వగా..పేసర్లు ఏడు ఓవర్లలోనే 87 పరుగులు సమర్పించుకున్నారు.





సవిత సారథ్యంలో

ఆసీస్ పర్యటనకు 20 మందితో జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా పర్యటనకు 20 మందితో కూడిన మహిళల జట్టును హాకీ ఇండియా సోమవారం ప్రకటించింది. భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మూడు మ్యాచుల సిరీస్ మే 18 నుంచి ఆడిలైడ్‌లో జరుగనుంది. పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా-ఏ జట్టుతో సైతం రెండు మ్యాచులను భారత జట్టు ఆడనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరుగనున్న ఆసియా క్రీడల సన్నద్ధతలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మూడు మ్యాచుల సిరీస్ షెడ్యూల్ చేశారు. భారత హాకీ జట్టుకు సీనియర్ గోల్ కీపర్ సవిత కెప్టెన్‌గా ఎంపికైంది. డిఫెండర్ దీప్ గ్రేస్ ఎక్కా వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. ఇటీవల బల్బీర్‌సింగ్ సీనియర్ హాకీ ఇండియా ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న సవిత.. ఆస్ట్రేలియాపై సిరీస్‌లో భారత్‌కు సారథ్యం వహించనుంది. స్టార్ స్ట్రయికర్ వందన కటారియ ఎదురుదాడికి నాయకత్వం వహించనుంది.

భారత మహిళల హాకీ జట్టు : సవిత (కెప్టెన్), బిచు దేవి కారిబామ్ (గోల్ కీపర్లు). దీప్ గ్రేస్ ఎక్కా (వైస్ కెప్టెన్), నిక్కి ప్రధాన్, ఇషిక చౌదరి, ఉదిత, గుర్జిత్ కౌర్ (డిఫెండర్లు). నిశా, నవజ్యోత్ కౌర్, మోనిక, సలీమ టెటె, నేహా, నవనీత్ కౌర్, సోనిక, జ్యోతి, బల్జీత్ కౌర్ (మిడ్ ఫీల్డర్లు). లాల్‌రామ్సెమి, వందన కటారియ, సంగీత కుమారి, షర్మిల దేవి (ఫార్వర్డ్స్).

పిఎస్‌జి ప్రాక్టీస్‌లో మెస్సి

జట్టుతో చేరిన సాకర్ సూపర్‌స్టార్

న్యూఢిల్లీ : ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్, అర్జెంటీనా జాతీయ కెప్టెన్ లియోనల్ మెస్సి మళ్లీ లీగ్ 1 జట్టు పిఎస్‌జితో కలిశాడు. లీగ్1 పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న పారిస్ సెయింట్ జెర్మెన్ (పిఎస్‌జి) గత నెల లోరియంట్ చేతిలో 1-3తో పరాజయం పాలైంది. ఆ మ్యాచ్ అనంతరం జట్టు యాజమాన్యానికి సమాచారం ఇవ్వకుండా లియోనల్ మెస్సి సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లాడు. దీంతో పిఎస్‌జి యాజమాన్యం మెస్సిపై రెండు వారాల సస్పెన్షన్ విధిస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ సమయంలో మెస్సి ప్రాక్టీస్ సెషన్లో సైతం పాల్గొనకూడదని స్పష్టం చేసింది. సౌదీ అరేబియా టూరిజం ప్రచారకర్తగా కొనసాగుతున్న మెస్సి ఒప్పందంలో భాగంగా ఆ దేశానికి వెళ్లాడు. వివాదం సమసిపోవటంతో సోమవారం ఉదయం పిఎస్‌జి ప్రాక్టీస్ సెషన్లో మెస్సి మెరిశాడు. ప్రాక్టీస్ సెషన్లో లియోనల్ మెస్సి ఫోటోను పిఎస్‌జి సోషల్ మీడియాలో పంచుకుంది. పిఎస్‌జితో బంధానికి బీటలు రావటంతో వచ్చే సీజన్లో సౌదీ అరేబియా క్లబ్ అల్ హిలాల్ తరపున ఆడేందుకు మెస్సి మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. మెస్సికి సౌదీ క్లబ్ ఆకర్షణీయ ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది.





కృతిశెట్టి, నాగచైతన్య

సర్‌ప్రైజ్ చేసే కస్టడీ

నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబోలో వస్తున్న తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ'. కృతి శెట్టి కథానాయికగా నటిస్తోంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై పవన్ కుమార్ సమర్పిస్తుండగా, శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. ఈనెల 12న సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. హీరో నాగచైతన్య మాట్లాడుతూ, 'కస్టడీ కథ వెంకట్ ప్రభు చెప్పినప్పుడు లేచి ఆయన్ని గట్టిగా హగ్ చేసుకున్నాను. నాకు అంత ఎగ్జైట్‌మెంట్ ఇచ్చింది. అలాగే ఎడిటింగ్ రూమ్‌లో చూసినప్పుడు కూడా అదే ఎగ్జైట్‌మెంట్ ఇచ్చింది. నిర్మాతలు శ్రీనివాస్ చిట్టూరి, పవన్ ఈ సినిమాని నెక్స్ట్ లెవల్‌లో కూర్చోబెట్టారు. నా కెరీర్‌లో మోస్ట్ ఎక్స్‌పెన్సీవ్ మూవీ ఇది. అరవింద్ స్వామి ఈ కథకి ఓకే చెప్పడంతో మా అందరికీ చాలా కాన్ఫిడెన్స్ వచ్చింది. ఈ చిత్రంతో కృతి శెట్టి కెరీర్ మరో స్థాయికి వెళుతుందని నమ్ముతున్నాను. సినిమా మొదటి ఇరవై నిమిషాలు కూల్‌గా వెళుతుంది. ఇంటర్వెల్‌కి ముందు నుంచి థియేటర్‌లో బ్లాస్ట్ అవుతుంది. అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. మీరు కొత్త చైని చూడబోతున్నారు' అని తెలిపారు. 'కస్టడీలో స్టైల్, యాక్షన్, ఫెర్ఫార్మెన్స్, సెంటిమెంట్, మాస్ ఇలా అన్నీ ఉన్నాయి. కస్టడీ నా కెరీర్‌లోనే భారీ చిత్రం. ఈ సినిమా చూసినప్పుడు తప్పకుండా సర్‌ప్రైజ్ అవుతారు' అని దర్శకుడు వెంకట్ ప్రభు చెప్పారు.

ఆసక్తికర సర్కిల్

జాతీయ అవార్డు దర్శకుడు నీలకంఠ నుంచి మరో ఆసక్తికర సినిమా రాబోతోంది. గతంలో 'షో' అనే ఫీచర్ ఫిల్మ్‌తో బెస్ట్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ స్క్రీన్ ప్లే విభాగాల్లో రెండు జాతీయ అవార్డులు, అలాగే 'విరోధి', 'షో' చిత్రాలు ఇండియన్ పనోరమలో కూడా సెలెక్ట్ అయ్యాయి. అలాగే కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న 'మిస్సమ్మ', 'సదా మీ సేవలో' వంటి చిత్రాలతోనూ ఆయన ఆకట్టుకున్నారు. కొంత గ్యాప్ తర్వాత ఇప్పుడు మరోసారి 'సర్కిల్' అనే చిత్రంతో ఆయన వస్తున్నారు. ఈ చిత్రానికి ఎవరు, ఎప్పుడు, ఎందుకు శత్రువులవుతారో.. అనే ట్యాగ్ లైన్ అందర్నీ ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ చిత్ర టైటిల్‌తో పాటు మోషన్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఇది మరోసారి నీలకంఠ తరహాలోనే సాగే వైవిధ్యమైన సినిమాగా కనిపిస్తోందని, అలాగేచిత్ర తారాగణం సైతం ఆసక్తికరంగానే ఉందని మోషన్ పోస్టర్ చెప్పకనే చెప్పింది..ఆరా ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపొందుతున్న ఈ చిత్రంలో సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా, పార్థవ సత్య తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు : ఎమ్.వి శరత్ చంద్ర, టి సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ, రచన, దర్శకత్వం : నీలకంఠ.



నీలకంఠ, సాయి రోనక్

నవచిత్రం



రజనీకాంత్

భాయ్ వేట.. మొదలైంది

లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో రానున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'లాల్ సలాం'. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తోన్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో రజనీకాంత్ కీలక పాత్రను పోషిస్తున్నారనే సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పోషిస్తోన్న 'మొయిద్దీన్ భాయ్' క్యారెక్టర్‌కు సంబంధించిన రజనీకాంత్ ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.

ఈ మాస్ గెటప్ ఓ రేంజ్‌లో ఉంది. 'బాషా'లో మాణిక్ బాషాగా అలరించిన ఆయన ఇప్పుడు మొయిద్దీన్ భాయ్‌గా మెప్పించ బోతున్నారు. ఈ సందర్భంగా లైకా ప్రతినిధులు మాట్లాడుతూ, 'రజనీ మొయిద్దీన్ భాయ్ అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఆయన తనదైన స్టైల్‌లో రాకింగ్ పెర్ఫామెన్స్‌తో ఈ చిత్రంలోనూ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటారనటంలో సందేహం లేదు' అని తెలిపారు. ఈ చిత్రాన్ని ఆస్కార్ విజేత ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.



సంతోష్ శోభన్, మాళవిక నాయర్

ఆద్యంతం ఆహ్లాదకరం

స్వప్న సినిమా పతాకంపై నందిని రెడ్డి దర్శకత్వంలో సంతోష్ శోభన్, మాళవిక నాయర్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. సోమవారం 'చెయ్యి చెయ్యి కలిపేద్దాం.' అంటూ సాగే నాలుగవ పాటను విడుదల చేసారు. ఇది పెళ్లి వేడుకలో వచ్చే పాట. మిక్కీ జే మేయర్ ఆహ్లాదకరమైన సిట్యుయేషనల్ ట్రాక్‌ని స్కోర్ చేసారు. వివాహ వేడుకలు ఎలా ఉంటాయో, ఎలాంటి సన్నాహాలు జరుగుతాయో చంద్రబోస్ సరిగ్గా వివరించారు. ఇది ప్రధానంగా వివాహ విందు గురించిన పాట. శ్రీ కృష్ణ, వేణు శ్రీరంగం, సందీప్, చైత్ర అంబడిపూడి వాయిస్‌లు మరింత ప్రత్యేకతను చాటాయి. నటీనటులందరూ కలిసి ఈ వేడుకను జరుపుకోవడం ఒక కన్నుల పండుగ. ఈ పాటకు బృందా మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ,'ఈ పాట చూసినప్పుడు పెళ్లి సందడి చూసినంత ఆనందం కలిగింది. 'పెళ్లి సందడి' అంత పెద్ద విజయం ఈ సినిమా సాధిస్తుంది' అని అన్నారు. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 18న విడుదల కానుంది.



శ్రియా

గర్వంగా ఫీల్ అవుతున్నా..

శర్మన్ జోషి, శ్రియా, షాన్, సుహాసిని మూలే, ప్రకాష్ రాజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. ఇళయరాజా సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ మల్టీ లింగ్యువల్ మ్యూజికల్ మూవీ ఈనెల 12న రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో నాయిక శ్రియా మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక అందమైన సినిమా. ఇళయరాజాతో వర్క్ చేయటం చాలా ఆనందంగా ఉంది.

దర్శకుడు, నిర్మాత పాపారావు చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. నేటి తరంలో చదువు పేరుతో పిల్లలపై ఒత్తిడి తీసుకొచ్చి, వాళ్ళ క్రియేటివీని చంపేస్తున్నాం. అయితే ఈ విషయాన్ని మంచి పాటలతో, ఆహ్లాదభరితంగా చూపించ బోతున్నాం. ఇలాంటి సినిమాలో భాగమైనందుకు గర్వంగా ఉంది' అని తెలిపారు.

సైయారా.. పాట బాగుంది : బ్రహ్మానందం

బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో సాయిరత్న క్రియేషన్స్ పతాకంపై తేజ్ బొమ్మదేవర, రిషిక లోక్రే జంటగా బొమ్మదేవర రామచంద్రరావు దర్శక, నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.2గా తెరకెక్కుతున్న చిత్రం 'మాధవే మధుసూదన'. ఈ చిత్రంలోని రెండవ లిరికల్ సాంగ్ 'సైయారా.. సైయారా..'ను బ్రహ్మానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'పాట చాలా బాగుంది. నేను బాగోక పోతే ఎవ్వరినీ పొగడను. తేజ్ బాగా డాన్స్ బాగా చేసాడు. రాజు సుందరం కొరియోగ్రఫీ బాగుంది. డైరెక్టర్ బొమ్మదేవర రామచంద్రరావు (చంద్ర) ఇంత బాగా డైరెక్షన్ చేస్తాడని నేను అనుకోలేదు. మంచి అభిరుచిగల నిర్మాతగా కూడా ఆయన మంచి విజయం సాధించాలి' అని అన్నారు. 'ఈ పాట ఆదిత్య మ్యూజిక్‌లో ఉంది. మిస్ అవకుండా చూడండి. ఈపాటను వైష్ణవి కొవ్వూరి పాడారు. మిగిలిన పాటలు త్వరలో రిలీజ్ చేస్తాం. వికాస్ బాడిస అందించిన సంగీతం, వాసు సినిమాటోగ్రఫీ, ఉద్ధవ్ ఎస్‌బి ఎడిటింగ్ సినిమాకి బాగా ప్లస్ అవుతాయి' అని దర్శక, నిర్మాత బొమ్మదేవర రామచంద్ర రావు తెలిపారు.



తేజ్ బొమ్మదేవర, బ్రహ్మానందం

యూనిక్ కాన్సెప్ట్

డ్రీమ్ వారియర్ పిక్చర్స్ మరో యూనిక్ కథతో, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో 'ఫర్హానా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నెల్సన్ వెంకటేశన్ దర్శకుడు. ఈనెల 12న సినిమా రిలీజ్ అవుతోంది.ఈ సందర్భంగా హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ, 'ఇది నాకు చాలా స్పెషల్ మూవీ. ఒక ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ తెలుగు, హిందీ, తమిళభాషల్లో విడుదల కావడం పెద్ద విషయం. నెల్సన్ గత చిత్రాల మాదిరిగానే ఇదికూడా యూనిక్‌గా, భిన్నంగా ఉంటుంది. నాకు సవాల్‌గా నిలిచిన పాత్రను ఇందులో చేశాను' అని తెలిపారు. "ఫర్హానా' మంచి కంటెంట్ ఉన్న చిత్రం. ఐశ్వర్య రాజేష్ అద్భుతంగా నటించింది' అని దర్శకుడు నెల్సన్ అన్నారు. నిర్మాత ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ,' ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు చూడదగ్గ సినిమా. ఫైనల్ కాపీ చూసి ఈ సినిమా చేసినందుకు చాలా గర్వంగా ఫీలయ్యాను' అని చెప్పారు.



ఐశ్వర్య రాజేష్



సుమన్, సాయిచరణ్

ఐక్యూ.. భిన్న సినిమా

కాయగూరల రాజేశ్వరి సమర్పణలో కె. యల్. పి మూవీస్ పతాకంపై సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ నటీనటులుగా జి.యల్.బి. శ్రీనివాస్ దర్శకత్వంలో కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన చిత్రం 'ఐక్యూ (పవర్ ఆఫ్ స్టూడెంట్స్). ఈ సినిమా విడుదలకు సిద్ధమైన సందర్భంగా చిత్ర యూనిట్ నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నటుడు సుమన్ మాట్లాడుతూ,'చాలా కొత్త పాయింట్‌ను సెలెక్ట్ చేసుకొని తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు చాలా డిఫరెంట్‌గా ఉంటుంది' అని తెలిపారు. 'ఇది ఒక బ్రెయిన్‌కు సంబంధించిన సినిమా. మేధావి అయిన ఓ అమ్మాయి మెదడును అమ్మడానికి వాళ్ళ ప్రొఫెసర్ ఎలా ప్లాన్ చేశాడు అనే పాయింట్ ఇప్పటి వరకు రాలేదు. యూత్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో మా అబ్బాయి హీరోగా నటిస్తున్నాడు' అని నిర్మాత కాయగూరల లక్ష్మీపతి చెప్పారు. దర్శకుడు శ్రీనివాస్ జి.యల్. బి మాట్లాడుతూ,' మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ సినిమాకు మీరందరి సపోర్ట్ కావాలి' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

కెనరా బ్యాంక్ 120 శాతం డివిడెండ్

- లాభాల్లో 90 శాతం వృద్ధి




హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ తన ఇన్వెస్టర్లకు ఆకర్షణీయ డివిడెండ్‌ను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.12 లేదా 120 శాతం డివిడెండ్‌ను అందించడానికి ఆ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ప్రతిపాదించారు. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభాలు 90 శాతం పెరిగి రూ.3,175 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,666 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.7,006 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం.. క్రితం త్రైమాసికంలో 23 శాతం పెరిగి రూ.8,616 కోట్లకు చేరింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికం నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 5.35 శాతానికి తగ్గాయి. 2022 ఇదే మార్చి నాటికి జీఎన్‌పీఏ 5.89 శాతంగా ఉంది. ఇదే సమయంలో 2.65 శాతంగా బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు గడిచిన త్రైమాసికం ముగింపు నాటికి 1.73 శాతానికి తగ్గడం విశేషం. 2023 మార్చి ముగింపు నాటికి బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ 12 శాతం పెరిగి రూ.20.41 లక్షల కోట్లకు చేరింది. గ్లోబల్ డిపాజిట్లు రూ.11.79 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ డిపాజిట్లు 6 శాతం పెరిగి రూ.10.94 లక్షల కోట్లకు చేరాయి. 2023 మార్చి ముగింపు నాటికి కెనరా బ్యాంక్ 9,706 శాఖలను కలిగి ఉండగా.. ఇదులో 3048 గ్రామీణ ప్రాంతాల్లో, 2742 శాఖలు చిన్న పట్టణాలు, 1991 పట్టణాలు, 1925 శాఖలు మెట్రో నగరాల్లో ఉండగా.. మొత్తంగా 10,726 ఏటీఎం శాఖలను కలిగి ఉన్నట్టు ఆ బ్యాంక్ వెల్లడించింది.

ఇండియన్ బ్యాంక్ లాభాల్లో 47 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 47 శాతం వృద్ధితో రూ.1,447 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.984 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో ఆ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.11,405 కోట్లుగా ఉండగా.. గడిచిన మార్చి త్రైమాసికంలో రూ.14,238 కోట్లకు చేరింది. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.9,832 కోట్ల నుంచి రూ.12,244 కోట్లకు పెరిగింది. 2023 మార్చితో ముగిసిన ఏడాదికి గాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.8.60 లేదా 86 శాతం డివిడెండ్‌ను ఇవ్వడానికి బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 8.47 శాతం నుంచి 5.95 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 2.20 శాతం నుంచి ఏకంగా 0.90 శాతానికి దిగిరావడం విశేషం. రూ.3,000 కోట్ల నిధుల సమీకరణకు ఆ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది.

ఏఐ అణు బాంబు లాంటిది



- వారెన్ బఫెట్ హెచ్చరిక

వాషింగ్టన్ : కృత్రిమ మేధ (ఏఐ) అణుబాంబు లాంటిదని ప్రపంచం లోనే అతిపెద్ద కుబేరుడు వారెన్ బఫెట్ అన్నారు. నెబ్రాస్కాలోని ఒమాహాలో జరిగిన బెర్క్‌షైర్ హాత్‌వే వార్షిక సమావేశంలో బఫెట్ మాట్లా డుతూ.. ఏఐని సృష్టించడమంటే అణు బాంబును తయారు చేసుకోవడమేనని హెచ్చరించారు. చాట్ జీపీటీ గురించి బిల్‌గేట్స్ చెప్పినప్పుడు తాను ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. మనం చేసే పని మంచిదై ఉండొచ్చు కానీ.. అందులోనూ కొన్ని దుష్ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అందుకు నిదర్శనమే రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణుబాంబు ప్రయోగమన్నారు.

ఎస్టే లాడర్‌కు ప్రచారకర్తగా మానుషి చిల్లర్



హైదరాబాద్: బాలీవుడ్ నటి, మోడల్ అయి నటువంటి మానుషి చిల్లర్‌ను ఎస్టే లాడర్ తమ బ్రాండ్ అంబాసీడర్‌గా నియమించు కున్నట్టు ప్రకటించింది. సౌందర్య ఉత్పత్తులను విక్రయించే తమ సంస్థ ఈ నెలాఖరులో ప్రారంభించే క్యాంపెయిన్‌లో మానుషి కనిపించనుందని పేర్కొంది. ఎస్టే లాడర్ కుటుంబంలోకి మానుషిని స్వాగతిస్తున్నందుకు తాము సంతోషిస్తున్నామని ఎస్టే లాడర్ ప్రెసిడెంట్ జస్టిన్ బాక్స్ ఫోర్డ్ పేర్కొన్నారు.

గో ఫస్ట్ టికెట్ బుకింగ్స్ నిలిపివేత

న్యూఢిల్లీ : ఆర్థిక ఇబ్బందులతో దివాలా తీసిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్ తక్షణమే టికెట్ల బుకింగ్స్‌ను నిలిపివేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి టికెట్లు విక్రయించకూడదని సోమవారం నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే మే 12వ తేది వరకు విమాన సేవలను నిలిపివేసినట్టు ఇటీవల గో ఫస్ట్ తెలిపింది. కాగా.. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు టికెట్లను అమ్మకూడదని తాజాగా డిజిసిఎ పేర్కొంది. కార్యకలాపాలను సమర్థంగా నడపడంలో విఫలం అయినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని మరో నోటీసులో కోరింది.

సెంట్రల్ బ్యాంక్‌కు రూ.571 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ) 84 శాతం వృద్ధితో రూ.571 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.310 కోట్ల లాభాలు నమోదు చేసింది.

గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 45 శాతం పెరిగి రూ.3,513 కోట్ల నుంచి రూ.2,416 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 125 శాతం వృద్ధితో రూ.1424 కోట్లుగా నమోదైంది. 2023 మార్చి నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 8.44 శాతానికి తగ్గాయి. 2022 డిసెంబర్ ముగింపు నాటికి జీఎన్‌పీఏ 8.85 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తులు 2.09 శాతం నుంచి 1.77 శాతానికి తగ్గాయి.

పత్తి కోసం గోద్రెజ్ ఆగ్రోవెట్ కొత్త బ్రాండ్

నాగ్‌పూర్ : పర్యావరణ అనుకూల పత్తి ఉత్పత్తి కోసం అంబ్రెల్లా బ్రాండ్ పినను ప్రారంభించినట్టు గోద్రెజ్ ఆగ్రోవెట్ వెల్లడించింది. విత్తనం విత్తడం నుంచి చురుకుగా పుష్పించే దశ వరకు కలుపు నిర్వహణ పరంగా పిన బ్రాండ్ విస్తృత శ్రేణి ఉత్పత్తులను కలిగి ఉందని పేర్కొంది. "పత్తి పంటలు తొలిదశలో నెమ్మదిగా పెరుగుతాయి.

పంటల మధ్య విశాలమైన ఖాళీ కారణంగా, కలుపు మొక్కలు పత్తి దిగుబడిని 45-50% వరకు ప్రభావితం చేస్తాయి. పినా బ్రాండ్‌లు విత్తనం విత్తడం నుండి పంట దశలో చురుకుగా పుష్పించే దశ వరకు కలుపు నిర్వహణ ఎంపికల విస్తత విండోను అందించడంతో, రైతులు ఇప్పుడు కలుపు రహిత పంటను ఎక్కువ కాలం పొందవచ్చు." అని జిఎవిఎల్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ రాజవేలు ఎన్‌కె పేర్కొన్నారు.

మైక్రోసాఫ్ట్‌తో మేక్ మై ట్రిప్ భాగస్వామ్యం

గురుగావ్ : ట్రావెల్ బుకింగ్ విభాగానికి కొత్త రూపాన్ని ఇచ్చేందుకు మైక్రోసాఫ్ట్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని మేక్ మై ట్రిప్ వెల్లడించింది. దీంతో భారతీయ భాషలలో వాయిస్ అసిస్టెడ్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొంది. ఈ కొత్త ఇన్ ప్లాట్‌ఫారమ్‌ను మైక్రోసాఫ్ట్ అజ్యూర్ ఓపెన్ ఎఐ సర్వీస్, అజ్యూర్ కాగ్నెటివ్ సర్వీసెస్ అభివృద్ధి చేసిందని తెలిపింది. వాయిస్ అసిస్టెడ్ బుకింగ్ ఫ్లోను తదుపరి దశకు తీసుకెళ్లనుందని పేర్కొంది.

రైతులకు అండగా ఉందాం

ఉన్నతాధికారులు, రైస్ మిల్లర్లతో మంత్రి గంగుల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాలతో రాష్ట్రంలో చేతికొచ్చిన పంట నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న రైతాంగానికి అందరూ సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం చేసే కృషికి బాధ్యత గల మిల్లర్లుగా రైస్ మిల్లింగ్ పరిశ్రమ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర మిల్లర్ల సంఘం ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ధాన్యం అన్‌లోడింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఆ రెండు జిల్లాల్లో ఎటి పరిస్థితుల్లోనూ కొనుగోలు కేంద్రం నుంచి పంపిన ధాన్యాన్ని దింపుకోవాలని ఆదేశించారు. పదే పదే తడిచిన ధాన్యం మిల్లింగుకు పనికి రాకుండా పాడవుతుందనీ, నూక శాతం పెరగడంతో పాటు రంగుమారుతుందనీ, అలాంటి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆమోదించకపోవడంతో నష్టం జరుగుతున్నదని తెలిపారు. కనీస నాణ్యతా ప్రమాణాలను సడలించాలంటూ ఎఫ్ సీఐకు లేఖ రాశామనీ, మరోసారి దీన్ని ఆమోదించాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రూ.3,161 కోట్ల విలువైన 15.38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6,087 కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక లక్షా 7 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ చైర్మెన్ రవీందర్ సింగ్, కమిషనర్ వి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

మంత్రి గంగుల తనజన్మదినాన్ని పురస్కరించుకుని సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం గంగులను ఆశీర్వదించి, అభినందించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని ఆ వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే

సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతోనే ప్రధాని మోడీ "జై భజరంగ బలి" అంటూ నినాదాలు ఇచ్చారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాంటి నినాదాలు ప్రధాన మంత్రి ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు అంశంలో రకరకాల పుకార్లనూ, ప్రచారాన్ని నమ్మొద్దనీ, ముందు స్థానిక సమస్యల పరిష్కారం కోసం దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకొస్తే.. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించడంపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల కంటే ముస్లింలు వెనుకబడి ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్లు నివేదికలిచ్చాయని గుర్తు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతిక కారణాలను చూపుతూ సీపీఐకి జాతీయ హోదాను ఉపసంహరించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. దామాషా పద్ధతిన ఎన్నికలు జరిగితే ఫలితాలు మరోరకంగా ఉంటాయని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద వర్గాలకు అనేక కోతలు విధించిందని విమర్శించారు. నరేగా, ఆహార సబ్సిడీ, ఎరువుల నిధులకు కోత పెట్టిందన్నారు. హిందూ,ముస్లిం ,భారత్, పాకిస్తాన్ పేరుతో మత విద్వేషాలను రెచ్చగొట్టటం సిగ్గుచేటన్నారు.రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఫాసిస్టు అవశేషాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'ఇంటింటికీ సీపీఐ' పాదయాత్రలో పార్టీ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను క్రోడీకరించి, వాటి పరిష్కారానికి భవిష్యత్‌లో పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధరణి పోర్టల్ , రైతుల రుణమాఫీ, పోడు భూములు, ఇండ్ల స్థలాలు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు, వీఓఏ, విద్యుత్ రంగంలోని ఆర్టిజన్, సింగరేణి ఇలా అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి కూడా పాల్గొన్నారు.

పీఎం కేర్స్‌కు విదేశీ విరాళాల వెల్లువ !

- మూడేండ్లలో రూ. 535 కోట్లు

న్యూఢిల్లీ : పీఎం కేర్స్‌కు గత మూడేండ్ల కాలంలో విదేశాల నుంచి రూ. 535 కోట్ల విరాళం అందింది. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో అత్యవసర పరిస్థితులలో పౌరులకు సాయం అందించేందుకు పీఎం కేర్స్ పేరిట మోడీ ప్రభుత్వం 2020లో నిధిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నిధికి సంబంధించిన వసూళ్ల, చెల్లింపుల ఖాతాల ప్రకారం విదేశాల నుంచి 2019-20లో రూ. 0.40 కోట్లు, 2020-21లో రూ. 494.92 కోట్లు, 2021-22లో రూ. 40.12 కోట్ల మేర విరాళాలు లభించాయి.

ఈ మూడు ఆర్థిక సంవత్సరాలలో విదేశీ విరాళాల నుంచి రూ. 24.85 కోట్ల వడ్డీ ఆదాయం కూడా లభించింది. కోవిడ్ ఉధృతి ఎక్కువగా ఉన్న 2020-21లో విదేశాల నుంచి అధికంగా విరాళాలు వచ్చాయి. రెండో దశ కోవిడ్ ప్రబలిన 2021-22లో మాత్రం విరాళాల జోరు తగ్గింది. 2021-22లో విదేశీ విరాళాలతో పాటు స్వచ్ఛంద విరాళాలు కూడా తగ్గిపోయాయి. 2020-21లో రూ. 7,183.77 కోట్ల మేర స్వచ్ఛంద విరాళాలు లభించగా 2021-22లో రూ. 1,896.76 కోట్లు మాత్రమే వచ్చాయి. 2019-20లో స్వచ్ఛంద విరాళాల రూపంలో రూ.3,075.85 కోట్లు వచ్చాయి. విదేశీ, స్వచ్ఛంద విరాళాలు కలిసి ఈ మూడేండ్ల కాలంలో రూ. 12,691.82 కోట్లు లభించాయి. పీఎం కేర్స్‌కు వచ్చే విరాళాలను ఆదాయపన్ను, ఎఫ్‌సీఆర్‌ఏ నుంచి మినహాయించారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వెంటిలేటర్లు, వలసవాదుల సంక్షేమం, రెండు కోవిడ్ ఆస్పత్రుల ఏర్పాటు, ఆక్సిజన్ ప్లాంట్లు, వాక్సిన్ సేకరణ, ఇతర కోవిడ్ సంబంధ సరఫరాల కోసం ఈ నిధి నుండి చెల్లింపులు జరిపినట్లు ఖాతాలో చూపారు. అయితే ఈ నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఇవ్వటానికి ఆర్టీఐ నుంచి మినహాయింపు ఇవ్వటం గమనార్హం.

కేసులకు భయపడ్డ మాయావతి

కాన్షీరాం సిద్ధాంతాలను తుంగలో తొక్కేశారు....

- బీజేపీకి తోక పార్టీగా బీఎస్పీ
- మునుగోడుతో ప్రవీణ్ కుమార్ సత్తా తెలిసింది : ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసులకు భయపడ్డ బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం సిద్ధాంతాలను తుంగలో తొక్కేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ అనేది బీజేపీకి తోక పార్టీగా మార్చారనీ, అందుకే బీజేపీని పల్లెత్తు మాటనలేదని తెలిపారు. మాయావతి భయపడుతున్న తీరు చూస్తే ఆమె ఆర్థిక నేరాలకు పాల్పడినట్టుగానే భావించాల్సి వస్తుందన్నారు. యూపీలో తన పాలనలో భారీ ఏనుగు విగ్రహాలను ఏర్పాటు చేసిన ఆమె అంబేద్కర్ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ అంటేనే దళితుల సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం అనే రీతిలో సీఎం కేసీఆర్ పాలన ఉందంటూ కొనియాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్‌కు గతంలో ఆరేండ్ల పాటు గురుకులాల సొసైటీ కార్యదర్శిగా కేసీఆర్ అవకాశం కల్పిస్తే దుర్వినియోగం చేసుకుని సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. మాయావతి అధికారంలో ఉండగా దళిత బంధు ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. జాతీయ స్థాయి నేత మాయావతి అయితే... బహిరంగ సభలో జాతీయ అంశాలను ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాజకీయాల్లో మాయావతి శకం ముగిసిందని విమర్శించారు. ఇప్పటికైనా బీజేపీ ఆగడాలపై నోరు విప్పి మాయావతి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో అధికారమంటూ పగటి కలలు కనడం మానుకోవాలనీ, బీజేపీ మతతత్వ రాజకీయాలని ప్రశ్నించకపోతే మనుగడే ఉండబోదని స్పష్టం చేశారు. మునుగోడు ఉప ఎన్నికలతో ప్రవీణ్ కుమార్ సత్తా ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు.

ముమ్మరంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తాత్కాలిక బుకింగ్ కార్యాలయం, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) భవన నిర్మాణానికి సంబంధించిన ప్రధాన పనుల్లో వేగం పెరిగింది. అప్‌గ్రేడేషన్ పనులు దశలవారీగా చేపట్టి, ప్రణాళిక, షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే సోమవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే భూసార పరీక్ష, టోపోగ్రాఫిక్ సర్వే పూర్తి చేశారు. మే నెలాఖరు నాటికి తాత్కాలిక బుకింగ్ కార్యాలయ నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఆర్‌పీఎఫ్ భవన నిర్మాణం మరో రెండు నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనానికి దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం త్వరలో అందుబాటులోకి వస్తుంది. అటు నుంచి వచ్చే ప్రయాణికులకు అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయి.

అలాగే 11 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో భూగర్భ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 9.5 లక్షల లీటర్ల భూగర్భ ట్యాంకులకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. నిర్ణీత గడువులోపు స్టేషన్ నిర్మాణ పనులు పూర్తిచేసి, ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ చెప్పారు. రూ.700 కోట్ల వ్యయంతో స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు చేపట్టామనీ, ప్రాజెక్ట్‌లోని ప్రతి దశను అధికారులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

జేపీఎస్‌లను తొలగిస్తామనడం సరికాదు : డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్)ను విధుల్లో చేరకుంటే తొలగిస్తామనడం సరైంది కాదని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) విమర్శించింది. వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 11 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించకుండా, విధులలో వెంటనే చేరకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామనడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఆ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వారు నియామకమై నాలుగేండ్లు గడిచిపోయినప్పటికీ క్రమబద్ధీకరించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. వారిపై బెదిరింపు చర్యలు మానుకుని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆరోగ్య శాఖలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపిక

- రెండు వారాల్లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయండి: మంత్రి హరీశ్ రావు ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్య శాఖలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) విడుదల చేసింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 34 స్పెషాలిటీ విభాగాలకు వీరు ఎంపికయ్యారు. కొత్తగా ప్రారంభమైన మెడికల్ కాలేజీల్లో మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు కోరుకున్న చోట నియామక ఉత్వర్వులను పొందనున్నారు. భర్తీ ప్రక్రియను కేవలం ఐదు నెలల రికార్డు సమయంలోనే విజయవంతంగా పూర్తి చేసిన బోర్డును ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఈ సందర్భంగా అభినందించారు. ఈ మేరకు సోమవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించి, ఎప్పటికప్పుడు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తూ, ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటూ, అర్హులు ఉద్యోగ అవకాశాలు పొందేలా చేయడం గొప్ప విషయమని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఎంపికైన వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయంతో రాష్ట్రంలో వైద్యవిద్య అవకాశాలు పెరిగి, సూపర్ స్పెషాలిటీ సేవలు మారుమూల ప్రాంతానికి సైతం చేరువ అయ్యాయని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో అవసరమైన వైద్య సిబ్బంది భర్తీని ప్రభుత్వం ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. ఒకవైపు వైద్యుల భర్తీతో పాటు, మరోవైపు 5,204 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీని మొదలు పెట్టినట్టు వివరించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా స్టాఫ్ నర్సు నియామక ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆన్ లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) ద్వారా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు వారాల్లోగా కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తి చేసి, నియామక ఉత్వర్వులు అందించి, విధుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డిని ఆదేశించారు.

మెడికో లీగల్ కేసుల్లో వైద్యుల సాక్ష్యం కీలకం

- రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ షిఖా గోయెల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మహిళలపై లైంగిక దాడులు, వేధింపుల కేసుల్లో వైద్యుల సాక్ష్యాలు అత్యంత కీలకమవుతున్నాయని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ షిఖా గోయెల్ అన్నారు. మెడికో లీగల్ కేసుకు సంబంధించి మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండ్రోజుల పాటు జరుగుతున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను షిఖా గోయెల్ డీజీపీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్న సందర్భంలో వాటిని మెడికో లీగల్ కేసులుగా తీసుకొని బాధితురాళ్లకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. అలాగే కొన్ని కేసుల్లో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో కూడా నిపుణులు పరీక్షలను నిర్వహించడం జరుగుతున్నదని ఆమె తెలిపారు. సమాజాన్ని ప్రభావితం చేసే అత్యంత సున్నితమైన ఇలాంటి కేసులలో సాక్ష్యాలు సేకరించి నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా చేయడం దర్యాప్తు అధికారులకు ఒక సవాలుగా పరిణమిస్తున్నదని షిఖా గోయెల్ అన్నారు. ముఖ్యంగా, కోర్టులలో నిజాలు తేల్చి నిందితులకు శిక్షలు పడేలా చేయడానికి వైద్యులు జరిపే పరీక్షలు, వాటి ఆధారంగా కోర్టులలో ఇచ్చే సాక్షాలు కూడా అత్యంత కీలకమవుతున్నాయని ఆమె తెలిపారు. ఈ రెండ్రోజుల వర్క్‌షాప్‌లలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన 78 మంది సీనియర్ వైద్యులు పాల్గొంటున్నారని షిఖా గోయెల్ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో నగరంతో పాటు వివిధ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్‌లతో పాటు ఫోరెన్సిక్ నిపుణులు పాల్గొన్నారు.

బెంగళూరు బరిలో కోటీశ్వరులు

- ధనబలం ఉన్న వారికే పార్టీల టికెట్

బెంగళూరు : కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీలన్నీ ధనబలం ఉన్న వారినే అభ్యర్థులుగా నిలిపాయి. బెంగళూరు నగరంలోని 28 అసెంబ్లీ స్థానాల నుంచి బరిలో నిలిచిన 384 మంది అభ్యర్థులలో 157 మంది... అంటే 41 శాతం మంది కోటీశ్వరులేనని ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది. బెంగళూరు నగరం నుండి పోటీ పడుతున్న 389 మంది అభ్యర్థులలో 384 మంది అఫిడవిట్లను ఈ సంస్థ పరిశీలించింది. వీరిలో 157 మంది రూ. కోటి, అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఉన్న వారే. 87 మంది అభ్యర్థులు... అంటే 23 శాతం మంది తమకు ఐదు కోట్ల రూపాయల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. 37 మంది అభ్యర్థులు (10 శాతం) తమకు రెండు నుండి ఐదు కోట్ల వరకూ విలువైన ఆస్తులు ఉన్నాయని తెలిపారు. 76 మంది అభ్యర్థులకు యాభై లక్షల నుండి రెండు కోట్ల రూపాయల వరకూ, 70 మంది అభ్యర్థులకు పది లక్షల నుండి యాభై లక్షల రూపాయల వరకూ విలువైన ఆస్తులు ఉన్నాయి.

బెంగళూరు నగరం నుంచి బరిలో నిలిచిన 114 మంది అభ్యర్థులకు మాత్రం పది లక్షల రూపాయల కంటే తక్కువ విలువైన ఆస్తులు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి 26 మంది, బీజేపీ నుంచి 27 మంది, జేడీ (ఎస్) నుంచి 21 మంది, ఆప్ నుంచి 25 మంది అభ్యర్థులు తాము కోటీశ్వరులమని డిక్లరేషన్ ఇచ్చారు. బెంగళూరు నగరం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల సగటు ఆస్తి విలువ రూ. 24.48 కోట్లు. చిక్‌పెట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న యూసఫ్ షరీఫ్ ఆస్తుల విలువ అక్షరాలా రూ. 1,633 కోట్లు. గోవిందరాజనగర్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ప్రియకృష్ణ రూ. 1,156 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. హెబ్బాల్ నుంచి బరిలో ఉన్న సురేషా రూ. 648 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు.

రాజద్రోహ చట్టం అంటేనే రాచరికంలో జీవనం

- ఢిల్లీ లా యూనివర్సిటీ వీసీ బాజ్‌పాయ్

న్యూఢిల్లీ : రాజద్రోహం అనే పదం అంటేనే మనం రాచరిక పాలనలో జీవిస్తున్నామన్న భావన కలుగుతుందని ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జీఎస్ బాజ్‌పాయ్ వ్యాఖ్యానించారు. విద్వేషాన్ని, హింసను ప్రేరేపించిన తీవ్రమైన కేసులలోనే రాజద్రోహ చట్టాన్ని ఉపయోగించాలని ఆయన చెప్పారు. ఆధునిక భారతావనికి అనువుగా ఉండేలా ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇతర చట్టాలను తిరగరాసేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని తెలిపారు. 2010 నుండి ఇప్పటి వరకూ రాజద్రోహ చట్టం కింద 13 వేల మందిపై కేసులు పెట్టారని బాజ్‌పాయ్ చెప్పారు. అయితే వీరిలో శిక్ష పడిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) సమాచారం చెబుతోందని అన్నారు. ముందుగా రాజద్రోహం అనే పదాన్నే మార్చాలని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే అది మనం రాచరికంలో ఉన్నామన్న భావన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ చట్టం దుర్వినియోగం కాకుండా సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇచ్చిందని అన్నారు. ప్రజాస్వామిక దేశంలో ప్రాథమిక హక్కులపై రూపొందించిన చట్టాలను అమలు చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్వేషాన్ని రెచ్చగొట్టడం, హింసకు పాల్పడడం వంటి చర్యలు తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే రాజద్రోహ చట్టాన్ని అమలు చేయాలని బాజ్‌పాయ్ సూచించారు.


ఏఈఈ పరీక్షకు 51.7 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ శాఖల పరిధిలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల (ఏఈఈ) పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాతపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నిర్వహించిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సబ్జెక్టులకు 21,472 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 17,717 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పేపర్-1 పరీక్షకు 11,102 (51.7 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యాయరని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించిన పేపర్-2 పరీక్షను 11,028 (51.4 శాతం) మంది రాశారని తెలిపారు. 163 పోస్టుల భర్తీ కోసం గతేడాది సెప్టెంబర్ మూడో తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష నిర్వహణ కోసం 16 జిల్లాల్లో 78 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మంగళవారం అగ్రికల్చర్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో, సివిల్ ఇంజినీరింగ్‌కు ఓఎంఆర్ ఆధారిత పరీక్షను ఈనెల 21వ తేదీన రాతపరీక్షలను టీఎస్‌పీఎస్సీ నిర్వహించనుంది.

వారంలో మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్

- పీఆర్టీయూటీఎస్ నేతలకు మంత్రి సబిత హామీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వారం రోజుల్లో మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేస్తామంటూ పీఆర్టీయూటీఎస్ నేతలకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రిని పీఆర్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు గత పదేండ్లుగా బదిలీలు, పదోన్నతులు కల్పించకపోవడం వల్ల విద్యార్థులు, టీచర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారికి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వారం రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యేలా మార్గదర్శకాలను రూపొందించాలంటూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను ఆదేశించారని తెలిపారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు వీలుగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని, ఇందుకు తగిన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్, పీఆర్టీయూటీఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.